


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 247 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ గురువారం 16 జూలై 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 247 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD THU 16 JULY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur



## పాలమూరు రైతులకు త్వరలోనే శుభవార్త చెబుతాం

- 90 టీఎంసీల నీటి వినియోగానికి అనుమతులు సాధిస్తామని వెల్లడి
- మహబూబ్‌నగర్‌లో అమర రాజా తయారీ యూనిట్‌ను ప్రారంభించిన రేవంత్
- పరిశ్రమల్లో స్థానికులకే అత్యధిక ఉద్యోగాలు ఇవ్వాలని సూచన
- పాలమూరును ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దుతామని హామీ

హైదరాబాద్ పెన్ పవర్:పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సంబంధించి త్వరలోనే శుభవార్త వింటారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లిలో 'అమర రాజా గ్రూప్' నెలకొల్పిన తయారీ యూనిట్‌ను ప్రారంభించిన సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు.

- మిగతా 2లో

## ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి అమెజాన్ డేటా సెంటర్ మైలురాయి: సీఎం రేవంత్



- ఫ్యూచర్ సిటీలో అమెజాన్ డేటా సెంటర్‌కు రేవంత్ శంకుస్థాపన
- 2034 నాటికి తెలంగాణను లిలి1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగాలిలి తీర్చిదిద్దడమే లక్ష్యం
- ఫ్యూచర్ సిటీలో లిలిఫార్చ్యూన్-500 కంపెనీలకు ఆహ్వానంలిలి
- లిలిమెట్రో విస్తరణ, ఈవీ బస్సులు, మూసీ ప్రక్షాళనకులిలి ప్రాధాన్యం
- భూములు ఇచ్చిన రైతులకు పరిహారంలిలి అందించాలని అధికారులకు ఆదేశం

"2034 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం
- సీఎం రేవంత్ రెడ్డి"

ఫ్యూచర్ సిటీని ప్రపంచంలోనే అత్యాధునిక నగరంగా తీర్చిదిద్దాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అమెజాన్ డేటా సెంటర్ ఏర్పాటు ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి కీలక మైలురాయిగా నిలుస్తుందని, దీనివల్ల మరిన్ని పెట్టుబడులు, అంతర్జాతీయ పరిశ్రమలు రాష్ట్రానికి వచ్చే అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు.




వివరాలు 2లో..

### మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం

**మెట్రో విస్తరణ**
నగరవ్యాప్తంగా మెట్రో సేవల విస్తరణ

**ఈవీ బస్సులు**
డీజిల్ బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సుల ప్రవేశం.

**జీరో ట్యాక్స్**
ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలుపై జీరో ట్యాక్స్.

**మూసీ ప్రక్షాళన**
మూసీ నది పునరుద్ధరణ, కాలుష్య నిర్మూలన.

### అభివృద్ధి ప్రణాళిక

**కోర్ అర్బన్ రీజియన్**



- మెట్రో విస్తరణ
- ఈవీ బస్సుల ప్రవేశం
- జీరో ట్యాక్స్‌తో ఎలక్ట్రిక్ వాహనాల ప్రోత్సాహం
- మూసీ నది ప్రక్షాళన, కాలుష్య నిర్మూలన

**మ్యాన్యుఫ్యాక్చరింగ్ జోన్**



ఔటర్ రింగ్ రోడ్డు నుంచి రీజినల్ రింగ్ రోడ్డు వరకు 10 కిలోమీటర్ల పరిధిలో పరిశ్రమల అభివృద్ధి
తయారీ రంగంలో భారీ పెట్టుబడుల ఆకర్షణ
కొత్త పరిశ్రమలు, ఉపాధి అవకాశాల సృష్టి

### రైతులకు భరోసా



- ఫ్యూచర్ సిటీ కోసం భూములు ఇచ్చిన రైతులకు తగిన పరిహారం
- రైతుల ప్రయోజనాలకు పూర్తి రక్షణ
- అభివృద్ధిలో రైతులను భాగస్వాములను చేయడం



## కేంద్రమంత్రి కుమారస్వామితో కేటీఆర్ భేటీ.. కీలక విజ్ఞప్తి

- ఆదిలాబాద్ సీసీఐ ఫ్యాక్టరీ పునరుద్ధరణపై కేంద్రమంత్రితో కేటీఆర్ భేటీ
- కేంద్ర, రాష్ట్రాలు చెరో రూ.250 కోట్లు ఇస్తే ప్లాంట్ ప్రారంభించవచ్చని ప్రతిపాదన
- ప్లాంట్ తెరిస్తే 6,000 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభిస్తుందని వివరణ
- కేటీఆర్ వినతిపై సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి కుమారస్వామి
- హామీ నెరవేర్చకపోతే ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించిన కేటీఆర్

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణలోని ఆదిలాబాద్‌లో గత కొన్నేళ్లుగా మూతపడి ఉన్న సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కర్మాగారాన్ని తక్షణమే పునరుద్ధరిం చాలని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామితో సమావేశమైన ఆయన, ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు.కేటీఆర్‌తో పాటు సీసీఐ సాధన

- మిగతా 2లో

## క్రిప్టోపై ఆ వార్తలు అవాస్తవం.. కేంద్రం క్లారిటీ



పెన్ పవర్ డెస్క్:క్రిప్టో కరెన్సీని నియంత్రించే అంశంపై ఆలోచించాల్సిందిగా ఆర్‌బీఐ, సెబీలను ఆర్థిక మంత్రిత్వ శాఖ సూచించినట్లు సామా జిక మాధ్యమాల్లో జరుగుతున్న

- మిగతా 2లో




## తెలంగాణలో 'ఎస్ఐఆర్' గడువు పొడిగింపు


- తెలంగాణ, కర్ణాటక సహా నాలుగు రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా సవరణ గడువు పొడిగింపు
- ఇంటింటి సర్వే కోసం బూత్ లెవల్ అధికారులకు అదనపు సమయం
- తెలంగాణలో ఆగస్టు 10న ముసాయిదా, అక్టోబర్ 12న తుది జాబితా
- కర్ణాటకలో ఆగస్టు 17న ముసాయిదా, అక్టోబర్ 19న తుది జాబితా విడుదల

- మిగతా 2లో

## తెలంగాణలో వింత వాతావరణం.. నేడు 5 జిల్లాలకు ఉక్కపోత హెచ్చరిక!

- తెలంగాణలో జులై 22 వరకు పొడి వాతావరణం
- 5 జిల్లాల్లో వేడి, ఉక్కపోత ఉంటుందని ఐఎండీ హెచ్చరిక
- రాష్ట్రంలోని 28 జిల్లాల్లో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం
- పలు జిల్లాల్లో వర్షాభావం, హన్మకొండలో 65 శాతం లోటు నమోదు
- హైదరాబాద్‌లో 36 డిగ్రీల వరకు చేరనున్న గరిష్ఠ ఉష్ణోగ్రత

- మిగతా 2లో



## 50 నామినేటెడ్ పదవులు ఈ నెలలోనే భర్తీ: టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్



- మంచి పనితీరు కనబరిచిన వారిని రెన్యువల్ చేస్తామన్న మహేశ్ గౌడ్
- పార్టీ పదవులపై మీనాక్షి నటరాజన్‌తో చర్చించామని వెల్లడి
- మండల కమిటీలలో డీసీసీల రిపోర్ట్ ఫైనల్ అని స్పష్టీకరణ

- మిగతా 2లో

## తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లేఖ



- షాబాద్ ఘటనపై రేవంత్ రెడ్డికి పవన్ కల్యాణ్ లేఖ
- పోక్సో చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని విజ్ఞప్తి
- పోక్సో కేసు నిందితుడు ఆరుగురిని హత్య చేసిన వైనం
- పోలీసుల వైఫల్యం వల్లే ఈ ఘోరం జరిగిందని పవన్ ఆరోపణ
- బాధితులకు రక్షణ కల్పించడంలో విఫలమయ్యారని విమర్శ

- మిగతా 2లో

## ఇరాన్ పై పట్టపగలే విరుచుకుపడిన అమెరికా

### గల్ఫ్ మొత్తానికి వార్నింగ్ ఇచ్చిన ఇరాన్



**పెన్ పవర్ డెస్క్:** ఇరాన్ పై మరో సారి తీవ్రంగా దాడులు చేస్తుంది అమెరికా. పట్టపగలు.. ఉదయాన్నే ఈ దాడులు చేయటం ఇరాన్ దేశానికి ఊహించని షాక్. ఇరాన్ దేశ వ్యాప్తంగా ఉన్న ఓడరేవులపైనే కాకుండా.. హర్మూజ్ జల సంధి సమీపంలో ఉన్న ఓడరేవులపై డ్రోన్ బాంబులతో విరుచుకుపడింది అమెరికా. 2026, జూలై 15వ తేదీ ఉదయం 6 గంటల నుంచే ఈ దాడులు మొదలుపెట్టాం అని..

- మిగతా 2లో




## పోక్సో కేసులో.. జగిత్యాల కోర్టు సంచలన తీర్పు... ఐదుగురికి జీవిత ఖైదు..

- 2020లో మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన మైనర్ బాలిక గ్యాంగ్‌రేప్ కేసులో తీర్పు
- ఐదుగురు నిందితులకు జీవిత ఖైదు, ఒక్కొక్కరికి రూ.20 వేల జరిమానా
- బాధిత బాలికకు రూ.12 లక్షల పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశం
- పటిష్ట ఆధారాలతో కేసు నిరూపించిన పోలీసులు, ప్రాసిక్యూషన్

- మిగతా 2లో

**దోషులకు విధించిన శిక్ష**

జీవిత ఖైదు + రూ.20,000 జరిమానా

బాధిత మైనర్ బాలికకు రూ.12 లక్షల పరిహారం

జగిత్యాల జిల్లాలో సంచలనం రేపిన మైనర్ బాలిక గ్యాంగ్‌రేప్ కేసులో ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక పోక్సో కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. 2020లో మెట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ కేసులో ఐదుగురు నిందితులను దోషులుగా తేల్చిన కోర్టు వారికి జీవిత ఖైదు విధించింది.




### వానల్లేవు...ఉష్ణోగ్రతలు తగ్గడం లేదు..

## ఇక కరువు ఇంటి ముందే

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో భారీ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండాకాలం ఇంకా పోలేదు. మార్చి నెలలో ప్రారభమయిన వేసవి నేటికీ కొనసాగుతుంది. గత కొన్ని రోజులుగా రెండు తెలుగు రాష్ట్రాల్లో వానలు లేవు. అలాగని వాతావరణం కూడా చల్లబడలేదు. భారత వాతావరణ శాఖ ఈ నెల 20వ తేదీ నుంచి 30వ తేదీ వరకూ వానలు పడతాయని చెప్పింది. అయితే రెండు తెలుగు రాష్ట్రాల్లో వానలు పడతాయా? లేదా? అన్న సందేహం మాత్రం ఇంకా ప్రజలను వీడటం లేదు. ఎందుకంటే జులై నెల చివరి నాటికి కూడా ఉష్ణోగ్రతలు తగ్గకపోవడం, వానలు కురియకపోవడంతో సాగు, తాగు నీటికి ఇబ్బందులు ఎదరవుతాయి. ఎల్ నినో ప్రభావం వచ్చే ఏడాది జూన్ వరకూ కొనసాగుతుందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

**ఏపీలో వానలు...**

ఆంధ్రప్రదేశ్ లో కరవు ఛాయలు అలుముకుంటున్నాయి. ఇప్పటికే వందలాది మండలాల్లో కరువు నెలకొందని ప్రభుత్వం ప్రకటించింది. నైరుతి రుతుపవనాలు ప్రవేశించి నెల రోజులవుతున్నా వానలు పడటం లేదు. అలాగే అల్పపీడనం, తుపానులు, వాయుగుండాలతో కూడా ప్రయోజనం లేకపోయిందని రైతులు వాపోతున్నారు. అవసరమైన సమయంలో వానలు పడవని, పంటలు ఏపుగా ఎదిగిన సమయంలో భారీ వర్షాలు కురిసి తమను నిలువునా ముంచేస్తున్నాయని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. ప్రాజెక్టుల వద్ద కూడా నీరు అనుకున్న స్థాయిలో లేదు. ఎగువ రాష్ట్రాల్లో కురిసిన భారీ వర్షాలకు ప్రాజెక్టులు నిండాల్సిందేనని అధికారులు కూడా చేతులెత్తేస్తున్నారు.

**తెలంగాణలోనూ వానలు...**

తెలంగాణలోనూ వానలు పడటం లేదు. ఉష్ణోగ్రతలు కూడా క్రమంగా పెరుగుతున్నాయి. అలాగే హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనాలు కూడా వాస్తవ రూపం దాల్చడం లేదు. జూన్ నెల నుంచి పడాల్సిన వానలు నేటికీ పడకపోవడంతో రైతులు సాగుకు దూరమయ్యారు. పంటలు వేసి నష్టపోయే కన్నా, ఇంట్లో ఉండటమే మేలన్న అభిప్రాయంలో ఉన్నారు. విత్తనాలు, పురుగు మందులు కొనుగోలుకు అప్పులు చేసి నష్టపోయే కన్నా ఏమీ వేయకుంటే అప్పులకు దూరంగా ఉంటామన్న భావన అన్నదాతల్లో ఉంది. అయితే హైదరాబాద్ వాతావరణ శాఖ చెప్పిన అంచనాల ప్రకారం అక్కడకక్కడ వానలు పడతాయని చెబుతున్నప్పటికీ, తేలిక పాటి వానలు, మోస్తరు వర్షాలు మాత్రమే పడుతున్నాయి. సాగుకు అవసరమైన వానలు పడకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

## పాలమూరు రైతులకు త్వరలోనే శు భవార్త చెబుతాం

- మొదటి పేజి తరువాయి

ఈ ప్రాజెక్టు ద్వారా 90 టీఎంసీల నీటిని వినియోగించుకునేలా కేంద్రంతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని ఒప్పించి, అవసరమైన అనుమతులు సాధించే దిశగా అడుగులు వేస్తున్నామని ప్రకటించారు. అదేవిధంగా, డిండి ప్రాజెక్టుకు 30 టీఎంసీల నీటి కేటాయింపులపై కూడా చర్చలు కొనసాగుతున్నాయని వెల్లడించారు.కృష్ణా బేసిన్ పరిధిలోని దిండి, పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి తదితర ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేసి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను సస్యశ్యామలం చేసే బాధ్యతను తాను స్వీకరిస్తానని సీఎం హామీ ఇచ్చారు. అత్యంత వెనుకబడిన ఈ ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నిలిపి, ఒక ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పరిశ్రమల స్థాపన కోసం భూములిచ్చిన రైతులకు తగిన న్యాయం జరగాలని, అలాగే స్థానిక యువతకే గరిష్ట స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పించాలని యాజమాన్యానికి సూచించారు.అంతకుముందు, అమర రాజా గిగా కారిడార్‌లో ఏర్పాటు చేసిన 'కస్టమర్ క్వాలిఫికేషన్ ప్లాంట్' తయారీ యూనిట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. పర్యావరణ మార్పుల నేపథ్యంలో కాలుష్య నియంత్రణకు ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) వినియోగం పెరగాల్సిన అవసరం ఉందని, ఈ తరుణంలో బ్యాటరీల తయారీ యూనిట్‌ను ఇక్కడ స్థాపించడం ముదావాహమని పేర్కొన్నారు. స్థానిక యువతకు పెద్దపీట వేస్తూ ఉపాధి కల్పిస్తున్న అమర రాజా సంస్థ యాజమాన్యాన్ని ఈ సందర్భంగా ఆయన అభినందించారు.రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో 'తెలంగాణ రైజింగ్ 2047' ప్రణాళికను రూపొందించామని, పారిశ్రామిక విధానాల్లో మరిన్ని సంస్కరణలు తీసుకొచ్చామని సీఎం వివరించారు. అంతర్జాతీయ సంస్థలతో పోటీ పడుతూ అమరరాజా గ్రూప్ దేశానికి గర్వకారణంగా నిలుస్తోందని ఆయన ప్రశంసించారు.

# ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి అమెజాన్ డేటా సెంటర్ మైలురాయి

ఫ్యూచర్ సిటీని ప్రపంచంలోనే అత్యాధునిక నగరంగా తీర్చిదిద్దాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అమెజాన్ డేటా సెంటర్ ఏర్పాటు ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి కీలక మైలురాయిగా నిలుస్తుందని, దీనివల్ల మరిన్ని పెట్టుబడులు, అంతర్జాతీయ పరిశ్రమలు రాష్ట్రానికి వచ్చే అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. ఫ్యూచర్ సిటీలో అమెజాన్ డేటా సెంటర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసిన సందర్భంగా మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఫ్యూచర్ సిటీలో ఫార్చ్యూన్-500 కంపెనీలను ఆహ్వానిస్తున్నామని రేవంత్ తెలిపారు. గతేడాది నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌కు 108 దేశాల నుంచి పరిశ్రమలు పాల్గొన్నాయని గుర్తు చేశారు. 2034 నాటికి తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యమన్నారు. 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దతామని పేర్కొన్నారు. 2047 నాటికి దేశం 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యంలో తెలంగాణ వాటా 10 శాతం ఉండేలా కృషి చేస్తామని అన్నారు. ఈ లక్ష్యాల సాధనకు భారీ పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ఉపాధి అవకాశాలు అవసరమని, అందుకే 'తెలంగాణ రైజింగ్' విధానాన్ని తీసుకొచ్చామని చెప్పారు. ఫ్యూచర్ సిటీ అభివృద్ధి కోసం మంత్రులు, అధికారులు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు.హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా మార్చేందుకు నగరంలోని పరిశ్రమలను దశలవారీగా తరలిస్తామని, మెట్రో విస్తరణ చేపడతామని సీఎం వెల్లడించారు. డీజిల్ తో నడిచే ఆర్టీసీ బస్సులను నగరం వెలుపలికి తరలించి, వాటి స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నగరంలో ఎలక్ట్రిక్ వాహనాలు కొనుగోలు చేసే వారికి జీరో ట్యాక్స్ విధించే నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. మూసీ నదిని పూర్తిగా ప్రక్షాళన చేసి కాలుష్య రహితంగా మారుస్తామని, మెట్రో విస్తరణ, మూసీ పునరుద్ధరణ, పరిశ్రమల తరలింపుతో కూడిన ప్రాంతాన్ని 'కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్)'గా అభివృద్ధి చేస్తామని వివరించారు. ఈ ప్రాంతాన్ని భవిష్యత్తులో సేవల రంగానికి అనుగుణంగా

పునర్నిర్మిస్తామని చెప్పారు. అలాగే ఔటర్ రింగ్ రోడ్డు వెలుపల నుంచి రీజినల్ రింగ్ రోడ్డు వరకు 10 కిలోమీటర్ల పరిధిని తయారీ పరిశ్రమల (మ్యాన్యుఫ్యాక్చరింగ్) జోన్‌గా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు.ఫ్యూచర్ సిటీ కోసం భూములు ఇచ్చిన రైతుల సేవలను ప్రభుత్వం ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని రేవంత్ అన్నారు. వారికి ఎలాంటి నష్టం జరగకుండా తగిన పరిహారం అందించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

## తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లేఖ

తెలంగాణ రాష్ట్రం షాబాద్‌లో చోటుచేసుకున్న ఘోర సామూహిక హత్యల ఘటనపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన బుధవారం ఒక లేఖ రాశారు. పోక్సో చట్టాన్ని మరింత పకడ్బందీగా అమలు చేయాలని, బాధితులకు పూర్తిస్థాయి భద్రత కల్పించేలా కఠిన చర్యలు చేపట్టాలని ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు.షాబాద్‌లో జరిగిన ఈ దారుణ ఉదంతాన్ని పవన్ కల్యాణ్ తన లేఖలో ప్రధానంగా ప్రస్తావించారు. పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న రాజ్‌కుమార్, 16 ఏళ్ల బాధితురాలితో పాటు ఆమె తల్లి, నానమ్మను పొట్టనబెట్టుకున్నాడు. ఆ తర్వాత తనతో గొడవపడుతుందని భార్య, ఇద్దరు పిల్లలను చంపేసి, ఆపై తాను కూడా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ దారుణం వ్యవస్థీకృత వైఫల్యానికి నిదర్శనమని పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. పోక్సో కేసుల్లో దర్యాప్తులో నిర్దిష్ట కాలపరిమితిని పాటించాలని, సాక్ష్యాధారాలు తారుమారుకు తావులేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.సదరు కేసులో నిందితుడికి ముందస్తు బెయిల్ లభించడం,

అదే సమయంలో బాధితుల కుటుంబానికి తగిన రక్షణ కల్పించడంలో పోలీసులు విఫలమవడంపై పవన్ తీవ్ర విమర్శలు గుప్పించారు. పోక్సో కేసులకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని సుప్రీంకోర్టు గతంలో పలుమార్లు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.

## తెలంగాణలో 'ఎస్ఐఆర్' గడువు పొడిగింపు

తెలంగాణతో పాటు పలు రాష్ట్రాలలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది. ఎన్యుమరేటర్లు వచ్చే నెల 3వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తారని స్పష్టం చేసింది.తెలంగాణ, పంజాబ్ రాష్ట్రాల్లో జూన్ 25న ప్రారంభమైన ఇంటింటి సర్వే గడువును ఆగస్టు 3 వరకు పొడిగించారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను కూడా ఇదే తేదీలోగా పూర్తి చేయనున్నారు. తెలంగాణలో ఆగస్టు 10న, పంజాబ్‌లో ఆగస్టు 13న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణకు తెలంగాణలో సెప్టెంబర్ 9 వరకు, పంజాబ్‌లో సెప్టెంబర్ 12 వరకు అవకాశం కల్పించారు. అనంతరం, అక్టోబర్ 12న రెండు రాష్ట్రాల్లోనూ తుది ఓటర్ల జాబితాను విడుదల చేస్తారు.

ఢిల్లీ, కర్ణాటక రాష్ట్రాల్లో జూన్ 30న ప్రారంభమైన ఇంటింటి సర్వే గడువును ఆగస్టు 8 వరకు పొడిగించారు. ఆగస్టు 17న ముసాయిదా జాబితాను విడుదల చేసి, సెప్టెంబర్ 16 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. అన్ని ప్రక్రియలను పూర్తి చేసి, అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితాను వెల్లడిస్తారు.

బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓ) చేపట్టే ఇంటింటి సర్వేలో భాగంగా నకిలీ ఓట్లు తొలగింపు, మరణించిన వారి పేర్ల తొలగింపు, చిరునామా మార్పులు వంటి సవరణలు చేపడతారు. సవరించిన గడువులను కచ్చితంగా పాటించాలని ఆయా రాష్ట్రాల ఎన్నికల ప్రధాన అధికారులను కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది.

## తెలంగాణలో వింత వాతావరణం.. నేడు 5 జిల్లాలకు ఉక్కపోత హెచ్చరిక!

తెలంగాణలో రుతుపవనాలు బలహీనపడటంతో వర్షాకాలంలోనూ పొడి వాతావరణం కొనసాగుతోంది. రాష్ట్రంలో వర్షపాతం లోటు ఆందోళన కలిగిస్తుండగా, మరోవైపు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో, రేపు (జులై 16) ఐదు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో వేడి, ఉక్కపోతతో కూడిన వాతావరణం ఉంటుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది.బుధవారం విడుదల చేసిన బులెటిన్ ప్రకారం.. ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో గురువారం తీవ్రమైన ఉక్కపోత ప్రభావం చూపే అవకాశం ఉంది. వీటితో పాటు రాష్ట్రంలోని 28 జిల్లాల్లో బలమైన ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. హైదరాబాద్, దాని పరిసర ప్రాంతాల్లో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుందని, గరిష్ఠ ఉష్ణోగ్రత 36 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 26 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా జులై 22 వరకు పొడి వాతావరణమే కొనసాగుతుందని, తేలికపాటి జల్లులు మినహా భారీ వర్షాలకు అవకాశం లేదని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే పలు జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఒక్క హన్మకొండ జిల్లాలోనే ఈ జులై నెలలో ఇప్పటివరకు 65 శాతం వర్షపాతం లోటు నమోదైంది. పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతుండగా, ఇటీవల నల్గొండలో 38.9 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత రికార్డయింది.

బంగాళాఖాతంలో అల్పపీడనం ఉన్నప్పటికీ, రుతుపవన ద్రోణి రాష్ట్రంలో వర్షాలకు

అనుకూలంగా లేకపోవడమే ఈ పరిస్థితికి కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. రానున్న మూడు రోజుల్లో గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని ఐఎండీ వెల్లడించింది.

## కేంద్రమంత్రి కుమారస్వామితో కేటీఆర్ భేటీ.. కీలక విజ్ఞప్తి

- మొదటి పేజి తరువాయి

సమితి ప్రతినిధులు, రైతులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జోగు రామన్న, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తదితరులతో కూడిన ప్రతినిధి బృందం కేంద్రమంత్రిని కలిసింది. ఈ ప్లాంట్ పునరుద్ధరణ ద్వారా వెనుకబడిన ఆదిలాబాద్ ప్రాంతం యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని, తద్వారా ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని కేటీఆర్ వివరించారు.

దాదాపు 2,300 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ ప్లాంట్‌కు ఏటా 4 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యం ఉందని, సుమారు 100 ఏళ్లకు సరిపడా సున్నపురాయి నిల్వలు అక్కడ ఉన్నాయని కేటీఆర్ గుర్తుచేశారు. ఇంతటి విలువైన ప్రభుత్వ ఆస్తి నిరుపయోగంగా మారి తుప్పు పట్టకుండా కాపాడాలని ఆయన కోరారు. సుమారు రూ.2,000 కోట్ల పెట్టుబడితో అక్కడ అత్యాధునిక ప్లాంట్‌ను ఏర్పాటు చేయవచ్చని ప్రతిపాదించారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో రూ.250 కోట్ల చొప్పున 'వయబిలిటీ గ్యాప్ ఫండింగ్' అందిస్తే, ప్లాంట్ కార్యకలాపాలను పునఃప్రారంభించవచ్చని కేటీఆర్ సూచించారు. దీనివల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 6,000 మందికి ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. కేటీఆర్ విన్నపంపై కేంద్రమంత్రి కుమారస్వామి సానుకూలంగా స్పందించారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు అందించిన తరహాలోనే ఇక్కడి ప్లాంట్‌కు కూడా మద్దతు ఇవ్వాలని, లేనిపక్షంలో ఫ్యాక్టరీని తెరిపించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని కేటీఆర్ స్పష్టం చేశారు.

**మీడియాతో మాట్లాడిన కేటీఆర్**

ఢిల్లీలో కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ, బీఆర్ఎస్ పోరాటం, ఆందోళన తెలంగాణ ప్రయోజనాల కోసమే అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై వ్యక్తిగతంగా తనకు ఎలాంటి ద్వేషం లేదని, అయితే ఆయన తీసుకుంటున్న

ప్రజా వ్యతిరేక నిర్ణయాలను మాత్రమే తాము ప్రశ్నిస్తున్నామని తెలిపారు. ప్రజల దృష్టిని మళ్లించడంలో రేవంత్ రెడ్డి అందెవేసిన చేయి అని, ఆ విద్యలో ఆయన ఇప్పటికే నాలుగైదు పీహెచ్‌డీలు చేశారని ఎద్దేవా చేశారు.రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి 31 నెలలు గడుస్తున్నా, ఇప్పటికీ తమ పార్టీనే లక్ష్యంగా చేసుకోవడంపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ చచ్చిన పార్టీ అని వ్యాఖ్యానిస్తున్న ముఖ్యమంత్రి, మరి మళ్లీ తమ పార్టీనే ఎందుకు టార్గెట్ చేస్తున్నారని ప్రశ్నించారు.

రేవంత్ రెడ్డి బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని, దీనిపై రాహుల్ గాంధీ ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వం కావాలనే రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. ముఖ్యమంత్రి 76 పర్యాయాలు ఢిల్లీకి వెళ్లినా, రాష్ట్రానికి కనీసం 76 పైసలైనా తీసుకువచ్చారా అని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ సహా పలు అంశాల్లో ఆధారాలు లేకుండా తమపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.

## పోక్సో కేసులో జగిత్యాల కోర్టు సంచలన తీర్పు... ఐదుగురికి జీవిత ఖైదు..

జగిత్యాల జిల్లాలో సంచలనం రేపిన మైనర్ బాలిక గ్యాంగ్ రేప్ కేసులో సంచలన తీర్పునిచ్చింది కోర్టు. 2020లో మెట్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఘటనపై బుధవారం ( జులై 15 ) తీర్పు వెల్లడించింది కోర్టు.ఈ కేసుకు సంబంధించి ఐదుగురు నిందితులను దోషులుగా తేల్చిన ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక పోక్సో కోర్టు.. వారికీ జీవిత ఖైదు విధించింది. అంతే కాకుండా.. ఒక్కో దోషికి రూ.20 వేల జరిమానా విధించిన కోర్టు.. బాధిత మైనర్ బాలికకు రూ.12 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించింది. పటిష్ట ఆధారాలతో పోలీసులు, ప్రాసిక్యూషన్ కేసు నిరూపించడంతో ప్రిన్సిపల్ జిల్లా సెషన్స్ జడ్జి రత్న పద్మావతి కీలక తీర్పు వెల్లడించారు.ఇటీవల షాబాద్ లో పోక్సో కేసు నిందితుడు బెయిల్ పై వచ్చి మారణకాండ సృష్టించి చివరికి తానూ ఆత్మహత్య చేసుకున్న ఘటన కలకలం రేపిన క్రమంలో జగిత్యాల పోక్సో కేసు తీర్పు ప్రాధాన్యత సంతరించుకుంది. పోక్సో కేసు నిందితులకు బెయిల్ మంజూరు చేయకుండా... వీలైనంత త్వరగా కేసు నిరూపించి శిక్ష విధించాలని కోరుతున్నారు జనం.

## ఇరాన్ పై పట్టపగలే విరుచుకుపడిన అమెరికా

- మొదటి పేజి తరువాయి

హర్మూజ్ జలసంధిపై ఇరాన్ ఆధిపత్యాన్ని దెబ్బతీయటమే లక్ష్యంగా ఈ దాడులు చేస్తున్నట్లు ప్రకటించింది అమెరికా సెంట్రల్ కమాండ్. హర్మూజ్ జలసంధి మీదుగా వెళుతున్న ఆయిల్ నౌకలపై దాడి చేయటానికి ఇరాన్ దళాలు ఉపయోగిస్తున్న సైనిక స్థావరాలను నాశనం చేయటం.. ఆ సైనిక స్థావరాల్లోని ఆయుధాలను ధ్వంసం చేయటం లక్ష్యంగా ఈ దాడులు చేస్తున్నట్లు ప్రకటించింది అమెరికా. గ్రేటర్ తున్బ్ ద్వీపం లక్ష్యంగా ఈ దాడులు చేసింది అమెరికా. ఆ ద్వీపంలో ఇరాన్ రక్షణ వ్యవస్థలు, క్రూయిజ్ క్షిపణి నిల్వలు, క్షిపణి ప్రయోగ స్థావరాలు ఉన్నట్లు చెబుతుంది అమెరికా. వాటిని ధ్వంసం చేయటం ద్వారా హర్మూజ్ జలసంధిని ఓపెన్ చేయొచ్చన్న లక్ష్యంతోనే ఈ దాడులు చేసినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. హర్మూజ్ జల సంధిని శాశ్వతంగా మూసి వేయటంతోపాటు పశ్చిమ ఆసియా దేశాల నుంచి ఆయిల్, గ్యాస్ ఎగుమతులను పూర్తిగా నిలిపివేస్తామని ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్.. IRGC ప్రకటించిన 24 గంటల్లోనే ఈ దాడులు చేసింది అమెరికా. ఇరాన్ దేశంపై ఎగుమతుల ఆంక్షలు తొలగించే వరకు.. గల్ఫ్ దేశాల నుంచి ఆయిల్ ఎగుమతులను పూర్తిగా అడ్డుకుంటామని ×=+జ ప్రకటించిన తర్వాత అమెరికా తన దాడుల తీవ్రతను పెంచింది. ఇన్నాళ్లు రాత్రి సమయాల్లోనే దాడులు చేసిన అమెరికా.. ఇప్పుడు పట్టపగలు బాంబులతో విరుచుకుపడుతుంది. అమెరికా, ఇరాన్ దేశాల మధ్య చర్చలు నిలిచిపోయిన 24 గంటల్లోనే.. హర్మూజ్ నుంచి వెళ్లాల్సిన 2 నౌకలను అడ్డుకున్నాయి ఇరాన్ దళాలు. హర్మూజ్ జల సంధిని పూర్తిగా మూసివేస్తామని.. అదే విధంగా గల్ఫ్ దేశాల నుంచి ఎగుమతులను అడ్డుకుంటామని మరోసారి హెచ్చరించింది ఇరాన్. ఈ క్రమంలోనే ప్రపంచ వ్యాప్తంగా ఆయిల్, గ్యాస్, ఎరువులు, నిత్యావసరాల ధరలు మళ్లీ పెరిగే ప్రమాదం లేకపోలేదని పశ్చిమాశియా దేశాలు ఆందోళన చెందుతున్నాయి.

## క్రిప్టోపై ఆ వార్తలు అవాస్తవం.. కేంద్రం క్లారిటీ

- మొదటి పేజి తరువాయి

ప్రచారాన్ని కేంద్రం ఖండిం చింది. అవన్నీ అవాస్తవాలని కొట్టిపారేసింది. అలాంటి ప్రతిపాదనలేవీ లేవని స్పష్టం చేసింది. ఈ మేరకు పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం ఎక్స్ వేదికగా స్పందించింది. క్రిప్టో కరెన్సీపై ఆర్థిక మంత్రిత్వ శాఖ నుంచి ఎలాంటి ఆదేశాలు జారీకాలేదని కేంద్రం పేర్కొంది. క్రిప్టోను ఒక చట్టబద్ధమైన ఆస్తిగా పరిగణించడం లేదని స్పష్టం చేసింది. ఇలాంటి వదంతులను నమ్మొద్దని తెలిపింది. విశ్వసనీయం సమాచారం కోసం అధికారిక వెబ్‌సైట్‌లనే సందర్శించాలని సూచించింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా తప్పుడు కథనాలు వ్యాప్తి జరిగినప్పుడు వెంటనే కేంద్రం దృష్టికి తీసుకురావాలని కోరింది. ఇందుకు o91 8799711259 నంబర్‌కు కాల్ చేసి తెలియజేయాలని లేదంటే factcheck@pib.gov.in మెయిల్ చేయాలని సూచించింది.

## 50 నామినేటెడ్ పదవులు ఈ నెలలోనే భర్తీ: టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

రాష్ట్రంలో 50 నామినేటెడ్ పదవులను ఈ నెలలోనే భర్తీ చేస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటించారు. ప్రస్తుతం మంచి పనితీరు కనబరిచిన వారిని రెన్యువల్ చేసే అవకాశం ఉందన్నారు. డీసీసీల పనితీరు బాగోలేకపోతే మార్చే అవకాశం ఉందని వెల్లడించారు. పార్టీ పదవులపై మీనాక్షి నటరాజన్‌తో చర్చించామని తెలిపారు. రెండు రోజుల్లో సీఎం రేవంత్ రెడ్డితో భేటీ అవుతామన్నారు. మండల కమిటీలలో డీసీసీల రిపోర్ట్ ఫైనల్ అని స్పష్టం చేశారు. ఎంపీ రేణుకా చౌదరితో కూడా మాట్లాడానని మహేశ్ తెలిపారు. ఖమ్మంలో బీజేపీ, బీఆర్ఎస్ రెండూ కూడా కాంగ్రెస్ వైపు చూస్తున్నట్టుగా రేణుక తనతో చెప్పారని అన్నారు. కానీ ఆ వ్యాఖ్యలపై దుష్ప్రచారం చేశారు అని తెలిపారు. కూనంనేనితో తమకెలాంటి విభేదాలూ లేవన్నారు. స్థానికంగా ఉన్న సమస్యలను స్థానికంగానే పరిష్కరించుకోవాలని చెప్పారు. ప్రతి చిన్న విషయానికీ గాంధీభవన్ కు రావటం మానుకోవాలని క్యాడర్‌కు సూచించారు.

పెన్ పవర్
తెలంగాణ రౌండప్

# రేవంత్ పాలనలో హైదరాబాద్ ఐటీ రంగం దిగజారుతోంది..
## కాగ్నిజెంట్ విశాఖకు వెళుతోంది: దాసోజు శ్రవణ్



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ అనగానే ఒకప్పుడు చార్మినార్ గుర్తొచ్చేదని... ఇప్పుడు ఐటీ, ఫార్మా పరిశ్రమలకు హైదరాబాద్ పేరుగాంచిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ కుమార్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ, వేగంగా పురోగమిస్తున్న నగరాలలో హైదరాబాద్ ఒకటిగా ఉన్న పరిస్థితి నుంచి రేవంత్ పాలనలో దిగజారే దాకా వెళుతోందన్నారు. 2014లో 50 వేల కోట్ల రూపాయలు ఉన్న ఐటీ ఎగుమతులను 2023లో 2 లక్షల కోట్లు దాటేలా కేటీఆర్ శ్రమించారు. 3 లక్షల ఐటీ ఉద్యోగాల స్థాయి నుంచి కేటీఆర్ 9 లక్షల ఐటీ ఉద్యోగాల స్థాయికి హైదరాబాద్‌ను మార్చారని గుర్తు చేశారు. ఇప్పుడు అందరూ సిగ్గుపడేలా పరిస్థితి మారిందన్నారు. రేవంత్ రెడ్డి 18 గంటలు కష్టపడి ఐటీ పరిశ్రమను చంపేసే పని చేస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్‌కు కాగ్నిజెంట్ రాంరాం అన్నదని... 15 వేల నుంచి 20 వేల ఉద్యోగాలు కల్పించే కాగ్నిజెంట్ విశాఖకు తరలుతోందని

- మిగతా 5లో...

# అక్రమ నిర్మాణాలకు..! అమ్ముడు పోతున్నారా..?




నోటీసులు- సీజింగ్‌లు- కూల్చివేతలు చేపట్టిన అక్రమ నిర్మాణం ఇదే..

- ●తాజా టిఫిన్స్ పక్కన 'ఏసిపి' చర్యలు దేనికి సంకేతం..? ముడుపుల కోసమా..?
- ●ఈ అక్రమ కట్టడానికి "గెలుపెరుగని" ఓ అధికారపార్టీ నేత సిఫార్సులట..?

- అక్రమ సెల్లార్-అదనపు అంతస్తులు- పార్కింగ్‌లో కమర్షియల్ షట్టర్‌లు..!
- మొత్తానికి అధికారుల అండతో కమర్షియల్ కాంప్లెక్స్ భవనం సిద్ధం..!
- అద్దెకు ఇవ్వబడును అని బోర్డులు కూడా పెట్టారు..! ముడుపులిచ్చి ఊరుకుంటారా మరి..?
- రెసిడెన్షియల్ అక్రమ భవనం.. వ్యాపార సముదాయంగా ఎలా మారింది..?
- దుండిగల్ డిప్యూటీ కమిషనర్ మౌనం వీడి సమాధానం ఇవ్వాలి..?
- పట్టణ ప్రణాళికా విభాగం అంటే..! అధికారుల వారసత్వ సంపదనా..?
- నెలనెలా తీసుకుంటున్న 'జీతం' ప్రజల సొమ్ము..! మీ పూర్వీకుల ఆస్తులు కాదు..!

-4 లో

## బంజారాహిల్స్ తాజ్ హోటల్ కూల్చివేత! భారీ టవర్ నిర్మాణానికి సన్నాహాలు

- కూల్చివేత పనుల్లో హైదరాబాద్ తాజ్ బంజారా హోటల్
- హోటల్ స్థానంలో 40 అంతస్తుల భారీ భవనం నిర్మాణం
- రూ.315 కోట్లకు ఆస్తిని దక్కించుకున్న అరబిందో రియాల్టీ
- పన్ను బకాయిల కారణంగా 2023లోనే మూతపడిన హోటల్
- 1979లో ప్రారంభమైన ఈ హోటల్‌కు నగరంలో ప్రత్యేక గుర్తింపు




**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ నగర చిహ్నంగా నిలిచిన బంజారాహిల్స్‌లోని తాజ్ బంజారా హోటల్ ఇక చరిత్రలో కలిసిపోనుంది. నగర ఆతిథ్య రంగంలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్న ఈ హోటల్ కూల్చివేత పనులు ప్రస్తుతం వేగంగా జరుగుతున్నాయి. ఈ స్థలంలో సుమారు 40 అంతస్తుల భారీ నివాస సముదాయాన్ని నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. బంజారా

- మిగతా 5లో...

## ప్రభుత్వ స్కూళ్లలో చదివితే సీఎం అవ్వచ్చు..
# నేనే ఉదాహరణ

**హైదరాబాద్ పెన్ పవర్:** వనపర్తి జిల్లా దేవకద్రలో గవర్నమెంట్ గర్ల్స్ హై స్కూల్ ను ప్రారంభించారు సీఎం రేవంత్. బుధవారం ( జులై 15 ) జరిగిన ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు సీఎం రేవంత్. ప్రభుత్వ స్కూళ్లలో చదివితే ముఖ్యమంత్రి అవ్వచ్చని... అందుకు తానే ఉదాహరణ అని అన్నారు. తెలంగాణ పునర్నిర్మాణంలో ప్రభుత్వ స్కూళ్ళు కీలక పాత్ర పోషించాయని... చదివితే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని అన్నారు సీఎం రేవంత్.

చదువుల్లో రాణించకపోతే.. క్రీడల్లో రాణించాలని.. మనకు మహమ్మద్ సిరాజ్, నిఖత్ జరీన్ లు స్ఫూర్తి అని అన్నారు. నిఖత్ జరీన్ కు గ్రూప్ 1 డీఎస్పీగా జాబ్ ఇప్పించామని... మొన్న గోల్డ్ మెడల్ సాధించిన ఈషా సింగ్ కు రూ.3 కోట్లు ఇచ్చామని అన్నారు. తెలంగాణ రాష్ట్ర భవిష్యత్ తరగతి గదుల్లోనే ఉందని అన్నారు. 26వేల ప్రభుత్వ స్కూళ్లలో 18 లక్షల మంది విద్యార్థులు



ఉన్నారని..ప్రైవేట్ లో 11 వేల స్కూళ్ళు ఉంటే...33 లక్షల మంది విద్యార్థులు ఉన్నారని అన్నారు సీఎం రేవంత్.ప్రభుత్వ స్కూళ్ల టీచర్ల అర్హతతో సగం కూడా ప్రైవేట్ టీచర్లకు లేదని.. ప్రభుత్వ స్కూళ్లలో మౌలిక సదుపాయాలు లేక జనం ప్రైవేట్ బాట పడుతున్నారని అన్నారు సీఎం రేవంత్.

కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ స్కూళ్ళు పునరుద్ధరిస్తున్నామని...ప్రభుత్వ స్కూళ్లపై ప్రత్యేక శ్రద్ధ పెట్టామని అన్నారు సీఎం రేవంత్.

## ఉద్యోగుల ఆరోగ్య పథకం అమలెప్పుడు?

**ప్రభుత్వంపై హరీశ్‌రావు విమర్శలు**



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల హెల్త్ స్కీంను జులై 15 నుంచి అమలు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం.. ఆ గడువు దాటినా ఇంకా అమలు చేయకపోవడం శోచనీయమని భారాస శాసనసభాపక్ష

- మిగతా 5లో...

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## పోక్సో నిందితుడికి అతడి వల్లే బెయిల్..
# ఇదేనా మహిళల రక్షణ?

**రాష్ట్రంలో ఆడబిడ్డలను కాపాడుకునే నాథుడే కరవయ్యాడన్న ప్రవీణ్ కుమార్**

**షాబాద్ పోక్సో నిందితుడికి ముందస్తు బెయిల్ వచ్చేంత వరకు కాలయాపన చేశారని మండిపాటు**

**బాధిత కుటుంబాలను ఓదార్చడానికి వెళుతున్న తమను అరెస్ట్ చేశారని విమర్శ**



**హైదరాబాద్ పెన్ పవర్:** కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో మహిళల భద్రత పూర్తిగా గాలికి కొట్టుకుపోయిందని, ఆడబిడ్డలను కాపాడుకునే నాథుడే కరవయ్యాడని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో రంగారెడ్డి జిల్లా షాబాద్ దారుణ ఉదంతంపై ఆయన మాట్లాడారు. ఈ కేసులో ప్రభుత్వం, పోలీసులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వ్యవహరించిన తీరు సరిగా లేదని ఆరోపించారు.మే 16వ తేదీనే బాధిత బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసిందని... నిందితుడు ఎవరో, ఏం చేశాడో వివరించినా పోలీసులు పట్టించుకోలేదన్నారు. నిందితుడు ముందస్తు బెయిల్ తెచ్చుకునే వరకు కూడా అతన్ని అరెస్ట్ చేయకుండా కాలయాపన చేశారని మండిపడ్డారు.

- మిగతా 5లో...

## వంద పడకల ఆసుపత్రి ప్రారంభమయ్యే వరకు పోరాటం
### వేముల ప్రశాంత్‌రెడ్డి

**హైదరాబాద్ పెన్ పవర్:** నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్‌లో వంద పడకల ఆసుపత్రి ప్రారంభమయ్యే వరకు తన పోరాటం కొనసాగుతుందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ఆయన భీమ్‌గల్‌లో ఒకరోజు నిరాహార దీక్ష చేపట్టేందుకు వెళుతుండగా వేల్పూర్‌లోని స్వగృహంలో పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో అక్కడే ఆయన దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. భీమ్‌గల్‌లో మూతపడిన బస్‌డిపో పునఃప్రారంభం, సమీకృత మార్కెట్ భవనాల నిర్మాణం, సీసీ రోడ్ల పనులు, వంద పడకల ఆసుపత్రి ప్రారంభమయ్యేవరకు తన పోరాటం కొనసాగుతుందని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ప్రశాంత్‌రెడ్డి నిరాహార దీక్షచేపట్టారు. అనంతరం భారాస నేత, డాక్టర్ మధుశేఖర్ ప్రశాంత్‌రెడ్డికి నిమ్మరసం తాగించి దీక్షను విరమింపజేశారు. కార్యక్రమంలో భారాస నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# అక్రమ నిర్మాణాలకు..! అమ్ముడు పోతున్నారా..?




- ●తాజా టిఫిన్స్ పక్కన 'ఏసిపి' చర్యలు దేనికి సంకేతం..? ముడుపుల కోసమా..?
- ●ఈ అక్రమ కట్టడానికి "గెలుపెరుగని" ఓ అధికారపార్టీ నేత సిఫార్సులట..?




మార్చి 26న ఇలా కూల్చివేతలు..






నోటీసులు-సీజింగ్‌లు-కూల్చివేతలు చేపట్టిన అక్రమ నిర్మాణం ఇదే..



2026 జనవరి 28న ఇలా సీజ్ చేసిన ఏసిపి శ్రీనివాస్..



కూల్చిన మరుసటిరోజే మళ్ళీ నిర్మాణం..





- అక్రమ సెల్లార్-అదనపు అంతస్తులు- పార్కింగ్‌లో కమర్షియల్ షట్టర్‌లు..!
- మొత్తానికి అధికారుల అండతో కమర్షియల్ కాంప్లెక్స్ భవనం సిద్ధం..!
- అద్దెకు ఇవ్వబడును అని బోర్డులు కూడా పెట్టారు..! ముడుపులిచ్చి ఊరుకుంటారా మరి..?
- రెసిడెన్షియల్ అక్రమ భవనం.. వ్యాపార సముదాయంగా ఎలా మారింది..?
- దుండిగల్ డిప్యూటీ కమిషనర్ మౌనం వీడి సమాధానం ఇవ్వాలి..?
- పట్టణ ప్రణాళికా విభాగం అంటే..! అధికారుల వారసత్వ సంపదనా..?
- నెలనెలా తీసుకుంటున్న 'జీతం' ప్రజల సొమ్ము..! మీ పూర్వీకుల ఆస్తులు కాదు..!

- ●కూల్చేసిన అక్రమ నిర్మాణాలు.. ఏ ప్రాతిపదికన కడుతున్నారు..?
- ●"నోటీసులు-సీజింగ్‌లు-కూల్చివేతలు" ఉత్తుత్తి చర్యలేనా..?
- ●అధికారులైనా నిజమేనా..? వాళ్ళుకూడ డమ్మియేనా..?
- ●పాలకులు సరిగ్గా లేకపోతే పరిస్థితి ఇలాగే తయారవుతుందని విమర్శల వెల్లువ..!
- ●దుండిగల్ సర్కిల్-59లో అపహాస్యం పాలవుతున్న అధికారుల విధులు..!
- ●విద్యుత్ అధికారులను కూడా మెచ్చుకోలేకుండా ఉండలేము..!
- ●ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ లేని..ఈ అక్రమ నిర్మాణానికి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ జారీ..!

దుండిగల్ సర్కిల్-59 టౌన్‌ప్లానింగ్ అధికారుల నిర్లిప్తత, ప్రజలకు ఆగ్రహం తెప్పిస్తోంది.. చెప్పుకోవడానికో సాకు ఉంటే చాలు..! మరో నాలుగు అక్రమ కట్టడాలు అధికారుల ఖాతాలో జమ అయినప్పటే..! అంటూ వ్యంగ్యారోపణలు వస్తున్నాయి.. అటు జోనల్ కమిషనర్, ఇటు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌లు కూడా,, చేతివాటం ప్రదర్శించే అధికారులకు కాస్త ప్రాధాన్యత, గుర్తింపు ఉంటుందని, నిజాంపేట్ సర్కిల్ ఇంచార్జ్ బాధ్యతలు అప్పగించడం అందుకు నిదర్శనం అంటూ సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.. 'కూటిలో రాయి తీయలేనోళ్ళు-ఏట్లో రాయి తీస్తారా'..? అంటూ ఎద్దేవా చేసేవారు లేకపోలేదు.. దుండిగల్ సర్కిల్-59 సిఎంసి టౌన్‌ప్లానింగ్ అధికారుల బరితెగింపు విధులతో, ప్రజలను రిస్కులో పెట్టే విధంగా, ప్రమాదకర అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయని సర్వత్రా ఆరోపణలు వినిపిస్తున్నాయి..

సిఎంసి బ్యూరో, పెన్ పవర్, జూలై 15:

దుండిగల్ సర్కిల్-59 సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి నర్సాపూర్ హైవేపై "స్టిల్ట్‌o2" రెసిడెన్షియల్ అనుమతులు మంజూరు చేసిన అధికారులు, మతిస్థిమితం కోల్పోయారో..? లేక అక్రమార్కులే బరితెగించి నిర్మాణం చేపట్టారో కానీ.. ఓ అక్రమ నిర్మాణం అధికారుల లంచగొండితనాన్ని బట్టబయలు చేస్తోంది.. ప్రశ్నిస్తే సమాధానం ఉండదు..! మరీ ప్రశ్నిస్తే, ఫోన్‌లు బ్లాక్ చేయడం ఆ ఇద్దరు టౌన్‌ప్లానింగ్ అధికారులకు అలవాటై పోయింది.. ఇపుడు 'ఎస్ఐఆర్' నెపంతో మరింత పెరిగింది.. షోకాజ్ నోటీసులు ఎందుకు జారీ చేస్తున్నారో..? అక్రమ నిర్మాణాలు "సీజింగ్‌లు-కూల్చివేతలు" ఎందుకు చేస్తున్నారో బహుశా సంబంధిత అధికారులకైనా తెలుసో తెలియదో అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.. అంతా అవినీతి మయంగా తయారైంది.. ఇలా వార్తలు రాస్తే..! చర్యలు తీసుకోలేక పోయినా..! ఆ సార్లకు పౌరుషం మాత్రం తన్నుకొస్తుందని పలువురు విమర్శలు చేస్తున్నారు.. దుండిగల్ సర్కిల్-59 సిఎంసి పట్టణ ప్రణాళిక వ్యవస్థలో ఒకటే ధ్యేయం.. టిజి-బిపాస్ చట్టాన్ని తుంగలో తొక్కి, తమ జేబులు నింపుకోవడం పరిపాటిగా మారింది.. దుండిగల్ మున్సిపాలిటీ జీహెచ్ఎంసిలో విలీనం తర్వాత అధికారుల కరప్షన్ రెట్టింపు అయిందనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి..

## 'సీజ్‌చేసి-కూల్చేసిన' అక్రమ నిర్మాణం ఎలా పూర్తయింది..?

దుండిగల్ సర్కిల్-59 సిఎంసి టౌన్‌ప్లానింగ్ అధికారుల తీరు అహంకార పూరితంగా ఉన్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. అక్రమ నిర్మాణాల నియంత్రణకు నియమించిన అధికారులు, తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.. నర్సాపూర్ హైవేపై, తాజా టిఫిన్స్ పక్కన "స్టిల్ట్(పార్కింగ్)o2" రెసిడెన్షియల్ పర్మిషన్ పొందిన ఓ అక్రమ నిర్మాణ దారుడు.. "అక్రమ సెల్లార్-అదనంగా రెండు అంతస్తులు- సెట్‌బ్యాకులు జీరో-ఫైనల్‌గా కమర్షియల్ కాంప్లెక్స్ అద్దెకు సిద్ధం చేశారు.. అయితే షోకాజ్ నోటీసులు జారీ చేసిన టౌన్‌ప్లానింగ్ ఏసిపి శ్రీనివాస్, 2026 జనవరి 28న అట్టహాసంగా సీజింగ్ ప్రక్రియ చేపట్టారు.. ఇలాంటి అక్రమ నిర్మాణాన్ని మార్చి 26న సంబంధిత భవనాన్ని ఏసిపి శ్రీనివాస్ పర్యవేక్షణలోనే కూల్చివేతలు జరిపారు.. ఇదంతా " నియోజకవర్గంలోనే గెలుపెరుగని ఓ అధికారపార్టీ నాయకుడికి, ముడుపులు రాలేదని కూల్చేశారట.. సంబంధిత నాయకునికి ముడుపులు ముట్టగానే, మార్చి 30వ తేదీలోగా కూల్చిన రంధ్రాలు మళ్ళీ నిర్మించి, అధికారులకు కూడా కాస్త ముడుపులు ముట్టచెప్పి అక్రమ నిర్మాణం పూర్తిచేయడం గమనార్హం..

## 'ఏసిపి-టిపిఎస్'కి 10 సూటి ప్రశ్నలు..!

(1).."స్టిల్ట్‌o2" రెసిడెన్షియల్ అనుమతి పొందిన భవనంలో అక్రమ సెల్లార్, అదనపు అంతస్తులు, కమర్షియల్ షట్టర్లు ఎలా నిర్మించబడ్డాయి..?

(2)..షోకాజ్ నోటీసులు జారీ చేసి, సీజ్ చేసి, కూల్చివేతలు చేపట్టిన భవనం.. కొద్ది రోజుల్లోనే మళ్ళీ పూర్తి కావడానికి కారణం ఎవరు..?

(3)..కూల్చివేతల తర్వాత తిరిగి నిర్మాణం ప్రారంభమైన సమయంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు ఎలాంటి పర్యవేక్షణ చేపట్టారు..? నమోదు చేసిన తనిఖీ వివరాలు ఉన్నాయా..?

(4)..సీజ్ చేసిన భవనంపై సీజ్ ఎప్పుడు, ఎవరి ఆదేశాలతో తొలగించబడింది..? లేక సీజ్ కొనసాగుతుండగానే నిర్మాణం జరిగిందా?

(5)..రెసిడెన్షియల్ అనుమతితో నిర్మించిన భవనాన్ని కమర్షియల్ కాంప్లెక్స్‌గా మార్చేందుకు ఏదైనా అధికారిక అనుమతి ఇచ్చారా..? ఇచ్చి ఉంటే దాని వివరాలు ఏమిటి..?

(6)..ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ (ఓసి) లేకుండానే భవనం వినియోగానికి అద్దెకు ఇవ్వడానికి సిద్ధమైతే, టౌన్‌ప్లానింగ్ విభాగం తీసుకున్న చర్యలు ఏమిటి..?

(7)..అక్రమ నిర్మాణంపై కేసు నమోదు చేశారా..? జరిమానాలు, ప్రాసిక్యూషన్ లేదా ఇతర చట్టపరమైన చర్యలు ఏవైనా చేపట్టారా..?

(8)..ఈ నిర్మాణానికి సంబంధించి ప్రజల ఫిర్యాదులు, మీడియా కథనాల అనంతరం డిప్యూటీ కమిషనర్‌కు నివేదిక సమర్పించారా..? సమర్పించి ఉంటే అందులో ఏముంది..?

(9)..ఒకే భవనంపై నోటీసులు, సీజ్, కూల్చివేతలు జరిగినప్పటికీ అక్రమ నిర్మాణం పూర్తవడం అధికారుల వైఫల్యమా..? లేక మరేదైనా కారణమా..?

(10)..ఈ మొత్తం వ్యవహారంలో అవినీతి అధికారులపై చర్యలు తీసుకుంటారా..? అన్న ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి.

# భూ రీ-సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** జిల్లాలో చేపట్టిన భూ రీ-సర్వే ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యార్థికి ప్రాథమిక విద్యా నైపుణ్యాలు అందేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. బు ధవారం మండలంలోని నిమ్మనపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూ రీ-సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అనంతరం పెద్దపల్లి మండలం నిట్టూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల లను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యా బోధన, ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ కార్యక్రమం అమలును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, భూ రీ-సర్వే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అత్యంత జాగ్రత్తతో పనులు చేపట్టాలని సూచించారు. ప్రతి సర్వే నంబర్‌ను వరుస క్రమంలో ఖచ్చితంగా నమోదు చేయాలని, రికార్డులు పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయి పరిశీలన నిర్వహించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా భూ రీ-సర్వే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం నిట్టూరు గ్రామంలోని పాఠశాలలను తనిఖీ చేసిన కలెక్టర్, ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం అమలుపై ఆరా తీశారు. ప్రతి విద్యార్థికి ప్రాథమిక విద్యా నైపుణ్యాలు తప్పనిసరిగా అందేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యార్థులకు అన్ని సబ్జెక్టులపై మంచి అవగాహన కల్పించాలని, విద్యా ప్రణాళిక ప్రకారం సిలబస్‌ను పూర్తి చేయాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతతో ఉండేలా నిరంతరం పర్యవేక్షించాలని, ప్రీ-ప్రైమరీ తరగతుల్లో విద్యార్థుల నమోదు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి విద్యార్థి చదవగలిగే స్థాయికి చేరుకునేలా కృషి చేయాలని, ముఖ్యంగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి అదనపు బోధన అందించాలని సూచించారు. పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని, మరుగుదొడ్లలో ఎల్లప్పుడూ నీటి సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట ఏడీ సోమేశ్వర్, జడ్పీహెచ్ ఎస్ ప్రధానోపాధ్యా యులు లక్ష్మయ్య, ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యా యురాలు రాజమణి, తదితరులు పాల్గొన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఉద్యోగుల ఆరోగ్య పథకం అమలెప్పుడు?

-3 పేజి తరువాయి
ఉపనేత టి.హరీశ్‌రావు బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. "గడువు తేదీలు మారుతున్నాయే తప్ప.. ఉద్యోగుల హెల్త్ కార్డులు మాత్రం జారీచేయడం లేదు. ఉద్యోగుల నుంచి రెన్నెళ్ల ప్రీమియం వసూలు చేసి.. పథకం అమలు చేయకుండా ఉండటం మోసం చేయడమే. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉద్యోగులంటే ఈ ప్రభుత్వానికి ఎందుకింత కక్ష? పథకం అమలుకు ఇప్పటివరకూ మార్గదర్శకాలే విడుదల చేయలేదు. ఇప్పటికైనా ఎన్నికల మ్యానిఫెస్టోలో ఉద్యోగులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నిలబెట్టుకోవాలి. లేదంటే వారి పక్షాన భారాస పోరాటానికి సిద్ధమవుతుంది. పథకం అమలు చేయకుండా కోత విధించిన డబ్బులను తిరిగి వారి ఖాతాల్లో జమ చేయాలి" అని డిమాండ్ చేశారు.

## పోక్సో నిందితుడికి అతడి వల్లే బెయిల్..
## ఇదేనా మహిళల రక్షణ?

-3 పేజి తరువాయి
ఎల్‌బీ నగర్ పోక్సో కోర్టు ఇచ్చిన బెయిల్ ఆర్డర్‌ను తాను పరిశీలించానని, అందులో చనిపోయిన బాలిక సోదరుడు బెయిల్‌ను వ్యతిరేకించినట్లు ఉందని ప్రవీణ్ కుమార్ చెప్పారు. కానీ, అసలు ఆ బాలికకు అన్నే లేదని, కేవలం ఒక అక్క మాత్రమే ఉందని పేర్కొంటూ.. లేని అన్న వచ్చి బెయిల్ వద్దని ఎలా చెబుతాడని ప్రశ్నించారు.పోక్సో రూల్స్ 2020 ప్రకారం నిందితుడు బెయిల్‌కు దరఖాస్తు చేసుకుంటే బాధితులకు నోటీసు ఇవ్వాలి. కానీ ఇక్కడ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఉన్న వ్యక్తి కాంగ్రెస్ లీగల్ సెల్ వైస్ ప్రెసిడెంట్ బిక్షపతి గౌడ్ అని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ నాయకుడి వల్లే షాబాద్ పోక్సో నిందితుడు రాజ్ కుమార్‌కు బెయిల్ వచ్చిందని, ఇలాంటి వారికి పీపీ పోస్టులు ఇస్తే మహిళలకు న్యాయం ఎలా జరుగుతుందని ప్రశ్నించారు.బాధిత కుటుంబాన్ని ఓదార్చడానికి వెళుతున్న తమను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేస్తున్నారని, ఇదే ఉత్సాహం నిందితులను అరెస్ట్ చేయడంలో ఎందుకు చూపించడం లేదని నిలదీశారు.

## రేవంత్ పాలనలో హైదరాబాద్ ఐటీ రంగం దిగజారుతోంది.. కాగ్నిజెంట్ విశాఖకు వెళుతోంది: దాసోజు శ్రవణ్

-3 పేజి తరువాయి
ఆరోపించారు. కాగ్నిజెంట్‌ను రెండు చోట్ల విస్తరించేలా గతంలో రెండు ఎంఓయూలు కుదిరాయి. అయినా కాగ్నిజెంట్ హైదరాబాద్ నుంచి విశాఖకు మారుతోందన్నారు. 7 వేల ఐటీ ఉద్యోగాలు తగ్గాయని భట్టి విక్రమార్క అసెంబ్లీలోనే చెప్పారని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి ఉద్యోగాలను మింగేస్తున్నారని, కేటీఆర్ సగటున 60 వేల ఉద్యోగాలు పెంచితే రేవంత్ రెడ్డి 6 వేల ఉద్యోగాలు తగ్గిస్తున్నారన్నారు. ఇప్పటికే లక్షా 20 వేల ఉద్యోగాలు కోల్పోయామని దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి ఏపీ సీఎంకు చప్రాసీనా అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఐటీ మీద ఆధారపడుతున్న వారి పరిస్థితి ఏమిటని ఆరోపించారు. దావోస్ పోయి రేవంత్ రెడ్డి పెద్దపెద్ద మాటలు చెప్పారని... ఆయన తెచ్చిన పెట్టుబడులపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## బంజారాహిల్స్ తాజ్ హోటల్ కూల్చివేత!
## భారీ టవర్ నిర్మాణానికి సన్నాహాలు

-3 పేజి తరువాయి
లేక్‌ను ఆనుకుని ఉన్న 3.4 ఎకరాల విస్తీర్ణంలోని ఈ ఆస్తిని అరబిందో రియాల్టీ సంస్థ రూ.315 కోట్లకు దక్కించుకుంది. 2023లోనే హోటల్ కార్యకలాపాలు నిలిచిపోగా, ఈ ఏడాది ఏప్రిల్ నెలాఖరులో కూల్చివేత పనులు ప్రారంభమయ్యాయి. మొదటగా తలుపులు, కిటికీలు, ఇతర ఫర్నిచర్‌ను తొలగించిన యంత్రాంగం, ప్రస్తుతం ప్రధాన భవనాన్ని నేలమట్టం చేస్తోంది. ఈ ప్రక్రియ పూర్తి కావడానికి మరో నాలుగు నెలల సమయం పట్టవచ్చని అంచనా.1979లో ఏర్పాటైన తాజ్ బంజారా, నగరంలోని తొలి విలాసవంతమైన హోటళ్లలో ఒకటిగా ప్రసిద్ధి చెందింది. సినీ ప్రముఖులకు, పారిశ్రామికవేత్తలకు ఇది దశాబ్దాల పాటు ఇష్టమైన వేదికగా నిలిచింది. 1986 వరకు ఐటీసీ గ్రూప్ నిర్వహణలో ఉండగా, ఆ తర్వాత సుమారు నాలుగు దశాబ్దాల పాటు తాజ్ జీవీకే హోటల్స్ దీన్ని విజయవంతంగా నడిపించింది.అయితే, ఆస్తిపన్ను బకాయిల కారణంగా జీహెచ్ఎంసీ అధికారులు ఈ హోటల్‌ను తాత్కాలికంగా సీల్ చేశారు. సుమారు రూ.1.43 కోట్ల బకాయిలతో పాటు ఇతర కారణాల వల్ల ఇది మూసివేతకు దారితీసింది.

## మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన చొర్ పల్లి ఉప సర్పంచ్ ఆత్రం నిలకాంత్ వార్డ్ సభ్యులు

కండువా కప్పి పార్టీలో ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు

**కొమురం భీం: పెన్ పవర్:** లింగపూర్ మండలం లింగపూర్ బీఆర్ఎస్ పార్టీకి భారీ షాక్ లింగపూర్ మండలం చొరపల్లి గ్రామపంచాయతీ లో బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు అనంతరం ఉప సర్పంచ్ నిలకాంట్ మాట్లాడుతూ మాట్లాడుతూ నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అభిరుద్ధి చూసి కాంగ్రెస్ పార్టీలో చేరాం అని అన్నారు ప్రజా సంక్షేమ కార్యక్రమాలు అభిరుద్ధి లక్ష్యాలపై విశ్వాసంతో పార్టీలో చేరినట్లు తెల్పారు గ్రామ స్థాయి కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తాం తెల్పారు ఈ కార్యక్రమంలో సభ్యులు ఆత్రం మనిక్ రావు చత్రు పంద్రా నగేష్ మడవి రాంశావ్ జైవంత్ రావు విశ్వనాథ్ చిరంజీవి తదితరులు ఉన్నారు

## నిజామాబాద్ నుండి యూ.కేకు బియ్యం ఎగుమతులు

**నిజామాబాద్, జూలై 15: పెన్ పవర్:** భారత్--యునైటెడ్ కింగ్‌డమ్ మధ్య అమల్లోకి వచ్చిన సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం (జశీఎజూతీవష్ట్రవఅంఅజవ జుషశీఅశీఎఱష ఎతీఖఎవ్ఞాస్త్రతీవవఎవత్ - జజుఖూ) ద్వారా ఎగుమతులకు లభిస్తున్న అవకాశాలను వినియోగించుకుంటూ నిజామాబాద్ నగరంలోని గజానన్ రైస్ మిల్ యాజమాన్యం యునైటెడ్ కింగ్‌డమ్‌కు బియ్యం ఎగుమతులకు అనుమతులు సాధించింది. ఈ మేరకు గజానన్ రైస్ మిల్లు నుండి యూ.కే కు ఎగుమతి అవుతున్న సోనా మసూరి ఎక్స్పోర్ట్ క్వాలిటీ బియ్యం నిల్వలతో కూడిన వాహనాలకు కలెక్టర్ ఇలా త్రిపాఠి లాంఛనంగా జెండా ఊపి ప్రారంభించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సీఈటీఏ అమలుతో భారతీయ వ్యవసాయ ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లలో మరింత ప్రాధాన్యత లభిస్తోందని తెలిపారు. ముఖ్యంగా తెలంగాణలో నాణ్యమైన వరి ఉత్పత్తికి ప్రసిద్ధి చెందిన నిజామాబాద్ జిల్లా నుంచి యూకేకు బియ్యం ఎగుమతులు ప్రారంభం కావడం జిల్లాకు గర్వకారణమని అన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యమైన బియ్యాన్ని ఉత్పత్తి చేసి విదేశాలకు ఎగుమతి చేయడం ద్వారా రైతులకు మెరుగైన ధరలు లభించడంతో పాటు జిల్లాకు మంచి గుర్తింపు వస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని దేశాలకు కూడా జిల్లా నుంచి వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు పెరిగేలా అధికారులు, ఎగుమతిదారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

# ఎన్యూమరేషన్ ఫారంల సమర్పణకు సమీపించిన గడువు

**త్వరితగతిన ఫారంలను బీ.ఏల్.ఓలకు అందజేయాలి**
**కలెక్టర్ ఇలా త్రిపాఠి**



**నిజామాబాద్, జూలై 15 : పెన్ పవర్:**
ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా ఎన్యూమరేషన్ ఫారంల సమర్పణకు గడువు ముగియనున్న నేపథ్యంలో ఓటర్లు త్వరితగతిన తమ ఫారంను బీ.ఎల్.ఓలకు అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. వివరాలను డిజిటలైజ్ చేయాల్సి ఉందన్నారు. అంతేకాకుండా ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెత్/డిలీటెడ్ (ఏ.ఎస్.డీ)ఓటర్ల జాబితాను సైతం రూపొందించాల్సి ఉన్నందున చివరి నిమిషం వరకు వేచి చూడకుండా వెంటదివెంట ఎన్యూమరేషన్ ఫారాలను బీ.ఎల్.ఓలకు అందించాలని అన్నారు. ప్రత్యేకించి నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం పరిధిలోని ఓటర్లు ఫారం అందజేసే విషయంలో తాత్సారం చేయవద్దని సూచించారు. ఎన్యూమరేషన్ ఫారం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే ఓటరు జాబితా నుండి పేరు గల్లంతు అవుతుందని తెలిపారు. ఒకవేళ ఎవరికైనా గత 2002 ఎస్ఐఆర్ వివరాలు తెలియకపోతే సర్కిల్ వారీగా నెలకొల్పిన హెల్ప్ డెస్క్ ను, లేదా బీఎల్ఓ లను సంప్రదించాలని సూచించారు. అయినప్పటికీ వివరాలు తెలియని పక్షంలో ప్రస్తుత ఓటరు జాబితా వివరాలు పొందుపరచి ఫారం సమర్పించవచ్చని అన్నారు. అలాంటి వారి పేరు కూడా ముసాయిదా ఓటరు జాబితాలో చేర్చబడుతుందని తెలిపారు. వారికి ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఈ.ఆర్.ఓ) నోటీసు జారీ చేసే హియరింగ్ కు పిలుస్తారని, ఎన్నికల సంఘం నిర్దేశించిన 13 రకాల గుర్తింపు ధృవీకరణ పత్రాలలో ఏదైనా ఒక దానిని చూపిస్తే ఓటరు తుది జాబితాలో పేరు చేరుస్తారని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఓటరు తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ఫారం అందజేయాలని కలెక్టర్ సూచించారు. ఈ విషయంలో బూత్ లెవెల్ ఏజెంట్లు క్షేత్రస్థాయిలో ఉంటూ క్రియాశీలక పాత్ర పోషించాలని, ప్రతి రోజు ఓటర్ల నుండి 50 చొప్పున ఫారంలు సేకరించి బీ.ఎల్.ఓలకు అందించేలా చొరవ చూపాలన్నారు. ఈ.ఆర్.ఓలు, ఏ.ఈ.ఆర్.ఓలు కూడా క్షేత్రస్థాయిలో ఉంటూ, ఎన్యూమరేషన్ ఫారంల సేకరణ, వాటి డిజిటలైజేషన్ ప్రక్రియలు వేగవంతం అయ్యేలా పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా అందుబాటులో లేని, చనిపోయిన, శాశ్వతంగా వలస వెళ్ళిన, రెండు చోట్ల ఓటు కలిగిన ఓటర్ల పేర్లను గుర్తిస్తూ పక్కాగా జాబితాను రూపొందించి, వాటిపై బీ.ఎల్.ఏల సంతకాలు తీసుకోవాలన్నారు.

# నాగర్ కర్నూల్ జిల్లా నార్లాపూర్ పంప్ హౌస్లో ట్రయల్ రన్ ప్రారంభం



**నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి: పెన్ పవర్:** నార్లాపూర్ రిజర్వాయర్ వద్ద మొదటి యూనిట్ పంపన్ను విజయవంతంగా నడిపిన ఎత్తిపోతలకు లైన్ క్లియర్ ఇంజినీర్లు కృష్ణా జలాల వారానికి ఒకటి చొప్పున మిగిలిన మూడు పంపులకు వెట్రన్ నిర్వహించాలని అధికారులకు ప్రతిపాదన ఉమ్మడి మహబూ బనగర్ జిల్లా ప్రజల దశాబ్దాల కల

పాలమూరు రంగారెడ్డి ఎత్తి పోతల పథకంలో మరో కీలక ఘట్టం ఆవిష్కృతమయ్యింది. నాగర్కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని నార్లాపూర్ రిజ ర్వాయర్ వద్ద ఈ ప్రాజెక్టులో కీలకమైన ఒకటో నెంబర్ మోటా ర్ యూనిట్1 వెట్ రన్ మంగళవారం విజయవంతంగా పూర్త యింది. దీంతో నార్లాపూర్ రిజర్వాయర్ కృష్ణా జలాల ఎత్తిపో తలకు లైన్ క్లియర్ అయింది. ఇటీవల ఫస్ట్ పంప్ వెట్ రన్ ని ర్వహించే క్రమంలో కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దీంతో అప్రమత్తమైన నీటిపారుదల శాఖ అధికారులు, ఇంజనీ రింగ్ నిపుణులు, ఏజెన్సీ ప్రతినిధులతో కూడిన ప్రత్యేక టెక్నిక ల్ టీమ్ రంగంలోకి దిగింది. రాత్రింబవళ్లు శ్రమించి పంపింగ్ సిస్టమ్లోని సాంకేతిక లోపాలను విజయవంతంగా సరిచేశా రు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో
తరువాయి 9లో
మొదటి పంప్ ఆన్ చేయడంతో ఎగసిపడుతున్న జలాలు
పాలమూరు పూర్తిచేస్తాం రైతుల పాదాలు కడుగుతాం
పాలమూరు ఎత్తిపోతలకు ఎన్ని నిధులైనా ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం


# ఘనంగా ప్రారంభమైన "రీబర్త్" మినీ మూవీ చిత్రీకరణ

**హైదరాబాద్ పెన్ పవర్:**
ఆసవి క్రియేషన్స్ బ్యానర్‌పై అశోక్ వేముల ఆధ్వర్యంలో నిర్మితమవుతున్న "రీబర్త్" మినీ మూవీ చిత్రీకరణ బుధవారం (15-07-2026) సుందిళ్ల గ్రామంలోని స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఘనంగా ప్రారంభమైంది. ఈ చిత్రానికి కథ అశోక్ వేముల, స్క్రీన్ ప్లే మాటలు డైరెక్షన్ కొత్తూరు ప్రసాద్ చారి గారు అందిస్తున్నారు ఈ చిత్ర ప్రారంభోత్సవ కార్యక్రమంలో గౌరవ అతిథిగా పాల్గొన్న గౌరవ సర్పంచ్ ముసుకుల నరేందర్ రెడ్డి గారు క్లాప్ కొట్టి చిత్రీకరణను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, మంచి సందేశంతో రూపొందుతున్న ఈ చిత్రం ప్రేక్షకులను ఆలోచింపజేసేలా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నిర్మాత అశోక్ వేముల మాట్లాడుతూ
సమాజానికి ఉపయోగపడే విలువలు, మనిషి జీవితం పట్ల కొత్త దృక్పథాన్ని ప్రతిబింబించే కథాంశంతో "రీబర్త్" రూపొందుతోంది.ఈ కథలోని భావోద్వేగాలు, సస్పెన్స్, సందేశాత్మక అంశాలు ప్రేక్షకులను ఆకట్టుకునేలా దర్శకుడు ప్రత్యేక శ్రద్ధతో చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు.
ఈ చిత్రంలో అమేజింగ్ స్టార్ అశోక వేముల మరియు జక్కిన శ్రీలత నేత ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు.ఈ చిత్రానికి సంగీతశ్రీ వరికుప్పుల యాదగిరి గారు అందిస్తున్నారు ఛాయాగ్రాహకుడు గా (ఐఖా): దేవా చిత్రీకరిస్తున్నారు, మేకప్ మెన్ అంజిబాబు
సాహిత్యం వరికుప్పుల యాదగిరి , మూలశంకర్
కో-డైరెక్టర్ గా రతన్ కుమార్ ఉన్నారు
ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ సత్యనారాయణ గౌడ్, ఉప సర్పంచ్ సదానందం, సదాశివ ఫౌండేషన్ బాధ్యులు శ్రావణ్ కుమార్, లింగమూర్తి, వాసు, సుధాకర్ రావు ప్రముఖ నటీనటులు, నిర్మాతలు, దర్శకులు, సాంకేతిక నిపుణులు, గ్రామ పెద్దలు మరియు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. చిత్రం మంచి విజయాన్ని అందుకోవాలని దీవించారు.

# ఎలక్ట్రికల్ వర్కర్స్ సంఘ భవనానికి స్థలం కేటాయించాలని వినతి

డిప్యూటీ మేయర్, యాదగిరి సునీల్ రావు

**కరీంనగర్ జూలై 15: పెన్ పవర్:** కరీంనగర్ సెంట్రల్ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావును కలిసి సంఘ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. పెరుగుతున్న అద్దె భారం కారణంగా సొంత భవనాన్ని నిర్మించుకునేందుకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో కార్మిక సంఘాల కోసం 'కార్మిక భవన్' నిర్మాణానికి కృషి చేస్తున్నామని తెలిపారు. భవన నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయింపుతో పాటు కార్మికుల ఈపీఎఫ్,ఈఎస్ఐ తదితర సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు దువ్వాసి రాజబాబు,



ఉపాధ్యక్షుడు కయ్యం పాపయ్య, ప్రధాన కార్యదర్శి బషీర్ మహమ్మద్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# సగం మంది టీచర్లే టెట్ పాస్

**హైదరాబాద్, జూలై 15, పెన్ పవర్:** ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఫలితాలు విడుదలవగా.. రాష్ట్రవ్యాప్తంగా కేవలం 43.94 శాతం మంది అభ్యర్థులు మాత్రమే అర్హత సాధించి తీవ్ర నిరాశపరిచారు. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ అధికారికంగా ఈ రిజల్ట్స్‌ను విడుదల చేయగా.. పరీక్ష రాసిన 1.15 లక్షల మందిలో సగం మంది కూడా క్వాలిఫై కాలేకపోయారు. ముఖ్యంగా ప్రస్తుతం విధుల్లో ఉంటూ పరీక్ష రాసిన ఇన్-సర్వీస్ ప్రభుత్వ ఉపాధ్యాయులలో ఏకంగా 14,814 మంది ఫెయిల్ కావడం విద్యాశాఖను దిగ్భ్రాంతికి గురిచేసింది. వీరంతా 2028 ఆగస్టు వరకు పాస్ కాకపోతే వీరి ఉద్యోగాలు పోయే అవకాశం ఉంది తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఫలితాలు విడుదల అయ్యాయి. ఈసారి ఫలితాల్లో అభ్యర్థులు తీవ్రంగా నిరాశపరిచారు. పరీక్ష రాసిన వారిలో సగం మంది కూడా క్వాలిఫై కాలేదు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 43.94 శాతం మంది మాత్రమే అర్హత సాధించారు. హైదరాబాద్‌లోని పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్‌లో టెట్ కన్వీనర్ జి. రమేశ్, టెట్ డైరెక్టర్ రేవతిరెడ్డిలతో కలిసి పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ ఈ ఫలితాలను అధికారికంగా విడుదల చేశారు. మొత్తం 1,15,028 మంది పరీక్షకు హాజరుకాగా.. కేవలం 50,544 మంది మాత్రమే క్వాలిఫై అయ్యారు. ముఖ్యంగా ప్రభుత్వ ఉపాధ్యాయులు అయితే సగం కంటే తక్కువ మంది పాస్ కావడం గమనార్హం. సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జీటీ) పోస్టుల కోసం నిర్వహించిన పేపర్-1 పరీక్షలో 65.29 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో 36,129 మంది పరీక్ష రాయగా 23,590 మంది పాస్ అయ్యారు. అయితే స్కూల్ అసిస్టెంట్ పోస్టుల కోసం నిర్వహించిన పేపర్-2లో ఫలితాలు చాలా ఘోరంగా ఉన్నాయి. పేపర్-2లో మొత్తం 78,899 మంది పరీక్ష రాస్తే కేవలం 26,954 మంది మాత్రమే అర్హత సాధించారు. ఇందులో మ్యాథ్స్ అండ్ సైన్స్ విభాగంలో 40.76 శాతం (17,987 మంది) ఉత్తీర్ణత సాధించగా.. సోషల్ స్టడీస్ విభాగంలో అత్యల్పంగా 25.79 శాతం (8,967 మంది) మంది మాత్రమే క్వాలిఫై కావడం గమనార్హం. మరోవైపు ప్రస్తుతం విధుల్లో ఉంటూ ఈ పరీక్ష రాసిన ఇన్-సర్వీస్ ప్రభుత్వ ఉపాధ్యాయుల ఫలితాలు మరింత ఆందోళనకరంగా ఉన్నాయి. మొత్తం 23,623 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు పరీక్షకు హాజరుకాగా.. కేవలం 8,809 మంది (37.29%) మాత్రమే క్వాలిఫై అయ్యారు. ఏకంగా 14,814 మంది ఉపాధ్యాయులు ఫెయిల్ కావడం విద్యాశాఖ వర్గాలను విస్మయానికి గురిచేసింది. గతేడాది ప్రభుత్వ టీచర్ల పాస్ పర్సంటేజ్ 50 శాతంగా ఉండగా.. ఈసారి అది 37.29 శాతానికి పడిపోయింది. ఇన్-సర్వీస్ టీచర్లలో పేపర్-1లో 52.57 శాతం, పేపర్-2 మ్యాథ్స్ అండ్ సైన్స్‌లో 38.27 శాతం, సోషల్‌లో అత్యంత దారుణంగా 24.05 శాతం మంది మాత్రమే పాస్ అయ్యారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం.. విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయులు 2028 ఆగస్టు నాటికి ఖచ్చితంగా టెట్ పరీక్ష పాస్ కావాల్సి ఉంటుంది. ఒకవేళ ఈ డెడ్‌లైన్‌లోగా టెట్ క్వాలిఫై కాకపోతే వారు తమ ప్రభుత్వ ఉద్యోగాలను కోల్పోవాల్సి వస్తుంది. అయితే తాజా పరీక్షలో 14 వేల మందికి పైగా టీచర్లు ఫెయిల్ కావడంతో వారి ఉద్యోగ భద్రతపై తీవ్రమైన ఆందోళన నెలకొంది.

# కాజీపేటలో ఇంటర్‌సిటీ రైళ్ల తయారీ

**వరంగల్, జూలై 15, పెన్ పవర్:** తెలంగాణలోని కాజీపేట రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ నెక్స్ట్ జనరేషన్ ఇంటర్‌సిటీ రైళ్ల తయారీ కేంద్రంగా అవతరించనుంది. రూ. 521 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఈ ప్లాంట్ పనులు 95 శాతం పూర్తయ్యాయి. గంటకు 130 కిమీ వేగంతో దూసుకెళ్లే ఈ రైళ్లను 300 కిమీ పరిధిలోని నగరాల అనుసంధానానికి వాడనున్నారు. ఐదేళ్లలో 200 రైల్‌సెట్లను తయారు చేయాలని రైల్వే లక్ష్యంగా పెట్టుకుంది. ఇక్కడ వందే భారత్ కోచ్‌ల తయారీకీ వీలుండగా.. ఈ ప్రాజెక్ట్ వల్ల రాష్ట్రంలో 3 వేల మందికి ఉపాధి లభించనుంది.

ముంబై, ఢిల్లీ, చెన్నై, బెంగళూరు వంటి దేశంలోని ప్రధాన నగరాల మధ్య నడిచే నెక్స్ట్ జనరేషన్ అత్యాధునిక ఇంటర్‌సిటీ ప్యాసింజర్ రైళ్లు త్వరలోనే తెలంగాణ రాష్ట్రం నుంచి పట్టాలెక్కబోతున్నాయి. ఇందుకు సంబంధించి చారిత్రాత్మక రైల్వే ఉత్పాదక కేంద్రంగా మారేందుకు కాజీపేట రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ సర్వసిద్ధమవుతోంది. కాజీపేట కర్మాగారంలో సరికొత్త ఇంటర్‌సిటీ కోచ్‌ల తయారీ కోసం చెన్నైకి చెందిన ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ త్వరలోనే అంతర్జాతీయ టెండర్లను పిలవనుంది. దాదాపు రూ. 521 కోట్ల భారీ అంచనా వ్యయంతో అత్యాధునిక సాంకేతికతతో నిర్మితమవుతున్న ఈ భారీ రైల్వే ఉత్పాదక కేంద్రం పనులు చివరి దశకు చేరుకున్నాయి. రానున్న కొద్ది నెలల్లోనే ఈ కర్మాగార నిర్మాణ పనులు పూర్తిగా పూర్తి కానున్నాయి. గరిష్ఠంగా గంటకు 130 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా రూపొందించిన ఈ ఆధునిక రైళ్లను.. ప్రధానంగా 300 కిలోమీటర్ల లోపు ఉండే స్వల్ప, మధ్యస్థ దూర ప్రయాణాల కోసం ఉపయోగించనున్నారు. ఇవి పొరుగున ఉన్న పట్టణాలు, నగరాల మధ్య అత్యంత వేగవంతమైన, సౌకర్యవంతమైన కనెక్టివిటీని అందిస్తాయి. రాబోయే ఐదేళ్ల కాలంలో కాజీపేట కేంద్రంగా దాదాపు 200 ఇంటర్‌సిటీ రైల్‌సెట్లను తయారు చేయాలని భారతీయ రైల్వే శాఖ లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఇక్కడ వాణిజ్యపరమైన ఉత్పత్తి ప్రారంభమైన తర్వాత.. తదుపరి తరం ప్రయాణికుల రోలింగ్ స్టాక్ తయారీలో ఈ తెలంగాణ ఫ్యాక్టరీ దేశంలోనే అతిపెద్ద హబ్‌లలో ఒకటిగా అవతరించనుంది. కాజీపేట రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌లో ఇప్పటికే 95 శాతం నిర్మాణ పనులు విజయవంతంగా పూర్తయ్యాయని, ఈ ఏడాది చివరి నాటికి ఇక్కడ ఉత్పత్తి ప్రారంభమయ్యే అవకాశం ఉందని దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులు తెలిపారు. అంతేకాకుండా.. ఈ కర్మాగారంలోనే వందే భారత్ కోచ్‌లతో పాటు అన్ని రకాల ఆధునిక ప్రయాణికుల రైళ్లను తయారు చేసేందుకు వీలుగా ఫ్లెక్సిబుల్ డిజైన్‌ను రూపొందించినట్లు ఆయన వివరించారు. రోజూ ప్రయాణించే ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారవేత్తల అవసరాలను తీర్చేలా, తక్కువ ఖర్చుతో కూడిన షటిల్ సర్వీసులుగా ఈ ట్రైన్లను రైల్వే శాఖ ప్రవేశపెట్టనుంది. ఈ రైళ్లలో ప్రయాణికుల కోసం అనేక రకాల అత్యాధునిక సదుపాయాలు కల్పించనున్నారు. ప్రతి రైలులో మొత్తం 20 కోచ్‌లు ఉంటాయి. వీటిలో ఆటోమేటిక్ ప్లగ్ డోర్లు, మెరుగైన వెంటిలేషన్ సిస్టమ్‌లు, ప్రమాదాల తీవ్రతను తట్టుకునేలా క్రాష్‌వర్తీ కోచ్ డిజైన్‌ను అమర్చనున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం ప్రతి కోచ్‌కు ఇరువైపులా రెండేసి చొప్పున బయో-టాయిలెట్లను ఏర్పాటు చేయనున్నారు. ఈ కర్మాగారం ద్వారా స్థానికంగా దాదాపు 3 వేల మందికి పైగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

# సీఎం రేవంత్ రెడ్డి ఓటుపై జోరుగా వార్తలు
# రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక ప్రకటన

**హైదరాబాద్ పెన్ పవర్:** సీఎం రేవంత్ రెడ్డి ఓటుకు సంబంధించి సోషల్ మీడియాలో వస్తున్న వార్తలపై రాష్ట్ర ఎన్నికల సంఘం ఎట్టకేలకు స్పష్టతనిచ్చింది.

రేవంత్ రెడ్డి పేరు ఒకే ఎపిక్ నంబర్‌తో రెండు ఓటర్ జాబితాలలో కనిపించడం కేవలం సాంకేతిక లోపం మాత్రమేనని ఈసీ అధికారులు స్పష్టం చేసింది. ఈ మేరకు ఫ్యాక్ట్ చెక్ తెలంగాణ ఓ అధికారిక ప్రకటనను విడుదల చేసింది.

అయితే, రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సార్ ప్రక్రియలో భాగంగా ఇలాంటి డూప్లికేట్ ఎంట్రీలను గుర్తించి, ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనల మేరకు సంబంధిత జిల్లా ఎన్నికల అధికారి డీఈవో ఈ సాంకేతిక లోపాన్ని సరిచేస్తారని స్పష్టం చేశారు. ఇక ఒకే ఎపిక్ నంబర్ రెండు వేర్వేరు ఓటరు జాబితాల్లో ఉన్నంత మాత్రాన..సదరు వ్యక్తికి రెండు నియోజకవర్గాల్లో ఓటు వేసే హక్కు లేదని ఎన్నికల క్లారిటీ ఇచ్చారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఇలాంటి పొరపాట్లు కామన్ అని వాటన్నింటినీ త్వరలోనే జాబితా నుంచి తొలగిస్తామని రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు పేర్కొన్నారు.



# సహకార వ్యవస్థ బలోపేతం కాంగ్రెస్ సర్కార్ లక్ష్యం

## సహకార సంఘ నూతన భవనం ప్రారంభోత్సవంలో కవ్వంపల్లి

**కరీంనగర్: పెన్ పవర్:** రైతులకు మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో సహకార వ్యవస్థ బలోపేతానికి చిత్త శుద్ధితో కృషి చేస్తున్నదని మానకొండూరు ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు.

బెజ్జంకి మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) భవనాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, గ్రామీణ ప్రాంతాల్లో సహకార వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నదని చెప్పారు. రైతులకు మెరుగైన సేవలు అందించడంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. నూతన భవనం ద్వారా రైతులకు ఒకే చోట రుణాలు, వ్యవసాయ సంబంధిత సేవలు, సంక్షేమ పథకాల అమలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. రైతులు సహకార సంఘాల సేవలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయాభివృద్ధికి తోడ్పడాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. అనంతరం భవనంలోని కార్యాలయ గదులను పరిశీలించి, అధికారులు రైతులకు పారదర్శకంగా, వేగవంతంగా సేవలు అందించాలని ఎమ్మెల్యే సూచించారు.

ఈ కార్యక్రమంలో బెజ్జంకి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్ తన్నీరు శరత్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీపీ ఒగ్గు దామోదర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్, జిల్లా పార్టీ కార్యదర్శి అక్కరవేణి పోచయ్య ముదిరాజ్ తదితరులతోపాటు సహకార సంఘ డైరెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

**సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ**

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అధ్వాన్నంగా ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తున్నదని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ స్పష్టం చేశారు.

బుధవారం బెజ్జంకి మండల పరిషత్ సమావేశ మందిరంలో ఆయన వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్వాకం వల్ల రాష్ట ఖజానా ఖాళీ అయ్యిందని, ఆర్థికపరమైన సమస్యలు ఉన్నప్పటకీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నదని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూర్చేందుకు కృషి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు అండ నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఒగ్గు దామోదర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, పార్టీ జిల్లా కార్యదర్శి అక్కరవేణి పోచయ్య ముదిరాజ్, మండల పార్టీ అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు గూడెల్లి శ్రీకాంత్ తోపాటు వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు,పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

బెజ్జంకి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మానకొండూర్ ఎమ్మెల్య డాక్టర్ కవ్వంపల్లి సత్యారాయణ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. వంట గది శుభ్రత, వంటల్లో శుచి గురించి వంటవాళ్లను అడిగి తెలుసుకోవడమే కాకుండా తగు సూచనలు చేశారు.

**సీసీ రోడ్డు పనులకు భూమిపూజ**

బెజ్జంకి మండల కేంద్రంలో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ బుధవారం భూమి పూజ చేశారు. అంతకు ముందు ఆయన ముత్తన్నపేట గ్రామంలో నిర్మించతలపెట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. నిర్ణీత గడువులోగా ఆయా సీసీ రోడ్డు నిర్మాణాలు పూర్తి చేయించాలని, పనుల నాణ్యతను పర్యవేక్షించాలని ఆయన సంబంధిత అధికారులకు సూచించారు.

పరామర్శ

బెజ్జంకి మండల కేంద్రంలో ఇటీవల మరణించిన జంగిటి రాజయ్య కుటుంబ సభ్యులను మానకొండూర్ ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా రాజయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

# హాస్టల్ విడిచి బయటకు వచ్చిన ఇంటర్ విద్యార్థులు

**మంచిర్యాల పెన్ పవర్:**
మంచిర్యాల జిల్లా చెన్నూరులోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకులంలో వసతుల సమస్యలతో 17 మంది ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మంగళవారం రాత్రి హాస్టల్ విడిచి బయటకు వచ్చారు. ఎమ్మెల్యే సతీమణి సురేఖను కలిసి తమ ఇబ్బందులను వివరించారు. విద్యార్థుల సమస్యలను విన్న సురేఖ, వారిని జిల్లా కో-ఆపరేటివ్ అధికారి శ్రీధర్కు అప్పగించి, సురక్షితంగా చెన్నూరుకు తరలించేలా చర్యలు తీసుకున్నారు. గురుకులంలో వసతులను మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు.

## ముద్రగడ కూతురును అడ్డుకున్న కాపు నేతలు

**హైదరాబాద్ పెన్ పవర్:** కాపు నేత ముద్రగడ పద్మనాభం తో కూతురు క్రాంతి విభేదించిన సంగతి తెలిసిందే. గతంలో జరిగిన పవన్ కల్యాణ్ తుని సభలో క్రాంతి పాల్గోన్నారు. పవన్ కు ఆమెమద్దతు తెలపడంతో తండ్రీకూతుళ్ల బంధం విడిపడింది. - కాపుల నాయకుడు పవన్ అని క్రాంతి చెప్పగా తాను చనిపోయినా కూతురు రావడానికి వీల్లేదన్న ముద్రగడ అన్నారు. మంగళవారం ముద్రగడ మృతి చెందడంతో అక్కడికి అయినా క్రాంతి రావడంతో తల్లి, అభిమానులు అడ్డుకున్నారు. పోలీసులు క్రాంతిని బలవంతంగా కారులో తరలించారు.

## కాపు సమాజానికి తీరని లోడు
## ముద్రగడ మృతిపై సోము వీర్రాజు

**హైదరాబాద్ పెన్ పవర్:** బీజేపీ నేత సోము వీర్రాజు ప్రముఖ నాయకులు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం భావపూర్వక శ్రద్ధాంజలి ఘటించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో, ముఖ్యంగా తూర్పుగోదావరి జిల్లా రాజకీయాల్లో తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్న సీనియర్ నాయకులు ముద్రగడ పరమపదించారనే వార్త నన్ను ఎంతగానో కలచివేసిందని అన్నారు.

శాసనసభ్యుడిగా, మంత్రిగా, ఎంపీగా ఆయన ప్రజలకు అందించిన సేవలు అనన్యసామాన్యం. విలువలతో కూడిన రాజకీయాలు చేస్తూ, నమ్మిన సిద్ధాంతం కోసం, తన సామాజిక వర్గ సంక్షేమం కోసం ఆయన సాగించిన ఉద్యమాలు నిరుపమానం. ఆయన మరణం రాష్ట్ర రాజకీయాలకే కాక, యావత్ కాపు సమాజానికి తీరని లోటు. వారి ఆత్మకు సద్గతులు కలగాలని ఆ సర్వేశ్వరుడిని వేడుకుంటూ… ఈ కష్టసమయంలో వారి కుటుంబ సభ్యులకు, అనుచరులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని అన్నారు.

## మెదక్లో కల్తీ పాల ముఠా గుట్టురట్టు

**హైదరాబాద్ పెన్ పవర్:**
నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి గ్రామంలో కృత్రిమ పాలు తయారీ కేంద్రంపై టాస్కోర్స్ దాడులు నిర్వహించారు. కల్తీ పాలు తయారు చేస్తుండగా నిందితులను పట్టుకున్నారు. 150 లీటర్ల కల్తీ పాలు, మిల్క్ పౌడర్, తయారీ సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

## తిరుమలలో ఆక్టోపస్ కమాండోల మాక్ డ్రిల్

**హైదరాబాద్ పెన్ పవర్:** తిరుమలలో భక్తుల భద్రతే ధ్యేయంగా ఆక్టోపస్ కమాండోలు, రాష్ట్ర పోలీస్ శాఖ, టీటీడీ విజిలెన్స్ విభాగం సంయుక్తంగా భారీ మాక్ డ్రిల్ నిర్వహించాయి. తిరుమలలోని పీఏసీ--4 సత్రాన్ని ఉగ్రవాదులు ముట్టడించినట్లుగా ఊహించి ఈ ఆపరేషన్ చేపట్టారు. అత్యవసర సమయాల్లో భద్రతా బలగాలు ఉగ్రవాదులను ఎలా అదుపులోకి తీసుకుంటాయి, భక్తులను ఎలా సురక్షిత ప్రాంతాలకు తరలిస్తాయి వంటి అంశాలను ప్రాక్టికల్గా ప్రదర్శించారు.

## మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి హౌస్ అరెస్ట్

**హైదరాబాద్ పెన్ పవర్:** మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తలపెట్టిన నిరాహార దీక్షను పోలీసులు అడ్డుకున్ఆరు. ఈ నేపథ్యంలో అయనను హౌస్ అరెస్టు చేసారు. నియోజకవర్గంలో ఉదయం నుంచి బీఆర్ఎస్ పార్టీ శ్రేణులను ఎక్కడికక్కడ గృహనిర్బంధాలతో పాటు అరెస్టు చేసి పలు పోలీస్ స్టేషన్లకు తరలించారు. భీంగల్ మున్సిపాలిటీ అభివృద్ధితో పాటు 100 పడకల ఆసుపత్రి నిర్మాణం, ఆర్టీసీ డిపో పునరుద్ధరణపై కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా నిరాహార దీక్ష చేయాలని ప్రశాంత్ రెడ్డి నిర్ణయించారు.

## మైలవరంలో అర్ధరాత్రి మెరుపు దాడులు..
## రేషన్ బియ్యం లారీ సీజ్

**హైదరాబాద్ పెన్ పవర్:** మైలవరంలో గత అర్ధరాత్రి పోలీసులు జరిపిన మెరుపు దాడుల్లో భారీగా అక్రమ రేషన్ బియ్యం పట్టుబడింది. మైలవరం, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం ప్రాంతాల్లో రేషన్ బియ్యం సేకరించి బాగుచేసి, వెల్వడంలో లారీకి లోడ్ చేస్తుండగా పోలీసులు దాడి చేశారు. ఆవుల శివారెడ్డికి చెందిన లారీలో తరలిస్తున్న 25 టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. లారీని అదుపులోకి తీసుకొని, నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధాకర్ వెల్లడించారు.

## ఎస్ఐఆర్ పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి పట్టింపు లేదు...
## మాజీమంత్రి, బి ఆర్ ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్

**హైదరాబాద్ పెన్ పవర్:**
ఎస్ఐఆర్ పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి పట్టింపు లేదని మాజీమంత్రి, బి ఆర్ ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. ప్రత్యేక ఓటరు సవరణ (ా×=) లో 2002 సంవత్సరం వివరాలు ఎందుకని అయన ప్రశ్నించారు. బుధవారం నాడు అయన సనత్ నగర్ లోని సుభాష్ నగర్ లో ఎస్ఐఆర్ హెల్ప్ డెస్క్ ను సందర్శించారు.

తలసాని మాట్లాడుతూ సిబ్బందిని సరిపడా నియమించలేదు. ఎన్యుమరేటర్ ఫారం లను నింపే విషయంలో కనీస అవగాహన లేని సిబ్బందిని నియమించారు. సర్వే పారదర్శకంగా, పూర్తిస్థాయిలో జరగాలంటే ఒక్కో బూత్ కు 4 బృందాలను ఏర్పాటు చేయాలి. వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బందిని నియమించాలని అన్నారు.

## ఈ నెల 20న క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఎల్ఐజీ ఇళ్లకు శ్రీకారం:
### మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని నిరుపేద కుటుంబాలకు దశల వారీగా లక్ష ఎల్ఐజీ ఇందిరమ్మ ఇండ్లను నిర్మించనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ నెల 20న ఈ పథకాన్ని ప్రారంభిస్తామని మంత్రి వెల్లడించారు. ఈ పథకంపై మంత్రి సమీక్ష నిర్వహించారు. విధివిధానాలు, అర్హతలు, దరఖాస్తులు, అమలు విధానం ప్రకటిస్తాం. తొలిదశలో నియోజకవర్గానికి 500-1000 వరకు ఎల్ఐజీ ఫ్లాట్లు. సైబరాబాద్, మల్కాజ్‌గిరి కార్పొరేషన్లలో స్థలాలు గుర్తించాం. 3 రోజుల్లో ఫ్లాట్ల విస్తీర్ణం, డిజైన్లను ప్రకటిస్తాంఅని వెల్లడించారు.

# గులాబీ రెడ్ పాలిటిక్స్..

**హైదరాబాద్, జూలై1 5, పెన్ పవర్:** : తెలంగాణలో రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుకు రావడం లేదని, ప్రాజెక్టులకు నీటిని విడుదల చేయడం లేదని ఆరోపిస్తూ.. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ ఎస్ పార్టీ బ్లెడ్ పాలిటిక్స్(రక్త రాజకీయం) కు తెరదీసింది. సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ రైతుల రక్తం చవిచూస్తున్నారని ఆరోపిస్తున్న బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్.. సీఎంకు కావాలంటే తమ రక్తం ఇస్తామని, రైతులను ఆదుకోవాలని ఎక్స్ వేదికగా కామెంట్లు చేశారు.అనంతరం.. జూబ్లీహిల్స్‌లోని బీఆర్ఎస్ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ విద్యార్థి, యువజన విభాగం కార్యకర్తలు రక్తదాన శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల్లో పలువురు విద్యార్థులు రక్తం దానం చేశారు. అనంతరం.. ఈ రక్తాన్ని సచివాలయానికి తీసుకువెళ్లి.. సీఎం రేవంత్ రెడ్డికి ఇచ్చి.. నిరసన తెలపాలని నిర్ణయించారు. ఈ క్రమంలో పోలీసులు బీఆర్ ఎస్ విద్యార్థి, యువజన విభాగం కార్యకర్తలను అడ్డుకుని రక్తం బాటిళ్లు, ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా ఇరు పక్షాల మధ్య తీవ్ర వాగ్యుద్ధం నడిచింది. అయినప్పటికీ.. పోలీసులు మరింత మందిని రంగంలోకి దింపి బీఆర్ఎస్ కార్యకర్తలను అడ్డుకున్నారు. ఇదిలావుంటే.. అసలు ఇంత రాజకీయం అవసరమా? అనేది పరిశీలకుల మాట. రైతులను ఆదుకునే విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా వెనుకబడే ఉందని పలువురు గుర్తు చేస్తున్నారు. రాజకీయం చేసేందుకు అనేక అంశాలు ఉన్నాయని రైతులకు నీటిని విడుదల చేయకపోతే.. ఆ మేరకు మరో మార్గం ఎంచుకోవాలని చెబుతున్నారు.ఇక, బీఆర్ఎస్ బ్లెడ్ పాలిటిక్స్‌పై కాంగ్రెస్ తీవ్రంగా మండిపడింది. గతంలో బీఆర్ఎస్ పాలకులు రైతులకు సంకెళ్లు వేసి జైలుకు తరలించిన ఫొటోలను సోషల్ మీడియాలో పోస్టు చేయడం గమనార్హం. నల్గొండ, మహబూబాబాద్ వంటి జిల్లాల్లో రైతులు.. గిట్టుబాటు ధర కోసం రోడ్డెక్కితే లాఠీలతో ఎలా కొట్టించారో చూడండి.. అంటూ.. నాటి ఫొటోలను పోస్టు చేశారు. అంతేకాదు.. రైతులపై నాడు మంత్రి చేసిన వ్యాఖ్యలను కూడా ఈ సందర్భంగా ప్రస్తావించడం గమనార్హం. మొత్తంగా బీఆర్ ఎస్ బ్లెడ్ పాలిటిక్స్ ఎవరికి మేలు చేస్తాయో చూడాలి.

# రెండు చోట్ల రేవంత్ ఓటు...

**హైదరాబాద్, జూలై1 5, పెన్ పవర్:** రాష్ట్రంలో చట్టాలను, నిబంధనలను పటిష్టంగా అమలు చేయాల్సిన ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న రేవంత్ రెడ్డి పేరిట రెండు వేర్వేరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటు హక్కు నమోదై ఉండటం ఇప్పుడు తెలంగాణ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. బాధ్యతాయుతమైన అత్యున్నత పదవిలో ఉన్న ఒక వ్యక్తి పేరు, రెండు వేర్వేరు పార్లమెంటరీ పరిధులలోని ఓటర్ల జాబితాలో కనిపించడం సంచలనం సృష్టిస్తోంది. అధికారిక ఓటరు నమోదు డేటా ద్వారా ఈ విషయం స్పష్టమవడంతో, సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు, రాజకీయ విశ్లేషకులు దీనిపై రకరకాలుగా ఆరా తీస్తున్నారు.ప్రస్తుత ఓటర్ల జాబితా రికార్డుల ప్రకారం.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రెండు చోట్ల ఓటు హక్కు ఉన్నట్లు తెలుస్తోంది.ప్రస్తుత ఓటర్ల జాబితా రికార్డుల ప్రకారం.. మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానం పరిధిలోకి వచ్చే కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గంలో రేవంత్ రెడ్డి ఓటరుగా నమోదై ఉన్నారు. అదే సమయంలో నాగర్ కర్నూల్ పార్లమెంట్ స్థానం పరిధిలోని అచ్చంపేట అసెంబ్లీ నియోజక వర్గం ఓటర్ల జాబితాలో కూడా ఆయన పేరు స్పష్టంగా కనిపిస్తోంది. ఈ రెండు చోట్లా ఉన్న ఓటరు నమోదు పత్రాలలో ఆశ్చర్యకరంగా ఒకే ఒక ఎలక్షన్ ఐడీ కార్డ్ నంబర్ (టీఈూ0274035) ఉండటం గమనార్హం. అచ్చంపేట పరిధిలోని వాంగూర్ మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలోని ఆయన నివాస గృహ నంబర్ 3-48 అడ్రస్‌తో ఒక ఓటు ఉంటే.. కొడంగల్ పరిధిలో హౌస్ నంబర్ 1-209 అడ్రస్‌తో రెండో ఓటు నమోదై ఉంది.

1. కొడంగల్ నియోజకవర్గం: మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానం పరిధిలోకి వచ్చే కొడంగల్‌లో హౌస్ నంబర్ 1-209 అడ్రస్‌తో ఆయన ఓటు నమోదై ఉంది.
2. అచ్చంపేట నియోజకవర్గం: నాగర్ కర్నూల్ పార్లమెంట్ స్థానం పరిధిలోని అచ్చంపేట నియోజకవర్గం, వాంగూర్ మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలోని ఆయన ఇంటి నంబర్ 3-48 అడ్రస్‌తో మరో ఓటు నమోదై ఉంది. అయితే, ఇందులో అత్యంత ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. ఈ రెండు వేర్వేరు నియోజకవర్గాల్లోని ఓటర్ల జాబితాలోనూ రేవంత్ రెడ్డికి ఒకే ఒక ఎలక్షన్ ఐడీ కార్డ్ నంబర్ (ఉజూ0274035) ఉండటం గమనార్హం.ఈ డబుల్ ఎంట్రీ రికార్డులలో ముఖ్యమంత్రి పేరు స్పెల్లింగ్‌లో కూడా తప్పులు దొర్లాయి. ఆయన పేరు అసలు స్పెల్లింగ్ "=వఝుత్ష్ట" కాగా.. రెండు నియోజకవర్గాల ఓటర్ల జాబితాలోనూ నరసింహా రెడ్డి కుమారుడైన "ూఅబఎబశ్రీఖ =వఝుత్ =వ౿ఎ" అని నమోదై ఉంది.సాధారణంగా ఇలాంటి స్పెల్లింగ్ తప్పులను సరిదిద్దుకోవడానికి నిబంధనల ప్రకారం సంబంధిత ఓటర్ రిజిస్ట్రేషన్ అధికారికి ఫామ్-8 సమర్పించాల్సి ఉంటుంది. అలాగే, 1950 నాటి ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం.. ఏ పౌరుడూ కూడా ఒకటి కంటే ఎక్కువ నియోజకవర్గాల ఓటర్ల జాబితాలో ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హుడు కాదనే కఠినమైన నిబంధన ఉంది. ఈ బహుళ ఓటు నమోదును తొలగించుకోవడానికి, తాము సాధారణంగా నివసించని నియోజకవర్గ పరిధిలోని అధికారికి స్వచ్ఛందంగా ఫామ్-7 సమర్పించి, ఒక ఓటును రద్దు చేయాలని కోరే చట్టపరమైన అవకాశం ఓటరుకు ఉంటుంది.దేశంలో బహుళ ఓట్ల నమోదు అంశంపై చట్టం చాలా కఠినంగా వ్యవహరిస్తోంది. రెండు చోట్ల ఒకే వ్యక్తికి ఓటు ఉంటే ఏడాది జైలు శిక్ష తప్పదని ఇటీవలే ఎన్నికల సంఘం ప్రకటించింది. గతంలో ప్రముఖ నటుడు ప్రకాష్ రాజ్ కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు వంటి బహుళ రాష్ట్రాల్లో ఓటరుగా నమోదయ్యారనే ఆరోపణలపై బెంగళూరు కోర్టు నాన్-బెయిలబుల్ అరెస్ట్ వారెంట్ జారీ చేయడం, ఆ తర్వాత ఆయన బెయిల్ పొంది చట్టపరమైన విచారణను ఎదుర్కొంటుండటం మనకు తెలిసిందే.ఈ నేపథ్యంలోనే, ముఖ్యమంత్రి ఓటరు నమోదు డేటాలోనూ ఇలాంటి డబుల్ ఎంట్రీలు బయటపడటంతో.. "సీఎం రేవంత్ రెడ్డికి కూడా ఏడాది కాలం జైలుశిక్ష పడే అవకాశం ఏమైనా ఉందా?" అంటూ నెటిజన్లు, ప్రతిపక్షాలు ఆరా తీస్తున్నాయి. అత్యున్నత పదవిలో ఉన్న నేతలకు సంబంధించిన ఓటరు డేటాలోనే ఇలాంటి లోపాలు ఉండటం అధికారుల నిర్లక్ష్యమా లేక సాంకేతిక పొరపాటా అనే కోణంలోవిశ్లేషణలు సాగుతున్నాయి. ఏది ఏమైనా, ఈ 'డబుల్ ఓటు' వ్యవహారం ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతోంది.

## అంతా గమనే... కర్త...కర్మ... క్రియ...

**తిరుపతి, జూలై 15, పెన్ పవర్:**

ముసుగు తొలగిపోతోంది. తెర వెనుక ఉన్న చీకటి శక్తులు.. వెలుగులోకి వస్తున్నాయి. వారి లక్ష్యాలు.. దానికోసం ఎంచుకున్న మార్గాలు బయట పడుతున్నాయి. పైకి పెట్టింది ప్రశ్న అనే పేరు మాత్రమే.. కానీ దాని వెనుక ఉన్న పొలిటికల్ టార్గెట్లు.. కుట్రలు ఇప్పుడు బయట పడుతున్నాయి.. ఈ మొత్తం ఎపిసోడ్లో ఆటలో అరటిపండు కేవలం రావణ్ మాత్రమే. కథ మొత్తం గగనది.. దాని వెనుక ఉన్నది ఓ నాయకుడు.ప్రశ్న ఛానల్ పెట్టింది జోసెఫ్ అలియాస్ రావణ్. మొదట్లో సజావుగానే సాగింది. ఆ తర్వాత ఉద్యోగులకు జీతాలు ఇవ్వడం కూడా కష్టంగా మారింది. ఈ దశలో ప్రశ్న ఛానల్ లోకి వచ్చేసింది గగన.. సీఈవోగా మారింది. ఛానల్ వ్యవహారాలు మొత్తం తానే చూసింది. కొన్ని సందర్భాలలో రావణ్ తో కలిసి వీడియోలు చేసేది. షార్ట్స్ కూడా చేసేది. అవన్నీ కూడా పవన్ కళ్యాణ్ ను తీవ్రంగా వ్యతిరేకించే విధంగా ఉండేవి. కొన్ని సందర్భాలలో పవన్ కళ్యాణ్ అనుచరులపై వీడియోలు కూడా పెట్టేవారు.. బండ్ల గణేష్ మీద అత్యంత దారుణంగా వీడియోలు రూపొందించేవారు.గగన గన్నవరం పోలీస్ స్టేషన్లో విచారణకు హాజరైన తర్వాత.. పోలీసులు ఆమెను నిర్మానుష్యమైన ప్రాంతంలో మహిళా పోలీస్ అధికారుల సమక్షంలో విచారణ సాగించారు. ఈ నేపథ్యంలో అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. గగనది బళ్లారి ప్రాంతం. ఈమెకు రాము అనే వ్యక్తితో పెళ్లయింది. గమన ఒక బొటిక్ నిర్వహించేది. అక్కడికి ఇంద్రసేన నాయుడు వచ్చేవాడు. అలా ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడింది. అది కాస్త వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఆ తర్వాత ఇంద్రసేన నాయుడుతో గగన ఉండడం మొదలుపెట్టింది. రాము మీద అనేక రకాలుగా కేసులు పెట్టింది. గగన ఒత్తిడి తట్టుకోలేక రాము ఒక దశలో ఆత్మహత్యకు ప్రయత్నించాడు. వీరిద్దరి వ్యవహారం తట్టుకోలేక రాము నేరేడుమెట్ పోలీస్ స్టేషన్లో చీటింగ్ కేసు కూడా పెట్టాడు.రాముకు పూర్తిగా దూరం జరిగిపోయిన గగన ఇంద్రసేనకు బాగా దగ్గరయింది.. వీరిద్దరూ విదేశాలకు తరచు వెళ్లేవారు. వివిధ వ్యాపారాలు మొదలుపెట్టారు. ఈ క్రమంలోనే ప్రశ్న చానల్లో కి అనూహ్యంగా ప్రవేశించాడు ఇంద్రసేన.. ఈయనకు పొలిటికల్ లక్ష్యాలు ఉండడం.. పవన్ కళ్యాణ్ అంటే విపరీతమైన ద్వేషం ఉండడంతో గగన ద్వారా కథ నడిపించాడు. గమనం ప్రశ్న ఛానల్ సీఈవోను చేశాడు. ఫండింగ్ మొత్తం ఇంద్రసేన పెట్టాడు. ఆర్థిక వ్యవహారాలు మొత్తం గగన చూసుకునేది. చివరికి స్క్రిప్ట్.. కంటెంట్ మొత్తం తను ఇచ్చేది. రావణ్ ద్వారా చదివించేది.ఈ వ్యవహారం ఇలా సాగిపోతుండగానే.. దళిత క్రైస్తవుల సభలో రావణ్ పాల్గొనడం.. పవన్ కళ్యాణ్ మీద వ్యక్తిగతంగా విమర్శలు చేయడంతోఏపీ పోలీసులు దృష్టి సారించారు. ఆ తర్వాత రావణ్ ను అరెస్ట్ చేశారు. ఎన్ని రకాలుగా కేసులు నమోదు చేసినప్పటికీ అతనికి బెయిల్ వస్తున్న నేపథ్యంలో.. అతని ఫోన్.. డిజిటల్ ఉపకరణాలు స్వాధీనంచేసుకొని అందులో ఉన్న డేటా పరిశీలించారు. అప్పుడే పోలీసులకు దిమ్మ తిరిగిపోయింది. ఎందుకంటే దాంట్లో అనేక రకాల కుట్ర కోణాలు.. బూతు వీడియోలు.. సంభాషణలు కనిపించాయి. దీంతోపోలీసులు గగనను అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత ఇంద్రసేనతో ఆమె సాగించిన వ్యవహారం గురించి చెప్పడంతో పోలీసులకు ఫ్యూజులు ఎగిరిపోయాయిఇంద్రసేన నాయుడు సోదరుడుఉమామహేశ్వర నాయుడు వైసీపీ నాయకుడు.. గతంలో టిడిపిలో ఉన్నప్పటికీ టికెట్ ఇవ్వడానికి చంద్రబాబు నిరాకరించారు. దీంతో ఆయన వైసీపీకి తీర్థం పుచ్చుకున్నారు. పవన్ కళ్యాణ్ మీద ఈయనకి కూడా విపరీతమైన ద్వేషం ఉండేది. సోదరుడి టార్గెట్ ఏంటో తెలుసుకున్న ఇంద్రసేన నాయుడు ప్రశ్న ఛానల్ లో పెట్టుబడులు పెట్టి.. తన సోదరుడి పొలిటికల్ కు లక్ష్యాలకు అనుగుణంగా నడిపించడం మొదలుపెట్టాడు. అందువల్ల గన్నవరం విమానాశ్రయంలో గగనకు జగన్ దర్శన భాగ్యం సులభంగానే లభించింది. దీనికి తోడు గగన రావణ్ అరెస్ట్ అయిన ఒకరోజు వ్యవధిలోనే సెల్ఫీ వీడియో విడుదల చేసింది. అందులో జగన్ కు థాంక్స్ చెప్పింది.. ఈ అంశాలను పరిశీలనలోకి తీసుకున్న పోలీసులు లోతుగా దర్యాప్తు చేయడంతో ఈ విషయాలు బయటపడ్డాయి. అయితే రావణ్ కేవలం ఆటలో అరటిపండుమాత్రమేనని.. అసలు కథ చాలా ఉందని పోలీసులు చెబుతున్నారు

# అద్దె వాహనాల డ్రైవర్ల ఆర్థిక ఇబ్బందులు..
# వేతనాల పెంపు కోరుతూ సమ్మె

**హైదరాబాద్, జూలై1 5, పెన్ పవర్:**తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ శాఖలకు అద్దె ప్రాతిపదికన వాహనాలు నడుపుతున్న డ్రైవర్లు, యజమానులు అమీర్ పేట్ హెచ్ఎండిఏ కార్యాలయం ముందు సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రస్తుతం నెలకు రూ.34,000 చెల్లిస్తున్న అద్దెను పెంచి రూ.55,000కు పెంచాలని వారు డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల, వాహనాల నిర్వహణ ఖర్చులు, ఈఎంఐలు, డ్రైవర్ల జీతాలు, బీమా ప్రీమియంలు తదితర వ్యయాలు గణనీయంగా పెరిగినా అద్దె చార్జీలను పెంచకపోవడంతో తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్నామని వారు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే స్పందించి అద్దె చార్జీలను రూ.34 వేల నుంచి రూ.55 వేలకు పెంచాలని, తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంపత్ కుమార్, పందరి, సాయి, అబ్దుల్ ,హనుమంతు, వెంకటేష్, కరుణాకర్ ,నవీన్, ఆల్ హెచ్ఎండిఏ డ్రైవర్స్ తదితరులు పాల్గొన్నారు.

03

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# డిఫెన్స్ లో ట్రబుల్ షూటర్

**మెదక్ జూలై 15, పెన్ పవర్:**
తెలంగాణ రాజకీయాల్లో ప్రత్యర్థులపై నిరంతరం వాడివేడి విమర్శలు గుప్పించే బీఆర్ఎస్ ట్రబుల్ షూటర్, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు మొదటి సారి తీవ్రమైన పొలిటికల్ డిఫెన్స్‌లో పడినట్లు కనిపిస్తోంది. ఆయన సతీమణి తన్నీరు శ్రీనీత డైరెక్టర్‌గా ఉన్న ఆర్వెస్ నేచర్స్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ చుట్టూ ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త వివాదం ముదురుతోంది. మైకుల ముందు కత్తులు దూసుకునే వివిధ పార్టీల అగ్రనేతలు.. తెరవెనుక మాత్రం కోట్లాది రూపాయల వ్యాపార సామ్రాజ్యాల్లో చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్నారనే విమర్శలకు ఈ కంపెనీ తాజా లీకులు మరింత బలం చేకూరుస్తున్నాయిఈ వివాదంలో ప్రధానంగా వినిపిస్తున్న ఆరోపణ.. మార్కెట్ నెట్‌వర్క్ గురించినదే. సాధారణంగా ఏ ప్రైవేట్ డైరీ బ్రాండ్‌కైనా మార్కెట్‌లో నిలదొక్కుకోవడానికి సాధారణ ప్రజలు, కిరాణా షాపులరిటైల్ వాటా ఎక్కువగా ఉండాలి. కానీ, మిల్చీ మిల్క్ బ్రాండ్‌కు బహిరంగ మార్కెట్‌లో వాటా చాలా తక్కువగా ఉన్నప్పటికీ, హైదరాబాద్‌లోని దాదాపు అన్ని ప్రముఖ కార్పొరేట్ ఆసుపత్రులకు ఈ కంపెనీ నుంచే భారీగా పాలు, ఇతర ఉత్పత్తులు సరఫరా అవుతుండటం ఇప్పుడు అనుమానాలకు తావిస్తోంది. రోగుల ఆరోగ్య అవసరాల నెపంతో.. నిబంధనలకు విరుద్ధంగా పొలిటికల్ ఇన్‌ఫ్లుయెన్స్ ఉపయోగించి ఈ బల్క్ ఆర్డర్లు దక్కించుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ రికార్డుల ప్రకారం.. ఈ కంపెనీ పెట్టుబడులు , వ్యాపార లావాదేవీల వెనుక ఆసక్తికరమైన క్రాస్-పార్టీ బంధాలు బయటపడ్డాయి. అపోలో గ్రూప్‌తో పాటు చేవెళ్ల బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి కుటుంబ సభ్యులు, అలాగే బీజేపీ , కాంగ్రెస్‌కు చెందిన మరికొందరుకీలక నేతల కుటుంబాల ప్రమేయం ఇందులో ఉందనే ప్రచారం జోరందుకుంది. రాజకీయాలు కేవలం ఓట్ల కోసమే.. వ్యాపారాల దగ్గరకు వచ్చేసరికి పార్టీల రంగులు మారిపోతాయి అంటూ నెటిజన్లు, రాజకీయవిశ్లేషకులు ఈ స్క్రీన్ వెనుక భాగస్వామ్యాలపై సెటైర్లు వేస్తున్నారు.ఈ వ్యవహారం సోషల్ మీడియాలో దుమారం రేపిన వెంటనే.. సదరు కంపెనీకి సంబంధించిన అధికారిక వెబ్‌సైట్ అర్ధాంతరంగా డౌన్ కావడంఈ ఆరోపణలకు మరింత బలాన్ని చేకూర్చింది. లోపల ఉన్న ఇన్వెస్టర్ల పూర్తి వివరాలు, ప్రమోటర్ల పేర్లు ప్రజాబాహుళ్యంలోకి వెళ్లకుండా దాచేందుకే వ్యూహాత్మకంగా వెబ్‌సైట్‌ను క్లోజ్ చేశారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, అప్పటికే అలర్ట్ అయిన నెటిజన్లు పాత స్క్రీన్ షాట్లను ట్విట్టర్, వాట్సాప్ లలో షేర్ చేస్తూ.. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నేతల అంతర్గత సయోధ్యను వేలెత్తి చూపిస్తున్నారు.కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి చెప్తున్నట్లుగా బీఆర్ఎస్, బీజేపీలు తెరవెనుక ఒక్కటే అనే నినాదానికి ఇలాంటి వ్యాపార భాగస్వామ్యాలు రాజకీయంగా మరింత ఆయుధాన్ని ఇస్తున్నాయి.ఎన్నికల వేళ డ్రామాలు ఆడుతూ, లోపల మాత్రం ఇలాంటి మెగా డైరీ ప్రాజెక్టుల ద్వారా పరస్పర ఆర్థిక ప్రయోజనాలు పొందుతున్న నేతల ద్వంద్వ నీతిపై క్షేత్రస్థాయిలో తీవ్ర చర్చ నడుస్తోంది. వెబ్‌సైట్ డౌన్ చేసినంత మాత్రాన డిజిటల్ ఆధారాలు చెరిగిపోవని, ఈ మిల్చీ మిల్క్ వ్యాపార నెట్‌వర్క్, హాస్పిటల్ సప్లై వెనుక ఉన్న అసలు సత్యాలపై హరీష్ రావు బహిరంగంగా సమాధానం చెప్పాల్సిన అవసరం ఎంతైనాఉందని రాజకీయ వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి

# కాంగ్రెస్ ను ముంచేస్తున్న అంతర్గత శత్రువులు



**హైదరాబాద్, జూలై1 5, పెన్ పవర్:**
కాంగ్రెస్ పార్టీకి శత్రువులు ఎక్కడో ఉండరని, ఆ పార్టీలోనే ఉంటారనేది రాజకీయాల్లో తరచూ వినిపించే మాట. ఇప్పుడు తెలంగాణ కాంగ్రెస్‌లో జరుగుతున్న పరిణామాలు ఈ వ్యాఖ్యలను అక్షరాలా నిజం చేస్తున్నాయి. పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ, అంతర్గత అసంతృప్తులు, బహిరంగ విమర్శలు కాంగ్రెస్ సర్కార్‌ను తీవ్ర ఇబ్బందుల్లోకి నెడుతున్నాయి. తాజాగా ఫైర్‌బ్రాండ్ నాయకురాలు, రాజ్యసభ ఎంపీ రేణుకా చౌదరి, సీనియర్ నేత, ఎమ్మెల్సీ విజయశాంతి చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి. విపక్షాలకు ఆయుధాలు అందిస్తూ, సొంత ప్రభుత్వంపైనే వీరు గురిపెట్టడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కాంగ్రెస్ హైకమాండ్ ప్రతినిధి మీనాక్షి నటరాజన్‌తో ఎంపీ రేణుకా చౌదరి భేటీ కావడం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. ముఖ్యంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా తాజా రాజకీయాలపై వీరి మధ్య సుదీర్ఘ చర్చ జరిగింది. అయితే ఈ భేటీ అనంతరం రేణుకా చౌదరి చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ శ్రేణులను ఉలిక్కిపడేలా చేశాయి.రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు మళ్లీ పుంజుకుంటున్నాయని, కాంగ్రెస్ నాయకత్వం ఇప్పటికైనా మేలుకోవాలని ఆమె ఘాటుగా హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో ఎక్కడెక్కడ కాంగ్రెస్ నేతలు అసంతృప్తిగా ఉన్నారో ఆ విషయాన్ని బీజేపీ నేతలు పసిగడుతున్నారని, వారిని తమ వైపు తిప్పుకునేందుకు వ్యూహాలు రచిస్తున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీలో చాలా సమస్యలు ఉన్నాయని, వాటన్నింటిపై అధిష్ఠానంతో మాట్లాడతానని రేణుక స్పష్టం చేయడం ద్వారా.. పార్టీలో అంతా సజావుగా లేదనే సంకేతాన్ని ఆమె బహిరంగంగానే పంపించారు.మరోవైపు, సీనియర్ నేత విజయశాంతి సోషల్ మీడియా వేదికగా షాబాద్ నరమేధం ఉదంతాన్ని ప్రస్తావిస్తూ సొంత ప్రభుత్వంపై, పోలీస్ శాఖపై తీవ్ర విమర్శలు గుప్పించారు. షాబాద్ ఘోర కలికలిలో హంతకుడు ఆత్మహత్య చేసుకోవడంతో పోలీసులు ఈ కేసు ముగిసిందని భావించడంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు.ఈ కేసులో అసలు లోపాన్ని వేలెత్తి చూపుతూ.. పోక్సో కేసులో అరెస్ట్ అయిన నిందితుడు రాజ్ కుమార్ బెయిల్‌పై విడుదల కావడానికి పోలీసుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. నిందితుడి నుంచి లంచం తీసుకుని పోలీసులు అతడి విడుదలకు సహకరించారన్న వార్తలు పత్రికల ద్వారా తెలిసి తెలంగాణ మహిళా లోకం షాక్‌కు గురవుతోందని విజయశాంతి పేర్కొన్నారు. పోలీసుల చేసిన ఈ ఘోర తప్పిదం వల్లే, బయటకు వచ్చిన నిందితుడు ఏకంగా ఆరుగురి ప్రాణాలను కడతేర్చడానికి ఆస్కారం ఏర్పడిందని ఆమె తీవ్రంగా మండిపడ్డారు.మహిళలకు ప్రాధాన్యత ఇస్తామని చెబుతున్న కాంగ్రెస్ పాలనలో ఈ ఘటనను అత్యంత సీరియస్‌గా పరిగణించాలని ఆమె డిమాండ్ చేశారు. పోలీస్ శాఖలోని ఇలాంటి అవినీతి, లోపాల వల్ల తెలంగాణలో మహిళా భద్రతపై అనుమానాలు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తూ.. ఒక మహిళా ప్రజాప్రతినిధిగా శాంతిభద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించాలని కోరారు.ఈ ఇద్దరు మహిళా నేతల వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీ అంతర్గత సమస్యలను వీధిలోకి తెచ్చాయి. ప్రతిపక్షాలు ప్రభుత్వ వైఫల్యాలను వెతకాల్సిన పనిలేకుండా, సొంత పార్టీ నేతలే లోపాలను ఎండగడుతుండటం కాంగ్రెస్ నాయకత్వానికి మింగుడుపడటం లేదు. శాంతిభద్రతల వైఫల్యం, నేతల్లో అసంతృప్తి, విపక్షాల బలం పెరుగుతుండటం వంటి అంశాలపై రేణుక, విజయశాంతి చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీకి గొడ్డలిపెట్టులా మారాయి. అధికారంలో ఉండి కూడా సమన్వయం లోపించడం, అంతర్గత అసంతృప్తిని కప్పిపుచ్చుకోలేకపోవడం పార్టీని రక్షణలో పడేస్తోంది. ఈ సొంతింటి మంటలను కాంగ్రెస్ అధిష్ఠానం ఎలా చల్లారుస్తుందో చూడాలి.


# అభివృద్ధి కోసం కేంద్రాన్ని టార్గెట్ చేసిన సీఎం!

**హైదరాబాద్, జూలై 15, పెన్ పవర్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధిని పార్టీ రాజకీయాలకు అతీతంగా చూడాలని సూచించిన తర్వాత బీజేపీ ఎంపీలు ఆయనతో సమావేశమయ్యారు. ఈ సమావేశం రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల అనుమతులు, కేంద్ర నిధులు వంటి అంశాలపై దృష్టి సారించింది. రేవంత్ రెడ్డి ఈ సమావేశం తర్వాత ఢిల్లీ ప్రయాణం వ్యూహం అభివృద్ధి ప్రాధాన్యతను స్పష్టం చేస్తోంది. రాజకీయ భేదాలను పక్కన పెట్టి రాష్ట్ర ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేస్తుంది. ఇది సాధారణంగా వ్యతిరేక పక్షాల మధ్య సహకారం అరుదైన సందర్భంలో ముఖ్యమైనది. రాష్ట్ర అభివృద్ధి పనులు కేంద్ర ప్రభుత్వ అనుమతులు, నిధులపై ఆధారపడి ఉండటంతో ఇలాంటి సమన్వయం అవసరం.ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి వంటి బీజేపీ ఎంపీలు సమావేశానికి హాజరవడం సానుకూల అంశం. వారు పెండింగ్‌ప్రాజెక్టుల అనుమతులు, నిధుల విడుదలపై దృష్టి పెట్టాలని కోరడం రాష్ట్ర సమస్యలపై ఉమ్మడి ఆందోళనను చూపిస్తుంది. ఇది రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో చర్చలు జరపడానికి ఒక మద్దతు వేదికగా మారవచ్చు. అయితే ఇది పూర్తి స్థాయి రాజకీయ సహకారం కాదని, నిర్దిష్ట అంశాలపై మాత్రమే సమన్వయం అని అర్థం చేసుకోవాలి.కిషన్ రెడ్డి, బండి సంజయ్, అర్వింద్ వంటి ప్రముఖ బీజేపీ నాయకులుహాజరు కాకపోవడం ఈ వ్యూహానికి ఒక సవాల్ గా కనిపిస్తుంది. ఇది బీజేపీలో అంతర్గత వ్యూహాలు, వేరే ప్రాధాన్యతలు లేదా రాజకీయ ఒత్తిళ్లను సూచిస్తోంది. ప్రతిపక్షంగా ఉన్నప్పుడు పూర్తి స్థాయి సహకారం ఇవ్వడం కష్టం కావడం సహజం. ఈ గైర్హాజరు రేవంత్ రెడ్డి చేస్తున్న ప్రయత్నాలకు పూర్తి మద్దతు లభించకపోవచ్చని, లేదా బీజేపీ వైపు నుంచి వేరే విధానం అనుసరించే అవకాశం ఉంది.రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లి కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న అనుమతులు, నిధుల కోసం ప్రయత్నించడం ఈ వ్యూహంలో కీలక భాగం. రాష్ట్రాలు కేంద్ర నిధులు, అనుమతులపై ఎంతగా ఆధారపడి ఉంటాయో ఇది గుర్తు చేస్తుంది. ఈ ప్రయాణం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ భేదాలు పక్కన పెట్టి కేంద్రంతో సమన్వయం చేసుకునే ప్రయత్నం చేస్తోంది.రేవంత్ రెడ్డి ఈ వ్యూహం ద్వారా రాజకీయ పరిపక్వతను చూపించారు. రాష్ట్ర అభివృద్ధి అనేది ఒక్క పార్టీ సాధించగలిగేది కాదు. కేంద్ర-రాష్ట్ర సమన్వయం అవసరమైనప్పుడు ఇలాంటి చర్చలు ఉపయోగకరంగా ఉంటాయి. బీజేపీలోని కొందరు ఎంపీల హాజరు ఈప్రయత్నానికి కొంత మద్దతు ఇస్తుంది. రేవంత్ రెడ్డి వ్యూహం రాజకీయాల కంటే అభివృద్ధిని ముందుంచి చూస్తున్నట్లు కనిపిస్తోంది. దీని విజయం ఢిల్లీలో ఎంత మేరకు నిధులు, అనుమతులు సాధించగలుగుతారనే దానిపై ఆధారపడి ఉంటుంది.

# వైసీపీలో మళ్లీ కీలకం కానున్న చెవిరెడ్డి

**తిరుపతి, జూలై 15 పెన్ పవర్:**
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లో కీలక నేతల పాత్రపై మరోసారి రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. పార్టీ వ్యవహారాలను ఎవరు సమన్వయం చేస్తున్నారు, అధినేతకు అత్యంత సన్నిహితంగా ఎవరు వ్యవహరిస్తున్నారు అనే అంశాలపై ఊహాగానాలు వినిపిస్తున్నాయి. గతంలో పార్టీలో "కోటరీ" వ్యవస్థ ఉందంటూ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి పలు సందర్భాల్లో వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ఆ వ్యాఖ్యలు అప్పట్లో రాజకీయంగా పెద్ద చర్చకు దారితీశాయి.ప్రస్తుతం వైసీపీ రాష్ట్ర కోఆర్డినేటర్‌గా సజ్జల రామకృష్ణారెడ్డి వ్యవహరిస్తున్నారు. పార్టీ తరఫున విధానపరమైన ప్రకటనలు చేయడం, కీలక రాజకీయ అంశాలపై స్పందించడం, నాయకత్వ నిర్ణయాలను కేడర్‌కు చేరవేయడం వంటి బాధ్యతలను ఆయన నిర్వహిస్తూ వస్తున్నారు. అందుకే పార్టీ వ్యవహారాల్లో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో చాలాకాలంగా ఉంది.అయితే ఇటీవల మరో సీనియర్ నేత పేరు ఎక్కువగా వినిపిస్తోంది. తిరుపతి జిల్లా)కు చెందిన మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పార్టీ కేంద్ర కార్యాలయంలో చురుకుగా వ్యవహరిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. పార్టీ కార్యక్రమాల సమన్వయంలో ఆయన పాత్ర పెరిగిందనే చర్చ కూడా రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది.చంద్రగిరి ) నియోజకవర్గం నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన చెవిరెడ్డి, 2024 ఎన్నికల సమయంలో తన కుమారుడు మోహిత్ రెడ్డి ని రాజకీయాల్లోకి తీసుకొచ్చారు. అదే ఎన్నికల్లో ఆయన ఒంగోలు లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేశారు. అయితే ఎన్నికల్లో కూటమి ప్రభావంతో తండ్రీకొడుకులు ఇద్దరూ విజయం సాధించలేకపోయారు. తర్వాత లిక్కర్ కేసుకు సంబంధించి చెవిరెడ్డి అరెస్టై కొంతకాలం జైలులో ఉన్నారు. అనంతరం బెయిల్‌పై విడుదలైన తర్వాత ఆయన పార్టీ కార్యకలాపాల్లో మరింత చురుకుగా వ్యవహరిస్తున్నారని సమాచారం. ముఖ్యంగా తాడేపల్లి లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఎక్కువ సమయం గడుపుతున్నారని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.పార్టీకి సంబంధించిన వివిధ జిల్లాల పరిస్థితులపై సమాచారం సేకరించడం, స్థానిక నాయకులతో సమన్వయం చేయడం, ఆ వివరాలను పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి చేరవేయడం వంటి బాధ్యతల్లో చెవిరెడ్డి పాల్గొంటున్నారనే ప్రచారం కొనసాగుతోంది. అలాగే పార్టీ కార్యక్రమాలు సమర్థంగా అమలు అయ్యేలా పర్యవేక్షిస్తున్నారని కూడా పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.ఇటీవల కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనకు వ్యతిరేకంగా వైసీపీ చేపట్టిన నిరసన కార్యక్రమాల నిర్వహణలో కూడా చెవిరెడ్డి చురుకుగా వ్యవహరించారని ఆయన అనుచరులు చెబుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా నాయకులతో నిరంతరం సంప్రదింపులు జరిపి కార్యక్రమాలను సమన్వయం చేశారని వారు పేర్కొంటున్నారు. ఈ కారణంగా ఆయనకు పార్టీ అధినాయకత్వం వద్ద మరింత ప్రాధాన్యం పెరిగిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.మరోవైపు సజ్జల రామకృష్ణారెడ్డి ఇప్పటికీ పార్టీ విధానపరమైన అంశాల్లో కీలక
పాత్ర పోషిస్తూనే ఉన్నారని పరిశీలకులు గుర్తుచేస్తున్నారు. అధికారిక ప్రకటనలు, రాజకీయ స్పందనలు
ఎక్కువగా ఆయన ద్వారానే వెలువడుతున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో సజ్జల, చెవిరెడ్డి ఇద్దరూ పార్టీ వ్యవహారాల్లో ముఖ్యమైన బాధ్యతలు నిర్వహిస్తున్నారనే చర్చ కొనసాగుతోంది. అయితే పార్టీలో వారి పాత్రలు ఎలా మారతాయి, భవిష్యత్‌లో బాధ్యతల పంపిణీలో ఎలాంటి మార్పులు చోటు చేసుకుంటాయనే అంశంపై అధికారికంగా ఎలాంటి ప్రకటన లేదు. దీంతో వైసీపీ అంతర్గత రాజకీయాలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి కొనసాగుతోంది.

# కూటమి ఎమ్మెల్యేలే టార్గెట్ గా రావణ్ టీమ్



**అనంతపురం, జూలై 15 పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం రేపుతున్న 'ప్రశ్న' యూట్యూబ్ ఛానల్ బ్లాక్‌మెయిలింగ్, వేధింపుల కేసు విచారణలో తాజాగా మరో సంచలన నిజాన్ని వెలుగులోకి వచ్చింది. అనంతపురం జిల్లా కల్యాణదుర్గం టీడీపీ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబును వ్యక్తిగతంగా, రాజకీయంగా దెబ్బతీయడానికి ఈ యూట్యూబ్ ముఠా పెద్ద ఎత్తున కుట్ర పన్నినట్లు అంతర్గత విచారణలో బయటపడింది. 'ప్రశ్న' నిర్వాహకుడు జోసెఫ్ అలియాస్ రావణ్, అతని అనుచరులు చాలా కాలంగా ఎమ్మెల్యేకు వేధింపులు గురిచేసినట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది.ఎమ్మెల్యే సురేంద్ర బాబుపై సమాజంలో అప్రతిష్ట తెచ్చేలా తప్పుడు అవినీతి ఆరోపణలతో వీడియోలు రూపొందించడం వెనుక కీలక సూత్రధారుల లింకులు బయటపడ్డాయి. ఈ కుట్ర వెనుక వైసీపీ నేత ఉమామహేశ్వర్ నాయుడి సోదరుడు ఇంద్రసేననాయుడు ప్రమేయం ఉన్నట్లు ఆధారాలు లభించాయి. ఆయనతో పాటు 'ప్రశ్న' యూట్యూబ్ ఛానల్ సీఈవో గమన కూడా ఈ ప్లాన్‌లో భాగస్వామి అయి, తెరవెనుక స్క్రిప్ట్ డిజైనింగ్, ఫండింగ్‌వ్యవహారాలను నడిపించినట్లు జిల్లావ్యాప్తంగా జోరుగా చర్చ సాగుతోంది.కూటమి ప్రభుత్వానికి చెందిన ప్రజాప్రతినిధులను టార్గెట్ చేస్తూ విపక్షాలు, కొన్ని యూట్యూబ్ ఛానళ్లు చేస్తున్న ఇటువంటి విషప్రచారాలపై అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇదివరకే పార్టీ నేతలకు సూచించారు. తాజా పరిణామాల నేపథ్యంలో గమన, ఇంద్రసేన నాయుడుల వ్యవహారంపై పోలీసులుదర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ డిజిటల్ నెట్‌వర్క్ వెనుక ఉన్న మరికొంతమంది కీలక వ్యక్తుల కాల్ డేటా, ఆర్థిక లావాదేవీలను వెలికితీసేందుకు గన్నవరం పోలీసులు తదుపరి చర్యలకు
**సిద్ధమవుతున్నారు.**

వెనక్కి తగ్గిన పోలీసులు

యూట్యూబ్ ఛానల్ నిర్వాహకుడు బచ్చలకూరి జోసెఫ్ అలియాస్ ప్రసన్న రావణ్ కేసు విచారణలో ఊహించని మలుపు చోటుచేసుకుంది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా రావణ్‌ను 10 రోజుల పాటు తమ
కస్టడీకి ఇవ్వాలంటూ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై గన్నవరం కోర్టులో విచారణ జరిగింది. అయితే, నాటకీయ పరిణామాల మధ్య ఆ కస్టడీ పిటిషన్‌ను తాము వెనక్కి (ఉపసంహరణ)తీసుకుంటున్నట్లు పోలీసుల తరఫు న్యాయవాది న్యాయస్థానానికి అధికారికంగా తెలియజేశారు.డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలతో పాటు మావోయిస్టు భావజాల వ్యాప్తి, సాయుధతిరుగుబాటును ప్రోత్సహించేలా మాట్లాడారనే తీవ్రమైన ఆరోపణలపై గన్నవరం పోలీసులు రావణ్‌పై ఉపా (ఖూఫ్రాూా) చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించిన సంగతి తెలిసిందే. ఈ కేసు
మూలాలను, ఆర్థిక లావాదేవీలను వెలికితీసేందుకు 10 రోజుల పోలీసు కస్టడీ అవసరమని గత శుక్రవారం పోలీసులు కోరారు. అయితే, ఈ కేసులో 'ప్రశ్న' యూట్యూబ్ ఛానల్ సీఈఓ గమనతో పాటుపలువురు కీలక వ్యక్తులను గన్నవరం డీఎస్పీ కార్యాలయంలో పోలీసులు ఇప్పటికే సుదీర్ఘంగా విచారించి అవసరమైన వివరాలు, డిజిటల్ ఆధారాలను సేకరించినట్లు తెలుస్తోంది.రావణ్ కస్టడీ అవసరం
లేదని భావించి పోలీసులు వెనక్కి తగ్గినట్లు న్యాయవర్గాల్లో చర్చ సాగుతోంది. పోలీసులు కస్టడీ పిటిషన్‌ను ఉపసంహరించుకోవడంతో జోసెఫ్ రావణ్ ప్రస్తుతానికి నెల్లూరు సెంట్రల్ జైల్లోనే జ్యుడీషియల్‌రిమాండ్‌లో కొనసాగనున్నారు. మరోవైపు, ఈ కేసులో ప్రభుత్వం కావాలనే ఉపా వంటి కఠిన చట్టాలను అక్రమంగా ప్రయోగిస్తోందని రావణ్ తరఫు న్యాయవాది పొన్నవోలు సుధాకర్ రెడ్డి కోర్టు వెలుపల తీవ్రఆరోపణలు చేశారు. తనపై నమోదైన పలు కేసులను ఒకే కేసుగా విచారించాలని కోరుతూ రావణ్ ఇప్పటికే ఏపీ హైకోర్టును కూడా ఆశ్రయించారు. పోలీసుల తాజా ఉపసంహరణ నిర్ణయంతో ఈ పొలిటికల్‌అండ్ లీగల్ డ్రామా ఏ మలుపు తిరుగుతుందో అన్నది ఆసక్తికరంగా మారింది

# గోదావరి జిల్లాలపై నేతల గురి




**రాజమండ్రి, జూలై 15 పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో గోదావరి ప్రాంతానికి ప్రత్యేకమైన స్థానం ఉంది. ముఖ్యంగా తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కోనసీమ, ఏలూరు ) జిల్లాల్లో రాజకీయ పరిణామాలు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారడం కొత్త విషయం కాదు. ఈ ప్రాంతంలో రాజకీయ చైతన్యం ఎక్కువగా ఉండటంతో పాటు ఎన్నికల సమయంలో ప్రజల తీర్పు కూడా రాష్ట్ర రాజకీయాలపై ప్రభావం చూపుతుందని విశ్లేషకులు భావిస్తుంటారు. అందుకే అధికార, ప్రతిపక్ష పార్టీలు రెండూ గోదావరి జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారిస్తుంటాయి.ఇటీవల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వరుస జిల్లా పర్యటనలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. కొద్ది రోజుల క్రితం రాయలసీమ ప్రాంతంలోని తిరుపతి చిత్తూరు , కడప, అన్నమయ్య జిల్లాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, ఇప్పుడు గోదావరి జిల్లాల పర్యటన ప్రారంభించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరించడంతో పాటు, ప్రాజెక్టుల పురోగతిని పరిశీలించడంపై దృష్టి పెట్టారు.ఈ పర్యటనలో భాగంగా తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, ఏలూరు జిల్లాల్లో పలు కార్యక్రమాలకు హాజరవుతున్నారు. ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద గేట్ల పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు, పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిని కూడా సమీక్షించారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై వివరాలు వెల్లడిస్తున్నారు.మరోవైపు ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి
వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కూడా గోదావరి జిల్లాలపై దృష్టి కేంద్రీకరించారు. గత ఎన్నికల అనంతరం ఈ ప్రాంతంలో పెద్దగా పర్యటించని ఆయన, ఇప్పుడు పశ్చిమ గోదావరి జిల్లాలోని భీమవరం ( పర్యటనకు సిద్ధమవుతున్నారు. ఈ సందర్భంగా వచ్చే 15న ఆక్వా రైతులతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకునే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.ఆక్వా రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు,
రైతులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులు, మార్కెట్ పరిస్థితులు వంటి అంశాలను జగన్ ప్రస్తావించే అవకాశం ఉందని సమాచారం. ఈ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేసే అవకాశము ఒదని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.సార్వత్రిక ఎన్నికలకు ఇంకా కొంత సమయం ఉన్నప్పటికీ, స్థానిక సంస్థల ఎన్నికలపై ఇప్పటికే రాజకీయ పార్టీల దృష్టి పడింది. అందుకే అధికార పార్టీతో పాటు ప్రతిపక్షం
కూడా ప్రజల్లో చురుకుగా ఉండేందుకు ప్రయత్నాలు ప్రారంభించినట్లు కనిపిస్తోంది. ప్రజా సమస్యలను ప్రస్తావిస్తూ తమ
రాజకీయ కార్యాచరణను వేగవంతం చేసే దిశగా అడుగులు వేస్తున్నాయి.ఒకే సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రతిపక్ష నేత జగన్ ఇద్దరూ గోదావరి ప్రాంతంలో పర్యటనలు చేపట్టడం రాజకీయంగా ఆసక్తికర పరిణామంగా మారింది. ఈ
పర్యటనలు స్థానిక రాజకీయాలపై మాత్రమే కాకుండా, రాబోయే ఎన్నికల వ్యూహాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గోదావరి జిల్లాల్లో మొదలైనఈ రాజకీయ చురుకుదనం రానున్న రోజుల్లో రాష్ట్ర రాజకీయాలను మరింత వేడెక్కించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# పట్టిసీమ వివాదంలోకి రేవంత్

**విజయవాడ జూలై16 పెన్ పవర్:** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య జల రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. తెలంగాణలోని కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీ వద్ద కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే నీటిని నిల్వ చేయకుండా కిందకు వదిలేస్తోందని, తద్వారా ఏపీలోని పట్టిసీమ ఎత్తిపోతల పథకానికి గోదావరి జలాలు సమృద్ధిగా అందేలా చూస్తోందని ప్రతిపక్ష బిఆర్ఎస్ ఆరోపిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన గురువు చంద్రబాబుకు మేలు చేసేందుకే తెలంగాణ ప్రయోజనాలను పణంగా పెడుతున్నారన్నది ఈ విమర్శల సారాంశం. ఈ నేపథ్యంలో ఈ వాదనలోని సాంకేతిక, భౌగోళిక అంశాలపై ఆసక్తి నెలకొంది.తెలంగాణలోని కన్నెపల్లి మేడిగడ్డ పంప్ హౌస్ నుంచి ఎత్తిపోసే నీరు కిందకు రాకపోవడం వల్లే ఏపీలోని పట్టిసీమకు నీరు అందుతుందనే వాదన ప్రాథమిక భౌగోళిక సూత్రాలకే విరుద్ధం. మహారాష్ట్ర నుంచి వచ్చే ప్రాణహిత, గోదావరి నదులు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం వద్ద కలుస్తాయి. ఇక్కడే మేడిగడ్డ బ్యారేజీ ఉంది. మేడిగడ్డ దాటిన తర్వాత గోదావరి నది వందల కిలోమీటర్ల మేర ప్రవహించి, ఛత్తీస్‌గఢ్,ఒడిశా సరిహద్దుల నుంచి వచ్చే ఇంద్రావతి, శబరి వంటి భారీ ఉపనదులను కలుపుకుంటుంది. ఈ ఉపనదులన్నీ కలిసిన తర్వాతే గోదావరి నది ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం, ఆపై రాజమండ్రి ఎగువన ఉన్న పట్టిసీమ ప్రాంతానికి చేరుకుంటుంది.కాబట్టి మేడిగడ్డ వద్ద నీటిని ఆపినా, ఆపకపోయినా... వర్షాకాలంలో ఇంద్రావతి, శబరి, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లలో కురిసే భారీ వర్షాల కారణంగా వచ్చే వరద నీరు సహజ గ్రావిటీ ద్వారా పట్టిసీమకు చేరుకుంటుంది. జూలై మొదటి వారంలో మహారాష్ట్రలో కురిసిన భారీ వర్షాలకు ప్రాణహిత ద్వారా మేడిగడ్డకు సుమారు 1 లక్ష క్యూసెక్కుల వరద రాగా, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిబంధనల ప్రకారం ఆ నీటిని కిందకు వదిలారు. అదే సమయంలో ఏపీలోని పట్టిసీమ వద్ద గోదావరిలోకి వచ్చిన 56,000 క్యూసెక్కుల వరద జలాల నుంచే జూలై 8న ఏపీ ప్రభుత్వం కృష్ణా డెల్టాకు నీటిని లిఫ్ట్ చేయడం ప్రారంభించింది.కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కారణాలతోనే మేడిగడ్డ వద్ద నీటిని నిల్వ చేయడం లేదన్న ఆరోపణలున్నాయి. అయితే దీనికి అనేక సాంకేతిక కారణాలున్నాయి. అక్టోబర్ 2023లో మేడిగడ్డ బ్యారేజ్ 7వ బ్లాక్‌లోని కొన్ని పిల్లర్లు కుంగిపోయాయి. దీనిపై విచారణ జరిపిన చీఎూూా బ్యారేజీ పునాదుల కింద ఇసుక కొట్టుకుపోవడం, జియో–టెక్నికల్ సర్వేల్లో లోపాలు ఉన్నట్లు తేల్చింది. ప్రస్తుత స్థితిలో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో పూర్తి స్థాయిలో అంటే 141 మీటర్ల మేర నీటిని నిల్వ చేయడం అత్యంత ప్రమాదకరమని, బ్యారేజీలు కొట్టుకుపోయే ప్రమాదం ఉందని చీఎూూా స్పష్టం చేసింది. ఈ మూడు బ్యారేజీల శాశ్వత పునరుద్ధరణ పనులు పూర్తి కావడానికి కనీసం 2 నుండి 3 ఏళ్ల సమయం పడుతుందని అంచనా. నదిలో ప్రవాహం లేని ఎండకాలంలో మాత్రమే కాంక్రీట్ పనులు చేయడం సాధ్యమవుతుంది. ప్రభుత్వం ప్రాజెక్టు భద్రతను దృష్టిలో ఉంచుకుని నిపుణుల కమిటీ సూచనల మేరకే గేట్లు ఎత్తి నీటిని కిందకు పంపుతోంది తప్ప, పట్టిసీమకు నీరివ్వాలనే ఉద్దేశంతో కాదు. ఒకవేళ బలవంతంగా నీటిని నిల్వ చేస్తే రూ. 1.1 లక్షల కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ఆస్తులకే ముప్పు వాటిల్లుతుంది.రాజకీయ విమర్శల కోణంలో చూస్తే రేవంత్ రెడ్డి ఏపీకి మేలు చేస్తున్నారనే ఆరోపణలు ప్రజల్లోకి వెళ్ళవచ్చు. కానీ, క్షేత్రస్థాయి పరిశీలన, సాంకేతిక నివేదికల ప్రకారం మేడిగడ్డ వద్ద నీటిని నిల్వ చేయకపోవడానికి ప్రధాన కారణం ఆ ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన సాంకేతిక లోపాలు, భద్రతా కారణాలే. భౌగోళికంగా మేడిగడ్డకు వందల కిలోమీటర్ల దిగువన ఉండే పట్టిసీమకు నీరు అందడం అనేది గోదావరి నది సహజ ప్రవాహం, ఇతర ఉపనదుల వరద మీద ఆధారపడి ఉంటుంది తప్ప, మేడిగడ్డ గేట్లు వేయడం లేదా ఎత్తడం పై మాత్రమే ఆధారపడి లేదు.

# నవంబర్ లో లోకల్ బాడీ ఎన్నికలు

**విజయవాడ, జూలై 16, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల వేడి మొదలైంది. రాబోయే నవంబర్ నాటికి లోకల్ పోల్స్ ముగించాలనే పక్కా ప్లాన్‌తో అధికార కూటమి అడుగులు వేస్తోంది. ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇద్దరూ ఇప్పటికే తమ పార్టీల శ్రేణులకు ఈ విషయంలో స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. చట్టపరమైన, సాంకేతికపరమైన ప్రక్రియ పూర్తి కాగానేస్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని, దానికి సైనికుల్లా సిద్ధం కావాలని క్షేత్రస్థాయి క్యాడర్‌ను అలర్ట్ చేశారు. ఎన్నికల ప్రకటన వచ్చిన తర్వాత సీట్ల కోసం కొట్టుకోకుండా, ముందే గ్రౌండ్ లెవెల్‌లోఒక అవగాహనకు అంతర్గతంగా వచ్చేస్తున్నారు. గత ఎన్నికల్లో జనసేన పార్టీ వంద శాతం స్ట్రైక్ రేట్‌తో దూసుకుపోవడానికి ప్రధాన కారణం పార్టీ కోసం రక్తం చిందించిన క్షేత్రస్థాయి కార్యకర్తలే. అందుకే ఈసారిస్థానిక సంస్థల ఎన్నికల్లో వారికి ప్రాధాన్యత ఇవ్వాలని పవన్ కల్యాణ్ గట్టిగా నిశ్చయించుకున్నారు. గత ఐదేళ్లుగా వైఎస్సార్‌సీపీ అరాచకాలను ఎదుర్కొని, పార్టీ జెండా మోసిన నిజమైన లాయల్ కార్యకర్తలపూర్తి సమాచారాన్ని, వారి అర్హతలను జనసేన అధిష్ఠానం ఇప్పటికే సేకరించింది. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చాక పైరవీలు చేసేవారికి కాకుండా, కష్టపడ్డవారికే టికెట్లు దక్కుతాయి అనే నమ్మకాన్ని పవన్‌కిందిస్థాయి క్యాడర్‌లో నింపారు. దీనివల్ల ఆశావహుల్లో గందరగోళం తగ్గి, పార్టీ కోసం మరింత ఉత్సాహంగా పనిచేసే వాతావరణం ఏర్పడింది.మరోవైపు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు స్థానిక సంస్థలఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఇటీవల కుప్పం, కర్నూలు తదితర ప్రాంతాల సమీక్షా సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. లోకల్ పోల్స్‌లో విజయం సాధించడం నాన్–నెగోషియబుల్‌అని తేల్చిచెప్పారు. స్థానిక ఎన్నికల్లో గెలిపించిన నేతలనే పార్టీ నెత్తిన పెట్టుకుంటుందని, ఓడిపోయిన వారిని ఎంతటి వారైనా పక్కన పెడుతుందని కఠినమైన హెచ్చరికలు జారీ చేశారు. ముఖ్యంగాతంబళ్లపల్లె వంటి నియోజకవర్గాల్లో పార్టీ ఇన్‌చార్జ్‌ల నియామకం, గ్రౌండ్ ఫీడ్‌బ్యాక్ ఆధారంగానే సీట్ల కేటాయింపు ఉంటుందని లోకేష్, బాబు స్పష్టం చేయడంతో తమ్ముళ్లలో మునుపెన్నడూ లేనిసీరియస్‌నెస్ కనిపిస్తోంది.సాధారణంగా స్థానిక ఎన్నికలు అనగానే అధికార పార్టీల్లో టికెట్ల కోసం అంతర్గత కుమ్ములాటలు, తిరుగుబాట్లు కామన్. పైగా ఇక్కడ టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి కూటమిగా పోటీచేస్తున్నాయి. ఒకే స్థానానికి ముగ్గురు అభ్యర్థులు పోటీ పడితే ఓట్లు చీలిపోయే ప్రమాదం ఉంది. ఈ ముప్పును ముందే పసిగట్టిన బాబు–పవన్ ద్వయం.. క్షేత్రస్థాయిలో ఎలాంటి గందరగోళానికి తావులేకుండా సీట్ల సర్దుబాటు ఫార్ములాను ముందే సిద్ధం చేస్తున్నారు. ఏయే గ్రామ పంచాయతీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో ఏ పార్టీ బలంగా ఉందో ఆ పార్టీకే ఆ సీటు కేటాయించేలా.. జిల్లా స్థాయి మంత్రులు,
ఇన్‌చార్జ్‌ల పర్యవేక్షణలో ముందస్తు స్క్రీనింగ్ కమిటీలు వేస్తున్నారు.సార్వత్రిక ఎన్నికల తరహాలోనే స్థానిక ఎన్నికల్లోనూ 2024 నాటి కూటమి పొత్తు సెంటిమెంట్‌ను అలాగే కొనసాగించాలని
అధినాయకత్వం భావిస్తోంది. పైస్థాయిలో నేతలు కలిసి ఉన్నా, కిందిస్థాయిలో గ్రామాల్లో టీడీపీ–జనసేన క్యాడర్ కలవడం చాలా ముఖ్యం. అందుకోసమే ఉమ్మడి సమన్వయ కమిటీల ద్వారా ఇరు పార్టీల
కార్యకర్తలను ఒకే తాటిపైకి తెస్తున్నారు. ఈ ముందస్తు సన్నాహాల వల్ల ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే సమయానికి కూటమి తరఫున అభ్యర్థులు దాదాపు ఖరారై ప్రచారంలో ఉంటారు. ఇది ప్రతిపక్ష
వైఎస్సార్‌సీపీని మానసికంగా మరింత డిఫెన్స్‌లోకి నెట్టేసే వ్యూహం.ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ వరుస పరాజయాలు, అంతర్గత వలసలతో డీలా పడి ఉంది. ఈ తరుణంలో నవంబర్ లోకల్ బాడీ ఎన్నికల్లో కూడాకూటమి క్లీన్ స్వీప్ చేస్తే.. విపక్షం పుంజుకునే అవకాశాలు పూర్తిగా మూసుకుపోతాయి. అందుకే చంద్రబాబు కమాండర్‌లా తానే ముందుండి నడిపిస్తానని భరోసా ఇస్తుండగా, పవన్ కల్యాణ్ పంచాయతీ రాజ్‌శాఖ మంత్రిగా గ్రామీణ ఓటర్లను ఆకట్టుకునేలా సరికొత్త అభివృద్ధి సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. అభ్యర్థుల ఎంపికలో పారదర్శకత, ముందస్తు ప్రణాళిక, క్యాడర్‌కు స్పష్టమైన గైడ్‌లైన్స్.. ఇవే నవంబర్ సమరంలో కూటమికి శ్రీరామరక్ష కానున్నాయి.

# రిటైర్ అయ్యాక మళ్లీ ఉద్యోగం...

**విజయవాడ, జూలై 16, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ ఆర్కైవ్స్ రిటైర్డ్ డైరెక్టర్ వి రంగరాజ్ ఉద్యోగానికి సంబంధించి ఆసక్తికర పరిణామం జరిగింది. వి రంగరాజ్ జూన్ 30న పదవీ విరమణ చేయగా.. ఆయన్ను మళ్లీ తిరిగి విధుల్లోకి తీసుకుంటూప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వి రంగరాజ్‌కు 60 ఏళ్లు నిండటంతో నిబంధనల ప్రకారం గత నెల 30న పదవీ విరమణ చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలు, కార్పొరేషన్లు, సొసైటీలరెగ్యులర్ ఉద్యోగుల (ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం–2014లోని షెడ్యూల్ 9, 10 పరిధిలోకి వస్తారు) పదవీ విరమణ వయసును 60 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు పెంచిన సంగతి తెలిసిందే. ఈఉత్తర్వులు 2022 జనవరి 1 నుంచి వర్తిస్తాయని తెలిపింది.ఏపీ ఆర్కైవ్స్ విభాగం కూడా ఈ పదో షెడ్యూల్ పరిధిలోకి వస్తుంది.. ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో కొత్త నిబంధనలు అమల్లోకివచ్చాయి. రంగరాజ్ ఈ నెల 2న ఈ నిబంధనల ప్రకారం తనకు 62 ఏళ్ల వరకు సర్వీసు పొడిగింపు వర్తిస్తుందని ప్రభుత్వానికి జాయినింగ్ రిపోర్టు సమర్పించారు. వెంటనే ప్రభుత్వం సానుకూలంగాస్పందించి ఆయన్ను తిరిగి విధుల్లోకి చేర్చుకుంటూ ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం మీద రంగరాజ్ మరో రెండేళ్ల పాటూ తన ఉద్యోగంలో కొనసాగనున్నారు. రంగరాజ్‌లాగే మరికొందరు కూడా తిరిగి వారిపోస్టుల్లో చేరనున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో 2022లో ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయసు 60 నుంచి 62కు పెంచారు. తమకు కూడా పదవీ విరమణ వయసును పెంచాలని ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు కోర్టుకు వెళ్లగా.. అక్కడ అనుకూలంగా ఆదేశాలు వచ్చాయి.రాష్ట్ర ప్రభుత్వం కూడా ఉద్యోగుల డిమాండ్‌పై అధ్యయనం చేసేందుకు మంత్రులు నారా లోకేష్, పయ్యావుల కేశవ్, నారాయణలతో ప్రభుత్వం కమిటీ వేసిన సంగతి తెలిసిందే.. ఈ కమిటీ పలుమార్లు సమావేశమై పదవీ విరమణ వయసు పెంపుపై చర్చించింది.ఈ మేరకు అన్ని అంశాలను పరిశీలించి పదవీ విరమణ వయసు పెంచడానికి కమిటీ ఆమోదం తెలిపింది. అనంతరం ఈ ఫైల్ ఏపీ కేబినెట్ ముందుకు వెళ్లగా.. చర్చించి ఆమోదించారు.. ఈ నెల మొదటి వారంలో ఏపీ ప్రభుత్వం ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంచుతూ నిర్ణయంతీసుకుంది. 2022 నుంచి వర్తించేలా నిర్ణయం తీసుకున్నారు. ఒకవేళ ఎవరైనా ఉద్యోగులు పదవీ విమరణ చేసి ఉంటే వారిని తిరిగి విధుల్లోకి తీసుకుని 62 ఏళ్ల వవరకు కొనసాగించాలని ఏపీ ప్రభుత్వం ఆదేశించి.. ఈ మేరకు రంగరాజ్ విధుల్లో చేరారు. ఏపీ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో 15 వేల మందికి పైగా ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనం కలుగుతుందని చెబుతున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# చట్టం కాదు... పిల్లల రక్షణలో తల్లిదండ్రులే కీలకం



**హైదరాబాద్ పెన్ పవర్:** పిల్లలను సోషల్ మీడియా వ్యసనం నుండి కాపాడేందుకు ప్రపంచ దేశాలు కఠినమైన చట్టాలు తెస్తున్నాయి. బ్రిటన్ రాత్రి వేళల్లో యాప్స్ లాక్ చేస్తుంటే, ఆస్ట్రేలియా ఏకంగా చిన్న పిల్లలకు సోషల్ మీడియాను నిషేధించింది. ఫ్రాన్స్, అమెరికాలోని కొన్ని రాష్ట్రాలు కూడా కఠిన నిబంధనలు అమలు చేస్తున్నాయి. కానీ, ప్రభుత్వాలు ఎంతగా ప్రయత్నించినా అవి మన బెడ్‌రూమ్‌ల్లోకి వచ్చి నిఘా పెట్టలేవు. చట్టాలు కేవలం ఒక రక్షణ కవచం మాత్రమే, కానీ అసలైన రక్షణ ఇంట్లోనే, తల్లిదండ్రుల నిఘాలోనే మొదలవ్వాలి. ఆ వివరాలు తెలుసుకుందాం..

**గ్లోబల్ ట్రెండ్.. సోషల్ మీడియాపై దేశాల పంజా:**
ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా పిల్లల మానసిక ఆరోగ్యం కోసం ప్రభుత్వాలు యుద్ధం ప్రకటిస్తున్నాయి. ఆస్ట్రేలియా ప్రభుత్వం 16 ఏళ్ల లోపు పిల్లలు సోషల్ మీడియా వాడకుండా చట్టం తెచ్చింది. ఫ్రాన్స్ స్కూళ్లలో ఫోన్లను పూర్తిగా బ్యాన్ చేస్తోంది. అమెరికాలో కూడా పిల్లల డేటా భద్రత కోసం కొత్త రూల్స్ తెస్తున్నారు. ఇవన్నీ వినడానికి బాగున్నా.. డిజిటల్ ప్రపంచంలో దొంగదారులు చాలా ఎక్కువ. ఇక విపిఎన్ వాడటం లేదా సెట్టింగ్స్ మార్చడం ద్వారా పిల్లలు ఈ చట్టాల కళ్లు గప్పుతున్నారు.

**బెడ్‌రూమ్‌కు చట్టాలు వర్తించవు:**
ప్రభుత్వాలు ఎంత కట్టుదిట్టం చేసినా, రాత్రి వేళల్లో బెడ్‌రూమ్ తలుపులు వేసుకుని పిల్లలు ఫోన్‌లో ఏం చూస్తున్నారో ఏ అధికారీ వచ్చి గమనించలేడు. బ్రిటన్ లాంటి దేశాలు అర్ధరాత్రి యాప్స్ లాక్ చేసినా, పిల్లలు సాంకేతికంగా తల్లిదండ్రుల కంటే స్మార్ట్ కాబట్టి వాటిని దాటేస్తున్నారు. ఇక్కడే చట్టాల పరిమితి స్పష్టమవుతోంది. ఇక చట్టం కేవలం దారి చూపగలదు కానీ, ఆ దారిలో పిల్లలు తప్పుటడుగులు వేయకుండా చూడాల్సింది కచ్చితంగా పేరెంట్స్ మాత్రమే.

**ముందుగా మారాల్సింది తల్లిదండ్రులే:**
పిల్లలకు నీతులు చెప్పే ముందు తల్లిదండ్రులు తమ అలవాట్లను మార్చుకోవాలి. ఆఫీస్ నుండి రాగానే ఫోన్ పట్టుకుని కూర్చునే తల్లిదండ్రులను చూసే పిల్లలు కూడా మొబైల్స్‌కు బానిసలవుతున్నారు. ఇంట్లో "నో ఫోన్ జోన్" లేదా రాత్రి ఒక నిర్దిష్ట సమయం దాటాక అందరూ ఫోన్లు పక్కన పెట్టే రూల్ పెట్టుకోవాలి. ఇక మనం డిజిటల్ డిసిప్లిన్ పాటిస్తే, పిల్లలు దాన్ని చూసి చాలా సులభంగా నేర్చుకుంటారు.

**డిజిటల్ పేరెంటింగ్.. నేటి తరం అవసరం:**
ఆధునిక కాలంలో పిల్లలకు కేవలం మంచి ఆహారం, చదువు ఇస్తే సరిపోదు.. 'డిజిటల్ పేరెంటింగ్' కూడా తెలియాలి. ఫోన్లలో పేరంటల్ కంట్రోల్స్ ఆన్ చేయడం, వారు ఇంటర్నెట్‌లో ఏం సెర్చ్ చేస్తున్నారో గమనించడం ముఖ్యం. అంతకంటే ముఖ్యంగా, వారితో ప్రతిరోజూ మాట్లాడాలి. ఇక సోషల్ మీడియా ప్రపంచం కంటే నిజమైన ప్రపంచం ఎంత బాగుంటుందో వారికి శారీరక ఆటలు, పుస్తకాల ద్వారా పరిచయం చేయాలి.

**బాధ్యత మనదే:**
ప్రభుత్వాలు రూల్స్ మారుస్తూ చట్టాలు చేయవచ్చు, టెక్నాలజీ కంపెనీలు కొత్త ఫీచర్లు తేవచ్చు. కానీ పసి మొగ్గల్లాంటి పిల్లల భవిష్యత్తును కాపాడుకునే అంతిమ బాధ్యత తల్లిదండ్రులదే. ఇక చట్టాలపై ఆధారపడటం మానేసి, ఇంట్లోనే ఆరోగ్యకరమైన డిజిటల్ వాతావరణాన్ని నిర్మించినప్పుడే మన పిల్లలను ఈ వర్చువల్ మాయా ప్రపంచం నుండి సురక్షితంగా బయటపడేయగలం.

# వీకెండ్ సరదా.. అమెరికాలో తెలుగు యువకుడి ప్రాణం తీసింది..

**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికాలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలనే బలమైన ఆకాంక్షతో వెళ్లిన ఓ తెలుగు యువకుడి ప్రయాణం అర్ధాంతరంగా ముగిసిపోయింది. వీకెండ్ సరదా కోసం వెళ్లిన ఆ యువకుడిని స్కైడైవింగ్ రూపంలో మృత్యువు కబళించింది. జీవితంలో స్థిరపడి, ఉన్నత ఆశయాలతో దూసుకుపోతున్న తరుణంలో జరిగిన ఈ విషాదం తెలుగు రాష్ట్రాల్లోని అతని కుటుంబ సభ్యులతో పాటు అమెరికాలోని ప్రవాస భారతీయులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. అమెరికాలో ఉన్నత చదువులు పూర్తి చేసి.. మంచి ఉద్యోగం సంపాదించి జీవితంలో సరికొత్త అధ్యాయాన్ని ప్రారంభించిన తెలుగు యువకుడు గడ్డం మణిచంద్ర తేజ (28) జీవితం ఒక్క క్షణంలో ముగిసిపోయింది. ఆకాశంలో విహరిస్తూ అడ్వెంచర్ చేయాలనే చిన్న కోరిక.. చివరికి అతని జీవితాన్నే బలితీసుకుంది. ఈ ఘోర ప్రమాదం అమెరికాలోని ఎన్నారైలను, తెలుగు రాష్ట్రాల్లోని వారి బంధువులను తీవ్ర విషాదంలోకి నెట్టింది.

**అసలేం జరిగింది?**
మసాచుసెట్స్ రాష్ట్రంలోని ఆరెంజ్ పట్టణంలో ఉన్న ఒక ప్రముఖ స్కైడైవింగ్ కేంద్రానికి వీకెండ్‌లో మణిచంద్ర వెళ్లాడు. అక్కడ అవసరమైన ప్రాథమిక శిక్షణ తీసుకున్న అనంతరం విమానం నుంచి విజయవంతంగా స్కైడైవింగ్ చేశాడు. అంతా బాగానే సాగుతోందనుకున్న తరుణంలో.. భూమిపైకి ల్యాండ్ అయ్యే చివరి క్షణాల్లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. తీవ్రమైన వేగంతో వీచిన బలమైన గాలుల కారణంగా అతని పారాచూట్ నియంత్రణ కోల్పోయింది. దీంతో దాదాపు 30 అడుగుల ఎత్తు నుంచి మణిచంద్ర నేరుగా భూమిపైకి వేగంగా పడిపోయాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించినప్పటికీ ఫలితం లేకపోయింది. చికిత్స పొందుతూ మణిచంద్ర కన్నుమూశాడు.

**విజయవాడ నుంచి బోస్టన్ వరకు..**
మణిచంద్ర తేజ కుటుంబం అసలు స్వస్థలం విజయవాడ కాగా ఆ తర్వాత వారు హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. చిన్నప్పటి నుంచి చదువులో ప్రతిభ కనబరిచిన మణిచంద్ర.. ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లాడు. బోస్టన్‌లోని ప్రసిద్ధ నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ నుంచి మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశాడు. ఇటీవలే ఒక ప్రముఖ గ్లోబల్ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం సాధించి, కెరీర్‌లో నిలదొక్కుకున్నాడు. త్వరలోనే తల్లిదండ్రులకు అండగా నిలవాల్సిన ఏకైక కొడుకు ఇలా అకాల మరణం చెందడం ఆ కుటుంబాన్ని కోలుకోలేని దెబ్బ తీసింది.

**అడ్వెంచర్ స్పోర్ట్స్‌లో భద్రత ఎంతవరకు?**
ఈ దారుణ ఘటన అడ్వెంచర్ స్పోర్ట్స్‌లో భద్రతా ప్రమాణాలపై మరోసారి చర్చకు దారితీసింది. స్కైడైవింగ్, పారాగ్లైడింగ్ వంటి అత్యంత ప్రమాదకరమైన క్రీడల్లో శిక్షణ, పరికరాల నాణ్యత ఎంత ముఖ్యమో.. వాతావరణ పరిస్థితులు కూడా అంతే కీలక పాత్ర పోషిస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గాలి వేగంలో వచ్చే చిన్న మార్పు కూడా ప్రాణాంతకంగా మారుతుందని ఈ ఘటన నిరూపించింది. ప్రస్తుతం ఈ ప్రమాదానికి అసలు కారణాలపై అమెరికా విమానయాన, స్థానిక రక్షక దళ అధికారులు విచారణ ప్రారంభించారు. ఇది కేవలం ప్రకృతి వైపరీత్యమా లేక పారాచూట్ ఓపెన్ కావడంలో లేదా నియంత్రించడంలో ఏదైనా సాంకేతిక లోపం ఉందా? అనే కోణంలో దర్యాప్తు సాగుతోంది. నివేదిక వస్తేనే పూర్తి వివరాలు వెల్లడవుతాయి. కళ్లముందే ఎదిగి, విదేశాల్లో స్థిరపడిన కొడుకు విగతజీవిగా మారాడనే వార్త వినాల్సి రావడంతో హైదరాబాద్‌లోని మణిచంద్ర తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. ఉన్నత కలలతో విదేశాలకు వెళ్తున్న యువత.. ఇలాంటి అడ్వెంచర్ల జోలికి వెళ్లేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రవాస సంఘాలు సూచిస్తున్నాయి. మణిచంద్ర పార్థివ దేహాన్ని త్వరగా భారత్‌కు తరలించేందుకు తానా సహా స్థానిక తెలుగు సంఘాలు ప్రయత్నాలు ప్రారంభించాయి.

# అమెరికా నుంచి కొత్త సవాల్.. భారత్ ఎలా ఎదుర్కొంటుంది?




అమెరికా నుంచి కొత్త సవాల్.. భారత్ ఎలా ఎదుర్కొంటుంది?
భారత్‌తో పాటు చైనా, స్లోవేకియా, హంగేరీ, అజర్‌బైజాన్ వంటి దేశాల నుంచి అమెరికాకు జరిగే ఎగుమతులపై గరిష్టంగా 100 శాతం వరకు టారిఫ్‌లు విధించే ప్రమాదం పొంచి ఉంది. రష్యా నుంచి ముడి చమురు దిగుమతి చేసుకుంటున్న దేశాలపై అమెరికా మరోసారి తన పంతాన్ని ప్రదర్శిస్తోంది. ఉక్రెయిన్ యుద్ధానికి రష్యా వాడుతున్న ఆర్థిక వనరులను దెబ్బతీయడమే లక్ష్యంగా అమెరికా కాంగ్రెస్‌లో సరికొత్త ఆంక్షల బిల్లు తెరపైకి వచ్చింది. ఒకవేళ ఈ బిల్లు చట్టంగా మారితే.. రష్యా నుంచి భారీగా చమురు కొనుగోలు చేస్తున్న భారత్‌కు ఇది పెద్ద ఎదురుదెబ్బ కానుంది. భారత్‌తో పాటు చైనా, స్లోవేకియా, హంగేరీ, అజర్‌బైజాన్ వంటి దేశాల నుంచి అమెరికాకు జరిగే ఎగుమతులపై గరిష్టంగా 100 శాతం వరకు టారిఫ్‌లు విధించే ప్రమాదం పొంచి ఉంది.

**ఏమిటీ కొత్త బిల్లు అమెరికా ప్లాన్ ఏంటి**
వాషింగ్టన్‌లో జరిగిన ఒక మీడియా సమావేశంలో అమెరికా సెనేటర్ రిచర్డ్ బ్లూమెంతల్ ఈ బిల్లుకు సంబంధించిన కీలక వివరాలను వెల్లడించారు. రష్యా చమురును కొనుగోలు చేయడం ద్వారా మాస్కోకు భారీగా నిధులు అందుతున్నాయని.. అవే నిధులతో ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని కొనసాగిస్తోందని ఆయన ఆరోపించారు. అందుకే రష్యాతో వాణిజ్య సంబంధాలు పెట్టుకునే దేశాలపై కూడా ఒత్తిడి పెంచాలని అమెరికా భావిస్తోంది. ఈ బిల్లు రూపకల్పనలో సీనియర్ సెనేటర్ లిండ్సే గ్రాహం కీలక పాత్ర పోషించారు.
అయితే ఇందులో కొన్ని మినహాయింపులు కూడా ఉన్నాయి.. రష్యా నుంచి గ్యాస్ దిగుమతులను 15 శాతం కంటే తక్కువకు పరిమితం చేసి.. వాటిని క్రమంగా తగ్గించే దేశాలకు కొంత వెసులుబాటు ఉంటుంది. కానీ రష్యా నుంచి అత్యధికంగా చమురు దిగుమతి చేసుకుంటున్న భారత్ వంటి దేశాలపై ఈ నిబంధనలు తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు.

**గతంలో 500%.. ఇప్పుడు 100% టారిఫ్!**
గత ఏడాది అమెరికా "సాంక్షనింగ్ రష్యా యాక్ట్" పేరుతో తీసుకొచ్చిన బిల్లులో ఏకంగా 500 శాతం టారిఫ్‌లు విధించాలని ప్రతిపాదించారు. అయితే ఆ ప్రతిపాదన అత్యంత కఠినంగా ఉండటం.. రాజకీయ మద్దతు లభించకపోవడంతో అది వీగిపోయింది. ఇప్పుడు అదే బిల్లును సవరించి, గరిష్ట టారిఫ్‌ను 100 శాతానికి పరిమితం చేస్తూ సరికొత్తగా ప్రవేశపెట్టారు. ఈసారి దీనికి వైట్ హౌస్ మద్దతు కూడా ఉండటంతో రాబోయే ఆగస్టు నెలకు ముందే ఈ బిల్లు ఆమోదం పొందే అవకాశాలు ఉన్నాయని సెనేటర్లు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ చట్టం అమల్లోకి వస్తే ఏ దేశంపై ఎంత శాతం టారిఫ్ విధించాలనేది అమెరికా ట్రేడ్ రిప్రజెంటేటివ్ కార్యాలయం నిర్ణయిస్తుంది. రష్యా నుంచి చమురు కొనకుండా నిరుత్సాహపరిచేలా ఈ టారిఫ్‌లు ఉంటాయని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

**భారత్‌కు ఎదురయ్యే సవాళ్లు ఏంటి?**
ఈ బిల్లు గనుక చట్టరూపం దాలిస్తే భారత్-అమెరికా దౌత్య, వాణిజ్య సంబంధాలపై తీవ్ర ప్రభావం పడుతుంది. అమెరికాకు వివిధ వస్తువులను ఎగుమతి చేసే భారతీయ పరిశ్రమలపై అదనపు పన్నుల భారం పడుతుంది. 100% టారిఫ్ పడితే అమెరికా మార్కెట్లో భారతీయ ఉత్పత్తుల ధరలు పెరిగి, పోటీతత్వాన్ని కోల్పోతాయి. రష్యా నుంచి తక్కువ ధరకు వచ్చే చమురును ఆపేస్తే, దేశీయంగా ఇంధన ధరలు పెరిగే ప్రమాదం ఉంది. రష్యాతో ఉన్న ఇంధన అవసరాలను కాపాడుకుంటూనే మరోవైపు అతిపెద్ద వాణిజ్య భాగస్వామి అయిన అమెరికాతో సంబంధాలు దెబ్బతినకుండా చూసుకోవడం ఇప్పుడు భారత్‌కు ఒక సవాల్. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో భారత ప్రభుత్వం తన దౌత్య నైపుణ్యం, వ్యూహాత్మక చర్చల ద్వారా ఈ 'అమెరికా పిడుగు'ను ఎలా ఎదుర్కొంటుందో వేచి చూడాలి.

# టాటా దూకుడు ఆగట్లేదు.. వరుసగా పదోసారి దేశంలోనే నంబర్-1 బ్రాండ్..

**హైదరాబాద్ పెన్ పవర్:** ఈ రోజుల్లో బ్రాండ్ అంటే ఏంటి బాసూ? నాలుగు యూట్యూబ్ యాడ్స్ వేసి.. ఇన్‌స్టాగ్రామ్‌లో ఇద్దరు ఇన్‌ఫ్లుయెన్సర్లతో రీల్స్ చేయిస్తే సరిపోతుందనుకుంటున్నారా? అయితే మీరు పప్పులో కాలేసినట్టే! ఎందుకంటే బ్రాండ్ బిల్డింగ్‌లో "బాస్" ఎవరు అనేది టాటా గ్రూప్ మరోసారి నిరూపించింది. ఏదో ఒకసారి రెండుసార్లు కాదు.. ఏకంగా వరుసగా పదోసారి దేశంలోనే మోస్ట్ వాల్యూబుల్ బ్రాండ్‌గా నిలిచి రికార్డుల దుమ్ము దులిపేసింది.
ప్రముఖ బ్రాండ్ ఫైనాన్స్ సంస్థ లెక్కల ప్రకారం.. ప్రస్తుతం టాటా బ్రాండ్ విలువ అక్షరాలా రూ. 3.24 లక్షల కోట్లు (39 బిలియన్ డాలర్లు). ఈ నంబర్ చూస్తుంటేనే మిగతా కంపెనీలకు చెమటలు పడుతున్నాయి..

**ఉప్పు నుండి ఐటీ దాకా.. అంతా టాటా మాయ**
మార్కెట్లోకి రోజుకో కొత్త కంపెనీ వస్తూ ఉంటుంది.. "మేము విప్లవాత్మక మార్పులు తెస్తున్నాం" అంటూ భారీగా ప్రచారాలు చేసుకుంటుంది. కానీ, చివరికి జనాలు నమ్మేది మాత్రం టాటానే. ఉదయం లేచిన దగ్గర నుండి.. వంటలో వేసే ఉప్పు దగ్గర నుంచి.. ఆఫీసులో వాడే ఐటీ సర్వీసెస్ టీసీఎస్ దాకా.. రోడ్డు మీద వెళ్లే కార్ల నుంచి.. ఎక్కే విమానం, తాగే టీ.. చివరికి మన ఒంటి మీద వేసుకునే బట్టల షోరూంలు ట్రెంట్, జూడియో వరకు అంతా టాటా మయం. "మా దగ్గర లేనిదంటూ ఏదీ లేదు.. మేము లేని ఇల్లు దేశంలోనే లేదు" అన్నట్టుగా ప్రతి రంగంలోనూ దూసుకుపోతోంది. ప్రత్యర్థులు ఎంతగా తలకిందులు తపస్సు చేసినా ఈ "ట్రస్ట్" అనే ఫార్ములాను మాత్రం కాపీ కొట్టలేకపోతున్నారు.

**టాప్-5లో ఎవరెవరున్నారంటే..**
ఈ జాబితా చూస్తే టాటా రేంజ్ ఏంటో క్లియర్ కట్ గా అర్థమైపోతుంది. టాటా తర్వాత కూడా భారత కార్పొరేట్ దిగ్గజాలే ఈ జాబితాలో చోటు దక్కించుకున్నాయి.
1వ స్థానం: టాటా గ్రూప్ -- రూ. 3.24 లక్షల కోట్లు




2వ స్థానం: ఇన్ఫోసిస్ -- రూ. 1.58 లక్షల కోట్లు
**3వ స్థానం: ఎల్ఐసీ -- రూ. 1.47 లక్షల కోట్లు**
4వ స్థానం: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్
**5వ స్థానం: రిలయన్స్ ఇండస్ట్రీస్**
మిగతా సంస్థలు రన్నరప్ ట్రోఫీ కోసం కొట్టుకుంటుంటే.. టాటా మాత్రం సింపుల్‌గా ఫస్ట్ ప్లేస్ సీట్లో టవల్ వేసి కూర్చుంది. ఆ వాల్యూ డిఫరెన్స్ చూస్తేనే అర్థమవుతుంది కదా, అసలైన "బాస్" ఎవరో.. ఈ జాబితాను పరిశీలిస్తే ఐటీ, బ్యాంకింగ్, బీమా, పారిశ్రామిక రంగాలే భారత ఆర్థిక వ్యవస్థకు ప్రధాన బలంగా నిలుస్తున్నాయని స్పష్టమవుతోంది.

**గ్లోబల్ మార్కెట్‌కు గట్టి షాక్**
ప్రపంచ వ్యాప్తంగా యుద్ధాలు జరుగుతున్నాయి. ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలుతున్నాయి, ఐటీ ఇండస్ట్రీలో లే-ఆఫ్‌ల భయం పట్టుకుంది. కానీ మన ఇండియన్ బ్రాండ్ల జోరు చూస్తే మాత్రం వీటికి ఏమీ తెలియనట్టే ప్రవర్తిస్తున్నాయి. దేశంలోని టాప్-100 బ్రాండ్ల మొత్తం విలువ ఎంతో తెలుసా? సుమారు రూ. 24.34 లక్షల కోట్లు! గ్లోబల్ మార్కెట్లకు ఏమైనా కావచ్చు.. కానీ ఇండియన్ కస్టమర్ల జేబులు, మన కంపెనీల బ్రాండ్ వాల్యూలు మాత్రం ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూనే ఉన్నాయి.

**'టాటా' అంటే కంపెనీ కాదు బాస్.. ఒక ఎమోషన్!**
మన దేశంలో ఏదైనా కొత్త కంపెనీ రాగానే "మేము దేశాన్ని మార్చేస్తాం" అని ఓవరాక్షన్ చేయడం కామన్. కానీ, ఆర్భాటాలు లేకుండా సైలెంట్‌గా దేశాన్ని శాసిస్తూ.. పదేళ్లుగా నంబర్-1 స్థానాన్ని తన సొంత జాగీరులా మార్చేసుకుంది టాటా. సో ఇకనైనా ఒప్పుకోండి.. టాటా అంటే కంపెనీ అనుకుంటివా.. ఇట్ ఈజ్ ఎ 'బ్రాండ్'!

# ముద్రగడ పాడె మోసిన జగన్.. తీవ్ర భావోద్వేగం




**హైదరాబాద్ పెన్ పవర్:** కాపు ఉద్యమనేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం అంత్యక్రియలు పూర్తయ్యాయి. కాకినాడ జిల్లా కిర్లంపూడిలో ముద్రగడ ఇంటి ఆవరణలోనే ఆయన అంతిమ సంస్కారాలను నిర్వహించారు. హిందూ సంప్రదాయం మధ్య జరిగిన ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధువులు, వైసీపీ నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డి భీమవరం పర్యటన ముగించుకుని మధ్యాహ్నం 3 గంటల సమయానికి కిర్లంపూడి చేరుకున్న తర్వాత ముద్రగడ అంతిమ సంస్కారాలు మొదలుపెట్టారు. ముద్రగడ పాడెను మోసిన మాజీ సీఎం జగన్ పార్టీ నేతకు ఘనంగా వీడ్కోలు పలికారు. ముద్రగడ అంత్యక్రియలలో వైసీపీ నేతలు వందల సంఖ్యలో పాల్గొన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ స్వయంగా ముద్రగడ పాడె మోసి ఆయనపై అభిమానం, గౌరవం చాటుకున్నారు. జగన్ తోపాటు వైసీపీకి చెందిన పలువురు కీలక నాయకులు ముద్రగడ పాడె మోసేందుకు భుజం కలిపారు. దివంగత నేతను కడసారి చూసేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వైసీపీ నేతలు తరలివచ్చారు. అభిమాన నేతకు కన్నీటితో వీడ్కోలు పలికారు.

షెడ్యూల్ ప్రకారం భీమవరంలో పర్యటన ముగించుకున్న అనంతరం మాజీ ముఖ్యమంత్రి కిర్లంపూడి చేరుకున్నారు. ముందుగా భీమవరం నుంచి జగ్గంపేట వరకు హెలికాప్టర్ లో వచ్చిన జగన్ అక్కడి నుంచి కారులో కిర్లంపూడి వెళ్లారు. ముద్రగడ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం కొద్దిసేపు కుటుంబ సభ్యులతో మాట్లాడి సానుభూతి వ్యక్తం చేశారు. ముద్రగడ కుటుంబ్టికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ముద్రగడ ఇంటి ఆవరణలో అంత్యక్రియలు చేయగా, సంప్రదాయం ప్రకారం కార్యక్రమం పూర్తయ్యే వరకు మాజీ ముఖ్యమంత్రి జగన్ అక్కడే ఉన్నారు.
ముద్రగడ అంత్యక్రియల్లో పాల్గొనడమే కాకుండా ఆయన పాడె మోయడం ద్వారా జగన్ తన అభిమానాన్ని చాటుకున్నారని అంటున్నారు. గతంలో ఎప్పుడు కూడా మాజీ సీఎం జగన్ ఈ తరహా కార్యక్రమాల్లో పాల్గొన్న దాఖలాలు లేవని వైసీపీ నేతలు చెబుతున్నారు. పార్టీలో ముద్రగడకు ఎంతటి ప్రాధాన్యం ఉందో ఈ ఘటన ద్వారా అర్థమవుతోందని అంటున్నారు. కిర్లంపూడిలో ముద్రగడ ఇంటికి వెళ్లడమే కాకుండా, పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రత్యేక సంతాప సభ ఏర్పాటు చేయడం ద్వారా సీనియర్ నేతకు ఘన నివాళులర్పించారని వ్యాఖ్యానిస్తున్నారు.

## సంపాదకీయం

# కొత్త తరం! కొత్త స్వరం!!

భారత రాజకీయ వ్యవస్థ దశాబ్దాలుగా యువతను భవిష్యత్ కాలంలోనే సంబోధిస్తూ వస్తోంది. యువకులు రేపటి నాయకులు.. ఇదీ నేతల నోట తరచూ వినిపించే మాట. కానీ ఈ ఆశావహ పదజాలం వెనుక దాగిన వాస్తవం వేరు. అధికారం మాత్రం వయోధిక నాయకత్వం చేతుల్లోనే కేంద్రీకృతమై ఉంది. యువతకు నిజమైన ప్రభావం అప్పగించే సాహసం అరుదు. ఆ రాజకీయ కల్పన ఇప్పుడు వేగంగా కరిగిపోతోంది. దేశ యువత ఇకపై 'నిరీక్షణలో ఉన్న పౌరులు' కాదు. వారు ఇప్పటికే ఎన్నికలను ప్రభావితం చేస్తున్నారు. రాజకీయ చర్చను మలుపు తిప్పుతున్నారు. పార్టీలను పునరాలోచనలో పడేస్తున్నారు. అసలు రాజకీయాలు నడిచే తీరునే కొత్తగా నిర్వచిస్తున్నారు. భారత యువత తనదైన భాష, అంచనాలు, పద్ధతులు, ప్రభావ కేంద్రాలతో స్వతంత్ర రాజకీయ శక్తిగా ఆవిర్భవిస్తోంది. ఈ పరివర్తన అత్యంత స్పష్టంగా కనిపిస్తున్నది.. రాజకీయ సమాచార రంగంలోనే. స్వాతంత్ర్యానంతర దశాబ్దాల్లో భారత రాజకీయం అధికార శ్రేణి, దూరం అనే రెండు స్తంభాలపై నడిచింది. నేతలు ఎత్తైన వేదికలపై నుంచి ప్రసంగించేవారు. ప్రజలు కింద కూర్చుని వినేవారు. సమాచారం పార్టీ నిర్మాణాలు, పత్రికలు, టీవీల ద్వారా ప్రవహించేది. ఆడంబరం, సంస్థాగత నియంత్రణ, సైద్ధాంతిక నిశ్చయతలపై ఆధారపడిన ఆ నమూనా ఇప్పుడు బలహీనపడుతోంది. నేటి యువత షార్ట్ వీడియోలు, మీమ్స్, పాడ్‌కాస్ట్‌లు, లైవ్ స్ట్రీమ్‌లు, వికేంద్రీకృత డిజిటల్ సమూహాలతో రూపుదిద్దుకున్న పూర్తి భిన్న ప్రపంచంలో జీవిస్తోంది. దృష్టి నిలిపే వ్యవధి తగ్గినా రాజకీయ చైతన్యం తగ్గలేదు. యువ ఓటర్లు రాజకీయ వ్యతిరేకులు కారు, నటనకు వ్యతిరేకులు. స్క్రిప్టెడ్ ఉపన్యాసాలకంటే అందుబాటుతనం, నిజాయితీ, స్పందనశీలత, హాస్యం, పారదర్శకతలకే స్పందిస్తారు. ఈ మార్పునకు తమిళనాడు స్పష్టమైన ఉదాహరణ. నటుడినుంచి నేతగా ఎదిగిన విజయ్ ప్రస్థానాన్ని కేవలం సినీ గ్లామర్‌తో వివరించలేం. మారిన సమాచార వ్యవస్థను సహజంగా అర్థం చేసుకోవడమే ఆయన రాజకీయ ప్రాధాన్యానికి మూలం. ఒకప్పుడు పనికిమాలిన ఇంటర్నెట్ సంస్కృతిగా కొట్టిపారేసిన మీమ్ వ్యాఖ్యానాలు, వ్యంగ్య వేదికలు నేడు అభిప్రాయ నిర్మాణానికి సమాంతర క్షేత్రాలుగా పనిచేస్తున్నాయి.

యువ రాజకీయం ఇకపై పార్టీల యువజన విభాగాలకో, క్యాంపస్ ఎన్నికలకో పరిమితం కాలేదన్నది రెండో కీలక పరిణామం. 2017నాటి జల్లికట్టు అనుకూల ఉద్యమం ఈ విషయంలో చారిత్రక మలుపు. కేంద్రీకృత నాయకత్వం లేకుండానే డిజిటల్ అనుసంధానం గల యువత భారీ ప్రజా సమీకరణను నిలబెట్టగలదని ఆ ఉద్యమం నిరూపించింది. అందుకే -పార్టీలు ఇప్పుడు ఆన్‌లైన్ సెంటిమెంట్‌ను నిరంతరం గమనిస్తూ, డిజిటల్ స్పందనలకు అనుగుణంగా ప్రచార సందేశాలను సవరించుకుంటున్నాయి. 'ఆన్‌లైన్ రాజకీయం', 'వాస్తవ రాజకీయం' మధ్య విభజన రేఖ చెరిగిపోతోంది. ఈ ధోరణి దక్షిణాసియా అంతటా కనిపిస్తోంది. 2022 నాటి శ్రీలంక 'అరగలయ' ఉద్యమం.. అవినీతి, వారసత్వ రాజకీయాలపై ప్రజాగ్రహాన్ని డిజిటల్ యువత నిరంతర రాజకీయ ఒత్తిడిగా ఎలా మార్చగలదో చూపింది. నేపాల్‌లోనూ పాలనా వైఫల్యాలు, నిరుద్యోగంపై యువ ఉద్యమాలు పెరుగుతున్నాయి. భారత్ అటువంటి భారీ సంక్షోభాలకు దూరంగా ఉన్నా.. ఇక్కడ నిశ్శబ్ద పరివర్తన సాగుతోంది. వీధి ఉద్యమాలుగా కాకున్నా.. రాజకీయ సమాచారం, భాగస్వామ్యం, ఓటరు ప్రవర్తనల్లో మారుతున్న ధోరణుల రూపంలో వ్యక్తమవుతోంది. ఇక్కడే మరో కీలక ప్రశ్నకూ సమాధానముంది. యువ సమీకరణ అంటే వ్యవస్థ వ్యతిరేకత అని భావించడం పొరపాటు. ప్రజాస్వామ్య సంస్థలు విశ్వసనీయంగా ఉండి, ఎన్నికల భాగస్వామ్యం అర్థవంతంగా అనిపించినప్పుడు.. యువత వ్యవస్థను తిరస్కరించకుండా అందులోనే పనిచేసేందుకు సిద్ధంగా ఉంటుందని తమిళనాట పరిణామాలు సూచిస్తున్నాయి. అసలు సమస్య యువతలో నిరాసక్తత కాదు.. సంస్థలపై అపనమ్మకం. 'యువ భాగస్వామ్యం' పేరిట జరుగుతున్నదంతా నిజమైన అధికార పంపిణీ లేని నియంత్రిత భాగస్వామ్యమేనని యువ పౌరులు గుర్తిస్తున్నారు. యువతను రాజకీయాల్లోకి తీసుకురావాలని పార్టీలు మాట్లాడతాయిగానీ.. అధికార పునఃపంపిణీ, నాయకత్వ మార్గాల ఏర్పాటు, అభ్యర్థుల ఎంపికలో వికేంద్రీకరణ, విధాన నిర్ణయాల్లో యువ గళాలకు చోటువంటి తార్కిక పర్యవసానాలను అంగీకరించవు. వేదికపై యువ ముఖాలు, తెరవెనుక పాత పెత్తనం.. ఈ ద్వంద్వ నీతిని ఇట్టే పసిగడుతోంది. ఈ నేపథ్యంలో పార్టీల ముందున్న సవాలు స్పష్టం.. మారాలి, లేదంటే మారిపోవాలి.

నిజాయితీ, భాగస్వామ్యం, పారదర్శకత, స్పందనశీలత, వికేంద్రీకృత ప్రభావంతో రూపొందుతున్న కొత్త ప్రజాస్వామ్య సంస్కృతికి అనుగుణంగా పాతుకుపోయిన రాజకీయ నిర్మాణాలు అధికారాన్ని పంచుకోవడానికి సిద్ధమేనా? ఇది సైద్ధాంతిక ప్రశ్న కాదు.. మనుగడ ప్రశ్న. దేశ జనాభాలో సగానికి పైగా 30 ఏళ్లలోపు వారేనన్న వాస్తవం దృష్ట్యా.. ఈ తరం విశ్వాసం చూరగొనలేని పార్టీ భవిష్యత్తులో నిలదొక్కుకోవడం అసాధ్యం. మన చట్టసభల్లో యువ ప్రజాప్రతినిధుల సంఖ్య జనాభా నిష్పత్తికి అనుగుణంగా లేకపోవడం ఈ అంతరానికి నిదర్శనం. యువ దేశానికి వయోధిక నాయకత్వమన్న వైరుధ్యం ఎంతకాలం కొనసాగుతుందన్నది ఆలోచనీయం. అదే సమయంలో యువతకూ బాధ్యత ఉంది. మీమ్‌లు, ఆన్‌లైన్ చర్చలు రాజకీయ చైతన్యానికి కొత్త వాహికలైనప్పటికీ.. తప్పుడు సమాచారం, ఉపరితల విశ్లేషణల ఉచ్చులో పడకుండా విమర్శనాత్మక ఆలోచన అలవర్చుకోవాలి. డిజిటల్ ఆగ్రహం ఓటుగా, ఓటు నిర్మాణాత్మక భాగస్వామ్యంగా పరిణమించినప్పుడే ఈ శక్తికి సార్థకత. వీధి ఉద్యమం, పోలింగ్ బూత్ ఇకపై వేర్వేరు ప్రజాస్వామ్య క్షేత్రాలు కావు.. అవి పరస్పరం అనుసంధానమవుతున్నాయి. ఈ పరివర్తన పట్టని పార్టీల ఉనికి మాయమే. కాలం మారింది.. తరం మారింది.. వేదిక మారింది.. భాష మారింది. వినే ఓపిక, పంచుకునే హృదయం, మారే సంసిద్ధత ఉన్న నాయకత్వమే రేపటి రాజకీయ చిత్రపటంలో నిలుస్తుంది. యువ భారతం తలుపు తట్టడం లేదు.. తెరుచుకుని లోపలికి వచ్చేస్తోంది. దాన్ని ఆహ్వానించడమా, అడ్డుకుని చరిత్ర పుటల్లో మిగిలిపోవడమా అన్నది రాజకీయ పార్టీల ఎంపిక. ప్రశ్నించే యువత ఉన్న దేశంలోనే ప్రజాస్వామ్యం సజీవంగా ఉంటుంది. ఆ ప్రశ్నలకు జవాబిచ్చే వినయం, వాటిని విధానాలుగా మలిచే విజ్ఞత పాలకవర్గం అలవర్చుకుంటే.. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యం, అత్యంత యువ ప్రజాస్వామ్యంగానూ వికసిస్తుంది!

## పనికొచ్చే పలుకు



# పుస్తకమే.. పదునైన నేస్తం!

"నేను తిన్న ఆహారాన్ని ఎలా గుర్తుంచుకోలేనో, అలాగే చదివిన పుస్తకాలను కూడా పూర్తిగా గుర్తుంచుకోలేను. కానీ, అవన్నీ కలిసి నన్ను ఈ స్థాయికి చేర్చాయి" అంటారు ప్రముఖ అమెరికన్ తత్వవేత్త, వ్యాసకర్త రాల్ఫ్ వాల్డో ఎమర్సన్. ఎంత లోతైన మాట ఇది! నిన్న మధ్యాహ్నం ఏం తిన్నామో మనలో చాలామందికి గుర్తుండదు. మొన్న తిన్న భోజనం సంగతి అసలే గుర్తురాదు. కానీ ఆ ఆహారమే మన శరీరానికి శక్తినిచ్చింది.. రక్తంగా మారింది.. ఎముకలను బలపరిచింది.. మనల్ని నిలబెట్టింది. ఆహారం కనిపించకుండా శరీరాన్ని నిర్మించినట్టే.. పుస్తకాలు కనిపించకుండా మన వ్యక్తిత్వాన్ని నిర్మిస్తాయి. చదివిన ప్రతి పేజీ గుర్తుండకపోవచ్చు.. కానీ ఆ పేజీలు మనలో నాటిన ఆలోచనలు, పెంచిన అవగాహన, మార్చిన దృక్పథం మాత్రం మనతోనే ఉండిపోతాయి. అదే పుస్తక పఠనం చేసే నిశ్శబ్ద మహిమ.

మనిషి జీవన విధానాన్ని గమనిస్తే.. ప్రతిరోజూ శరీరానికి మూడు పూటలా ఆహారం అందిస్తాం. కానీ మనసుకు, మెదడుకు ఆహారం అందించే విషయంలో మాత్రం నిర్లక్ష్యం చేస్తాం. శరీరం ఆకలేస్తే కడుపు గుర్తుచేస్తుంది.. మనసు ఆకలిని మాత్రం మనమే గుర్తించాలి. ఆ ఆకలికి సరైన ఆహారం పుస్తకమే. ఒక మంచి పుస్తకం చదవడం అంటే ఒక మహానుభావుడి జీవితానుభవాన్ని కొన్ని గంటల్లో సొంతం చేసుకోవడమే. ఒక రచయిత దశాబ్దాల పరిశోధన, అనుభవసారం, ఆలోచనా మథనం.. అంతా కొన్ని వందల పేజీల్లో మనకు దక్కుతుంది. అందుకే "చదివే మనిషి వెయ్యి జీవితాలు జీవిస్తాడు.. చదవని మనిషి ఒక్కటే జీవిస్తాడు" అంటారు పెద్దలు. చరిత్రలో మహోన్నత శిఖరాలను అధిరోహించిన వారందరి జీవితాల్లో పుస్తకాలదే ప్రధాన పాత్ర. అబ్దుల్ కలాం నుంచి అంబేద్కర్ వరకు, గాంధీజీ నుంచి వివేకానందుడి వరకు.. వారి ఆలోచనా విప్లవాలకు పునాదులు వేసింది గ్రంథాలయాలే. అంబేద్కర్ అయితే పుస్తకాల కోసం తిండి ఖర్చులు సైతం తగ్గించుకున్న సందర్భాలున్నాయంటే.. అక్షరం విలువను ఆయన ఎంతగా గుర్తించారో అర్థమవుతుంది.

ఇక జీవనశైలిని మార్చుకోవాలనుకునే వారికి పుస్తకం మించిన మార్గదర్శి లేదు. మారాలన్న తపన ఉన్నా.. ఎలా మారాలో తెలియక చాలామంది అక్కడే ఆగిపోతారు. సరైన పుస్తకం ఆ దారిని చూపిస్తుంది. క్రమశిక్షణ లోపించిందా.. అలవాట్లపై రాసిన పుస్తకాలు దిక్సూచిలా నిలుస్తాయి. ఆత్మవిశ్వాసం సన్నగిల్లిందా.. స్ఫూర్తి గాథలు ధైర్యాన్ని నూరిపోస్తాయి. ఆర్థిక ప్రణాళిక తెలియదా.. ఆ రంగ నిపుణుల రచనలు పాఠాలు చెబుతాయి. ఒత్తిడి వేధిస్తోందా.. మనసును తేలికపరిచే సాహిత్యం ఔషధంలా పనిచేస్తుంది. రోజూ పది పేజీలు చదివే చిన్న అలవాటు.. ఏడాదికి పది పుస్తకాలుగా, పదేళ్లకు వంద పుస్తకాలుగా మారి మనిషిని సరికొత్త వ్యక్తిగా తీర్చిదిద్దుతుంది. నిద్రకు ముందు అరగంట ఫోన్ బదులు పుస్తకం పట్టుకుంటే.. మెరుగైన నిద్రతో పాటు మేలైన ఆలోచనలూ సొంతమవుతాయి. పైగా చదివేవాడి మాటల్లో పదును, రాతల్లో స్పష్టత, నిర్ణయాల్లో పరిణతి దానంతటదే వచ్చి చేరుతుంది. నలుగురిలో నిలబడి మాట్లాడే ధీమా పెరుగుతుంది. ఈ డిజిటల్ యుగంలో క్షణక్షణానికీ రీళ్లు, షార్ట్స్ మన ఏకాగ్రతను ముక్కలు చేస్తుంటే.. గంటసేపు ఒకే పుస్తకంతో గడపగలగడం అన్నది గొప్ప మానసిక వ్యాయామం. అది ఏకాగ్రతను, ఓర్పును, లోతుగా ఆలోచించే శక్తిని తిరిగి ప్రసాదిస్తుంది. కాబట్టి తిన్నదేదో గుర్తులేకపోయినా శరీరం ఎదిగినట్టు.. చదివిందేదో మరిచిపోయినా మనసు ఎదుగుతుందన్న ఎమర్సన్ మాటను నమ్మండి. రోజూ కాసేపు అక్షరాలతో స్నేహం చేయండి. ఆ స్నేహం మీ జీవితాన్ని నిశ్శబ్దంగా.. కానీ నిశ్చయంగా ఉన్నత శిఖరాలకు చేరుస్తుంది!


# అభివృద్ధికి అడ్డంకుల తొలగింపు



పరిపాలన అంటే ఫైళ్ల ప్రవాహం కాదు.. ప్రజల జీవితాల్లో మార్పుతెచ్చే నిరంతర ప్రక్రియ. ఈ ప్రాథమిక సత్యాన్ని విస్మరించిన వ్యవస్థలు ఎంత గొప్ప పాలసీలు తెచ్చినా కాగితాలకే పరిమితం. దస్త్రాల అనుమతుల పేరిట అభివృద్ధి ఆలస్యం కాకూడదంటూ.. బిజినెస్ రూల్స్‌ను సమూలంగా ప్రక్షాళన చేయాలంటూ సీఎం చంద్రబాబు అధికార యంత్రాంగానికి ఇచ్చిన ఆదేశాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. వృథా ప్రక్రియలు తొలగించి, సాంకేతికత సాయంతో పాలనను వేగవంతం చేయాలన్న పాలకుడి సంకల్పం.. దశాబ్దాలుగా పాతుకుపోయిన 'ఫైలు సంస్కృతి'పై ఎక్కుపెట్టిన అస్త్రమే. నిజానికి ప్రస్తుత పరిపాలనా నియమావళి చాలావరకు బ్రిటిష్ కాలంనాటి ఆలోచనా ధోరణిలో భాగమే. అనుమానమే ప్రాతిపదికగా, నియంత్రణే లక్ష్యంగా రూపొందిన నిబంధనలు.. వేగం, పారదర్శకత, జవాబుదారీతనం ప్రామాణికాలుగా మారిన నేటి యుగానికి ఏమాత్రం సరిపోవు. చిన్న అనుమతి కోసం ఫైలు పది టేబుళ్లు తిరగడం, ప్రతి టేబుల్ వద్దా వారాల తరబడి నిరీక్షణ, చివరకు ఎవరిదీ కాని బాధ్యత.. ఇదీ మన కార్యాలయాల్లో దశాబ్దాలుగా కొనసాగుతున్న దృశ్యం! ఈ జాప్యంవల్ల నష్టపోయేది సామాన్య పౌరుడే కాదు.. పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు, చివరకు రాష్ట్ర ఆర్థిక ప్రగతి కూడా. అందుకే బిజినెస్ రూల్స్ పునర్లిఖనానికి కమిటీ వేయాలన్న ముఖ్యమంత్రి నిర్ణయం కేవలం సాంకేతిక సవరణ కాదు.. పాలనా తత్వంలోనే మౌలిక మార్పునకు నాంది. అవకాశాలను అందిపుచ్చుకునేందుకు వీలుగా సరళతను పెంచే సంస్కరణలు తేవాలన్న ముఖ్యమంత్రి ఆదేశాల్లో స్పష్టమైన దార్శనికత కనిపిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులు క్షణాల్లో ఖండాంతరాలు దాటుతున్న వేళ.. అనుమతుల కోసం నెలల తరబడి ఎదురుచూసే వాతావరణం ఉన్న ప్రాంతాలవైపు ఏ పారిశ్రామికవేత్తా కన్నెత్తి చూడడు. సింగపూర్, దుబాయ్‌వంటి ప్రాంతాలు ప్రపంచ పెట్టుబడులకు గమ్యస్థానాలుగా ఎదిగింది వనరుల గొప్పతనంతో కాదు.. ప్రక్రియల సరళత్వంతో, నిర్ణయాల వేగంతో! టెక్నాలజీ వినియోగంలో ముందుండే ముఖ్యమంత్రిగా పేరున్న చంద్రబాబు.. రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ కేంద్రం నుంచి వివిధ శాఖల పౌర సేవలను ప్రత్యక్షంగా సమీక్షించడం ఆ సాంకేతిక దృక్పథానికి కొనసాగింపే. డేటా ఆధారిత పాలన, నిరంతర పర్యవేక్షణ, తక్షణ దిద్దుబాటు.. ఈ మూడూ కలిస్తేనే ఆధునిక పరిపాలన. అయితే సాంకేతికత ఎంత అధునాతనమైనా.. దాన్ని నడిపే వ్యవస్థల ఆలోచనా ధోరణి మారకపోతే ఫలితం శూన్యం. అందుకే నిబంధనల ప్రక్షాళనతో పాటు అధికార యంత్రాంగం మనస్తత్వంలోనూ మార్పు రావాల్సిన అవసరాన్ని ఈ సందర్భం గుర్తుచేస్తోంది.

సీఎం సమీక్షలో ప్రస్తావనకు వచ్చిన మరో కీలకాంశం.. క్రియాశీల పాలన (ప్రోయాక్టివ్ గవర్నెన్స్). ప్రజలు సమస్యలతో ప్రభుత్వం వద్దకు వచ్చే వరకు వేచిచూడటం పాత పద్ధతి. సమస్యను ముందే గుర్తించి పరిష్కరించడం, పథక ఫలాలు చిట్టచివరి వ్యక్తికీ చేరేలా చూడటం నవతరం పాలనా విధానం. ఇందుకు సీనియర్ అధికారుల సమర్థ నాయకత్వం అత్యవసరమన్న ముఖ్యమంత్రి వ్యాఖ్య.. యంత్రాంగంపై బాధ్యతను స్పష్టంగా నిర్దేశించింది. ప్రభుత్వ సేవల్లో 'పౌర సంతృప్తి' అనే కొలమానాన్ని కేంద్రస్థానంలో నిలపడం.. ప్రజలను లబ్ధిదారులుగా కాక వినియోగదారులుగా, భాగస్వాములుగా చూసే దృక్పథానికి సంకేతం. ఇక 2017తో పోలిస్తే రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) 20 శాతం వృద్ధి నమోదు చేసిందని ముఖ్యమంత్రి వెల్లడించడం ఆర్థిక పురోగతికి సూచిక. అయితే గణాంకాల వృద్ధి ఎంత ముఖ్యమో.. ఆ వృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకూ పంపిణీ కావడం అంతకంటే ముఖ్యం. విభజన నష్టాలు, రాజధాని నిర్మాణ భారం, అప్పుల ఒత్తిడివంటి సవాళ్ల మధ్య రాష్ట్రం ముందడుగు వేయాలంటే.. ప్రతి రూపాయి వ్యయం గరిష్ఠ ఫలితాన్నివ్వాలి. అందుకు పాలనా సామర్థ్యమే కీలకం. రైతుల విషయంలోనూ సీఎం సమీక్ష స్పృశించిన అంశాలు ప్రస్తావనార్హం. యూరియా లభ్యతను ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి పర్యవేక్షించడం, రైతు సంఘాలు, రైతు సేవా కేంద్రాల ద్వారా యూరియా సద్వినియోగంపై అవగాహన కల్పించాలని, దుర్వినియోగాన్ని అరికట్టాలని ఆదేశించడం.. వ్యవసాయ రంగంపై ప్రభుత్వ శ్రద్ధకు నిదర్శనం. అలాగే, అగ్నిమాపక సేవల ప్రమాణాలు పెంచాలన్న ఆదేశం.. పట్టణీకరణ వేగంగా సాగుతున్న రాష్ట్రంలో ప్రజా భద్రతకు సంబంధించిన ముందుచూపు.

ఈ సమీక్షలో అందరి దృష్టినీ ఆకర్షించిన అంశం.. ఆలయాలను వృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దాలన్న ప్రతిపాదన. రాష్ట్రంలోని 21 ప్రధాన ఆలయాలకు అపార సామర్థ్యం ఉందని, వాటిని ఆర్థిక కార్యకలాపాలు, పర్యాటకాన్ని పెంచే వృద్ధి కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ప్రసాదాల నాణ్యత పెంచాలని, ఆలయాల్లో ఆధ్యాత్మిక వాతావరణాన్ని బలోపేతం చేయాలని దేవదాయ శాఖను ఆదేశించారు. నిజానికి ఆధ్యాత్మిక పర్యాటకం ప్రపంచవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తున్న రంగం. తిరుమల నుంచి కాశీ వరకు.. పుణ్యక్షేత్రాల చుట్టూ అల్లుకున్న ఆర్థిక వ్యవస్థ లక్షలాది కుటుంబాలకు జీవనాధారం. రవాణా, వసతి, భోజన సదుపాయాలు, చేతివృత్తులు, స్థానిక ఉత్పత్తులు.. ఇలా ఒక్కో ఆలయం చుట్టూ విస్తరించే ఉపాధి వలయం అపారమైనది. శ్రీశైలం, సింహాచలం, అన్నవరం, కాణిపాకం, ద్వారకా తిరుమల, శ్రీకాళహస్తి వంటి క్షేత్రాలున్న ఆంధ్రప్రదేశ్‌కు ఈ నమూనా అనుసరణీయమే. అయితే ఇక్కడో సున్నిత సమతుల్యత అవసరం. ఆలయం అంటే ముందుగా అది భక్తి క్షేత్రం.. ఆ తర్వాతే ఆర్థిక వనరు. వాణిజ్య దృష్టి శ్రుతిమించితే ఆధ్యాత్మిక పవిత్రత దెబ్బతింటుంది. అభివృద్ధి పేరిట ఆలయ ప్రాంగణాల ప్రశాంతతకు భంగం కలగకుండా.. భక్తుల సౌకర్యాలు, పరిశుభ్రత, దర్శన సులభత, ప్రసాద నాణ్యత వంటి ప్రాథమిక అంశాలపైనే తొలి దృష్టి నిలపాలి. ఆధ్యాత్మిక వాతావరణాన్ని బలోపేతం చేయాలన్న ముఖ్యమంత్రి సూచన ఈ సమతుల్యతను గుర్తించినట్లుగానే భావించాలి. మొత్తంగా చూస్తే.. ఈ సమీక్ష ఒక సమగ్ర పాలనా దృక్పథాన్ని ఆవిష్కరించింది. నిబంధనల సంస్కరణ నుంచి ఆలయాభివృద్ధి వరకు, ఎరువుల సరఫరా నుంచి ఫిర్యాదుల పరిష్కారం వరకు.. అన్నింటినీ ఏకసూత్రంగా అనుసంధానించేది 'ప్రజల జీవన సౌలభ్యం' అనే లక్ష్యమే. అయితే సంకల్పానికి, సాకారానికి మధ్య ఉండే దూరాన్ని కప్పివేసేది అమలు తీరే. బిజినెస్ రూల్స్ పునర్లిఖన కమిటీ నిర్ణీత గడువులోగా నివేదిక ఇవ్వాలి. ఆ సిఫార్సులు మళ్లీ ఫైళ్ల మధ్య నలిగిపోకుండా చట్టబద్ధ రూపం దాల్చాలి. సంస్కరణల ఫలితాలను కొలిచే పారదర్శక కొలమానాలు ఏర్పడాలి. అప్పుడే 'ఫైళ్ల పాలన' నుంచి 'ఫలితాల పాలన'కు రాష్ట్రం నిజంగా మళ్లినట్లు. వేగవంతమైన నిర్ణయాలు, జవాబుదారీ యంత్రాంగం, సాంకేతిక పర్యవేక్షణ.. ఈ త్రివేణి సంగమమే నవ్యాంధ్ర భవితకు బాటలు వేస్తుంది. దస్త్రాల దుమ్ము దులిపి, ప్రక్రియల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టిన ఈ సంస్కరణ యజ్ఞం.. ప్రకటనల స్థాయి దాటి క్షేత్రస్థాయి వాస్తవంగా మారాలని, ఆ మార్పు ఫలాలు కడసారి వరుసలో నిలిచిన సామాన్యుడికీ అందాలని ఆశిద్దాం. అదే జరిగిననాడు.. వేగమే వికాసమన్న నినాదం నినాదంగా మిగలదు, రాష్ట్ర ప్రగతి ప్రస్థానానికి చోదకశక్తిగా నిలుస్తుంది. ■




30 ఏళ్ల వయసులో ఒక మంచి జీతం వచ్చే ఉద్యోగాన్ని సంపాదించి ఉంటే.. ఆర్థిక విషయాల్లో ఇతరుల మాటలు విని తొందరపడకండి. మీ ఎదుగుదలను అడ్డుకునేలా ఎలాంటి అప్పులూ చేయకండి. గతంలో కోల్పోయిన సమయాన్ని భర్తీ చేయాలనే ఆరాటంలో మిమ్మల్ని మీరు ఇబ్బందుల్లో పడేసుకోకండి. ఎందుకంటే, చాలామంది తక్కువ సమయంలో ఎక్కువ సాధించాలనే తొందరలోనే ఆర్థిక సమస్యల్లో చిక్కుకుంటారు. సంపద అంటే వేగంగా పోగేసుకునేది కాదు.. ఓపికగా పెంచుకునేది. నిలకడగా వేసే చిన్న అడుగులే.. కాలక్రమంలో పెద్ద ఆర్థిక భద్రతగా మారతాయి.

-మహాదేవ

## వింతల్లో వింతలు

# అద్దెకు బార్బెక్యూ ఫ్రెండ్!



బార్బెక్యూ చేసుకోవాలని ఉన్నా, కూర్చుని కబుర్లు చెప్పే తోడు లేదా? రష్యాలో ఆ సమస్యకూ పరిష్కారం దొరికేసింది! ఒంటరిగా ఉన్నవారికి బార్బెక్యూ కంపెనీ ఇచ్చేందుకు 'అద్దె స్నేహితులు' అక్కడి ఆన్‌లైన్ క్లాసిఫైడ్స్‌లో దొరుకుతున్నారు. రోజుకు వెయ్యినుంచి ఐదు వేల రూబిళ్లు (రూ. 1,100 నుంచి రూ. 5,500) చెల్లిస్తే చాలు.. వీళ్లు వచ్చి బార్బెక్యూ సిద్ధం చేస్తారు. మాంసం గ్రిల్ చేస్తారు. టెంట్ వేస్తారు. జోకులేసి నవ్విస్తారు! "బార్బెక్యూ, క్యాంపింగ్ ఏర్పాట్లలో సాయం చేస్తా.. జోకులు ఫ్రీ" అంటూ మాస్కోకు చెందిన ఆర్టెమ్ అనే వ్యక్తి ప్రకటన పెట్టడం విశేషం. బిల్లు మీరు కడితే.. స్పాట్ వెతకడం, సరుకుల కొనుగోలు బాధ్యత తామే చూసుకుంటామనే వాళ్లూ ఉన్నారు. అయితే ఇదంతా పక్కా వ్యాపారమే.. శాశ్వత స్నేహం ఆశించొద్దని ముందే తేల్చిచెబుతారట! మళ్లీ కలవాలంటే మళ్లీ ఫీజు కట్టాల్సిందే. మాస్కో, క్రాస్నోదర్, నిజ్నీ నొవ్‌గొరోద్ ప్రాంతాల్లో ఈ 'అద్దె దోస్తీ'కి భలే గిరాకీ ఉందట మరి!

# డీహైడ్రేషన్ బారిన పడితే కేవలం నీళ్లను తాగితే సరిపోదు

సాధారణంగా చాలా మంది ఎదుర్కొనే అనారోగ్య సమస్యల్లో డీహైడ్రేషన్ (శరీరంలో నీటి లోపం) కూడా ఒకటి. ఇది కేవలం ఎండాకాలం లేదా కఠినమైన వ్యాయామం చేసే వాళ్లకే వచ్చే సమస్య కాదు. రోజువారీ జీవితంలో చిన్నచిన్న అలవాట్ల వల్ల చాలా మంది తెలియకుండానే దీర్ఘకాలిక డీహైడ్రేషన్‌కు గురవుతున్నారు. ముఖ్యంగా ఉద్యోగులు, గృహిణులు, విద్యార్థులు, వృద్ధులు వంటి వారిలో ఇది ఎక్కువగా కనిపిస్తోంది. నీరు తాగడం మర్చిపోవడం, టీ-కాఫీలపై ఎక్కువగా ఆధారపడడం, దాహం వేయకపోతే నీరు అవసరం లేదనుకోవడం వంటి అలవాట్లు శరీరంపై నెమ్మదిగా ప్రభావం చూపిస్తున్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. నిపుణుల ప్రకారం దాహం వేయడం అనేది శరీరంలో నీటి లోపానికి ముందస్తు సంకేతం కాదు. దాహం అనిపించే సమయానికి శరీరం అప్పటికే స్వల్ప స్థాయిలో డీహైడ్రేషన్‌కు గురై ఉంటుందని వారు చెబుతున్నారు.



### లక్షణాలు ఇవే..

ముఖ్యంగా వృద్ధుల్లో దాహం గుర్తించే శక్తి తగ్గిపోవడంతో ఈ సమస్య మరింత ప్రమాదకరంగా మారుతోంది. రోజంతా ఏసీ గదుల్లో కూర్చుని పని చేసే వారికీ కూడా శరీరం శ్వాస, చెమట, మూత్రం ద్వారా నిరంతరం ద్రవాలను కోల్పోతూనే ఉంటుంది. డీహైడ్రేషన్ వల్ల శరీరంపై అనేక రకాల ప్రభావాలు కనిపిస్తాయి. సరిపడా నిద్రపోయినా అలసటగా అనిపించడం, ఏకాగ్రత తగ్గడం, జ్ఞాపకశక్తి మందగించడం, తలనొప్పి, తల తిరగడం వంటి సమస్యలు వస్తాయి. అలాగే కండరాల పట్టుకుపోవడం, జీర్ణక్రియ మందగించడం, మలబద్ధకం, చర్మం పొడిబారడం వంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి. కొందరిలో చిరాకు, ఆందోళన వంటి మానసిక మార్పులు కూడా కనిపిస్తాయని నిపుణులు చెబుతున్నారు. మధుమేహంతో బాధపడేవారిలో డీహైడ్రేషన్ ప్రభావం మరింత ఎక్కువగా ఉంటుంది. రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగినప్పుడు మూత్రం ఎక్కువగా వస్తుంది. దీంతో శరీరం మరింత నీటిని కోల్పోతుంది. డీహైడ్రేషన్ పెరిగితే రక్తంలో గ్లూకోజ్ మరింత సాంద్రత చెందుతుంది. ఇలా ఇది ఒక ప్రమాదకర చక్రంలా మారుతుంది.


### ఎలక్ట్రోలైట్స్ కూడా అవసరమే..

వృద్ధుల్లో అయితే మూత్రపిండాల పనితీరు తగ్గిపోవడం వల్ల యూరినరీ ఇన్ఫెక్షన్లు, తక్కువ రక్తపోటు, తూలి పడిపోవడం వంటి సమస్యల ప్రమాదం పెరుగుతుంది. అయితే ఎక్కువ నీరు తాగితే సరిపోతుందనే భావన పూర్తిగా సరైనది కాదని వైద్యులు చెబుతున్నారు. శరీరానికి నీటితోపాటు ఎలక్ట్రోలైట్స్ కూడా అవసరం. సోడియం, పొటాషియం, మెగ్నీషియం, క్లోరైడ్ వంటి ఖనిజాలనే ఎలక్ట్రోలైట్స్ అంటారు. ఇవి శరీర కణాల్లో నీటి సమతుల్యతను కాపాడటంలో, నరాల పనితీరులో, కండరాల కదలికల్లో కీలక పాత్ర పోషిస్తాయి. చెమట ద్వారా శరీరం నీటితో పాటు ఈ ఖనిజాలను కూడా కోల్పోతుంది. కేవలం నీరు తాగడం వల్ల ద్రవాలు చేరినా, ఎలక్ట్రోలైట్ సమతుల్యత మాత్రం పునరుద్ధరించబడదు.

### సంప్రదాయ పానీయాలను తాగాలి..

సంప్రదాయ పానీయాలు అయిన నిమ్మరసం, మజ్జిగ, కొబ్బరి నీరు వంటి వాటిలో సహజంగానే కొన్ని ఎలక్ట్రోలైట్స్ ఉంటాయి. అందుకే ఇవి శరీరాన్ని మరుకుగా ఉంచడంలో సహాయపడతాయి. అయితే ప్రతి సందర్భంలో ఇవి సరిపోవని వైద్యులు సూచిస్తున్నారు. అవసరమైనప్పుడు సరైన ఎలక్ట్రోలైట్ డ్రింక్స్ తీసుకోవడం మంచిదని చెబుతున్నారు. ఎలక్ట్రోలైట్ డ్రింక్స్ ఎంపికలో కూడా జాగ్రత్త అవసరం. అధిక చక్కెర కలిగిన పానీయాలు రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను పెంచి సమస్యలను మరింత పెంచుతాయి. కాబట్టి తక్కువ చక్కెరతో, సరిపడా సోడియం, పొటాషియం కలిగిన పానీయాలను మాత్రమే ఎంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా మధుమేహం, రక్తపోటు ఉన్నవారు వైద్యుల సలహాతోనే ఇలాంటి డ్రింక్స్ తీసుకోవడం మంచిది. ఆరోగ్యకరమైన జీవనశైలిలో హైడ్రేషన్‌కు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని వైద్యులు సూచిస్తున్నారు. మధ్యాహ్నం అలసటగా అనిపించడం, తరచూ తలనొప్పి రావడం, మెదడు మరుకుదనం తగ్గిపోవడం వంటి సమస్యలు ఉంటే ముందుగా శరీరంలో నీటి లోపం ఉందేమో పరిశీలించుకోవాలి. సరైన సమయంలో తగినంత నీరు, అవసరమైన ఎలక్ట్రోలైట్స్ తీసుకోవడం ద్వారా అనేక ఆరోగ్య సమస్యలను సులభంగా నివారించవచ్చని పేర్కొంటున్నారు.

# రోజూ మీరు చేసే ఈ చిన్న తప్పులే పేగుల ఆరోగ్యాన్ని క్షీణించేలా చేస్తాయి



ఇప్పటి జీవనశైలిలో గట్ హెల్త్ లేదా జీర్ణాశయ ఆరోగ్యం గురించి అవగాహన వేగంగా పెరుగుతోంది. ఎందుకంటే పేగుల ఆరోగ్యం కేవలం జీర్ణక్రియకే పరిమితం కాదు. శరీర రోగనిరోధక శక్తి, మానసిక స్థితి, శక్తి స్థాయిలు, చర్మ ఆరోగ్యం వంటి అనేక అంశాలపై ఇది ప్రభావం చూపుతుంది. అయితే సోషల్ మీడియాలో కనిపించే ప్రతి గట్ ఫ్రెండ్లీ సలహా నిజంగా ఉపయోగకరమై ఉండకపోవచ్చని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇటీవల నిపుణులు వెల్లడించిన వివరాల ప్రకారం, చాలా మంది ప్రతిరోజూ పాటించే కొన్ని సాధారణ అలవాట్లు పేగుల ఆరోగ్యాన్ని నెమ్మదిగా దెబ్బతీస్తాయని చెబుతున్నారు. చాలా మందికి ఇవి తెలియకుండానే అలవాట్లుగా మారిపోయాయని పేర్కొంటున్నారు. పేగుల ఆరోగ్యాన్ని దెబ్బతీసే రోజువారీ అలవాట్ల గురించి వారు వివరిస్తున్నారు.

### మరీ అధికంగా ఫైబర్ వద్దు..

చాలామంది ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ఒక్కసారిగా అధిక ఫైబర్ ఉన్న ఆహారాన్ని తీసుకోవడం ప్రారంభిస్తారు. కానీ ఇలా అకస్మాత్తుగా ఫైబర్ పరిమాణం పెంచితే పొట్ట ఉబ్బరం, గ్యాస్, అసౌకర్యం వంటి సమస్యలు తలెత్తవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. క్రమంగా ఫైబర్ పరిమాణాన్ని పెంచడం ఉత్తమమని చెబుతున్నారు. అలాగే బరువు పెరుగుతామనే భయంతో కొందరు అన్ని రకాల ఫ్యాట్స్‌ను ఆహారంలో నుంచి పూర్తిగా తొలగిస్తారు. అయితే ఆరోగ్యకరమైన కొవ్వులు పేగుల పొరను బలంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. గింజలు, అవకాడో, నెయ్యి వంటి మంచి కొవ్వులను పరిమితంగా తీసుకోవడం అవసరమని సూచిస్తున్నారు.

### ఒకే రకం ఆహారం రోజూ వద్దు..

అదే విధంగా రోజూ ఒకేరకం ఆహారాన్ని పదే పదే తినడం కూడా గట్ హెల్త్‌కు మంచిది కాదని నిపుణులు చెబుతున్నారు. పేగుల్లో ఉండే మంచి బ్యాక్టీరియా వైవిధ్యమైన ఆహారంతోనే సమతుల్యంగా పెరుగుతాయి. అందుకే కూరగాయలు, పండ్లు, ధాన్యాలు, పప్పులు వంటి విభిన్న ఆహారాలను తీసుకోవడం అవసరమని సూచిస్తున్నారు. అంతేకాకుండా భోజనాన్ని కార్బోహైడ్రేట్స్‌తో ప్రారంభించడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ముందు ఫైబర్ లేదా ప్రోటీన్ ఉన్న ఆహారం తీసుకుని, తర్వాత కార్బోహైడ్రేట్స్ తీసుకోవడం జీర్ణక్రియకు మంచిదని సూచిస్తున్నారు.

### ప్రోటీన్ బార్స్, షేక్స్‌ను పక్కన పెట్టండి..

ఇక సౌకర్యవంతంగా ఉంటాయని భావించి చాలామంది ప్రోటీన్ బార్లు, షేక్స్‌ను తరచూ తీసుకుంటున్నారు. కానీ వీటిలో చాలా వరకు అధికంగా ప్రాసెస్ చేసిన పదార్థాలు ఉండే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఇవి గట్ హెల్త్‌పై ప్రతికూల ప్రభావం చూపవచ్చని హెచ్చరిస్తున్నారు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకున్నా, ప్రతిరోజూ భోజనం చేసే సమయాలు మారుతూ ఉంటే జీర్ణవ్యవస్థ గందరగోళానికి గురవుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. పేగులు ఒక నిర్దిష్ట సమయానికి అలవాటు పడతాయి కాబట్టి, సమయపాలన చాలా ముఖ్యమని పేర్కొంటున్నారు. అదే విధంగా తిన్న వెంటనే పడుకోవడం కూడా జీర్ణక్రియను మందగింపజేస్తుంది. భోజనం తర్వాత కొంతసేపు నిటారుగా కూర్చోవడం లేదా నడవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ఇది ఆహారం సులభంగా జీర్ణమవడంలో సహాయపడుతుంది. ఈ విధంగా ఈ సూచనలు గట్ హెల్త్ కోసం కఠినమైన డైట్ అవసరం లేదని స్పష్టం చేస్తున్నాయి. ప్రతిరోజూ చిన్నచిన్న ఆరోగ్యకరమైన అలవాట్లను పాటించడం ద్వారా పేగుల ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.

# కేవలం 7 రోజుల పాటు ధ్యానం చేస్తే ఎన్నో ఉపయోగాలు

మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ధ్యానం కీలక పాత్ర పోషిస్తుందని ఎన్నో అధ్యయనాలు ఇప్పటికే వెల్లడించాయి. ఇప్పుడు తాజాగా వెలుగులోకి వచ్చిన మరో పరిశోధన డీప్ మెడిటేషన్‌పై మరిన్ని ఆసక్తికరమైన విషయాలను బయటపెట్టింది. కేవలం ఏడు రోజుల పాటు లోతైన ధ్యానం చేస్తే మెదడు పనితీరులో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటాయని ఈ అధ్యయనం చెబుతోంది. ముఖ్యంగా మెదడు నాడీ వ్యవస్థ పనితీరు మెరుగుపడటంతోపాటు రక్త సంబంధిత జీవక్రియలపై కూడా దీని ప్రభావం ఉంటుందని పరిశోధకులు వెల్లడించారు. యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా శాన్‌డియాగో నిర్వహించిన ఈ అధ్యయనం ప్రకారం, ధ్యానం, మైండ్-బాడీ టెక్నిక్స్ కలిపి చేసిన ఏడు రోజుల ప్రత్యేక కార్యక్రమం మెదడు కార్యకలాపాలు, శరీర జీవక్రియలలో కొలిచే స్థాయిలో మార్పులు తీసుకువచ్చిందని గుర్తించారు. ఈ ఫలితాలను కమ్యూనికేషన్స్ బయాలజీ జర్నల్‌లో ప్రచురించారు.



### రోగ నిరోధక వ్యవస్థ చురుగ్గా..

పరిశోధనలో పాల్గొన్న వారిలో మెదడు నాడీ వ్యవస్థలో కొత్త మార్పులు కనిపించాయని, దీని ద్వారా న్యూరోప్లాస్టిసిటీ సాధ్యమవుతుందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. అంటే మెదడు కొత్త అనుభవాలకు అనుగుణంగా తన పనితీరును మార్చుకునే సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. ఈ అధ్యయనంలో మరో ముఖ్యమైన అంశం ఏమిటంటే, ధ్యానం వల్ల శరీర రోగనిరోధక వ్యవస్థ కూడా చురుకుగా మారిందని గుర్తించారు. అలాగే సహజసిద్ధమైన నొప్పి నివారణ రసాయనాల ఉత్పత్తి కూడా పెరిగినట్లు వెల్లడించారు. దీని వల్ల శారీరక, మానసిక ఆరోగ్యంపై సానుకూల ప్రభావం ఉండే అవకాశం ఉందని పరిశోధకులు చెబుతున్నారు. ధ్యానం కేవలం ఒత్తిడి తగ్గించే ప్రక్రియ మాత్రమే కాదని, అది మెదడు వాస్తవాలను గ్రహించే విధానాన్నే మార్చగలదని పరిశోధకులు తెలిపారు. ఈ మార్పులను మెదడు, రక్త పరీక్షల ద్వారా నేరుగా కొలిచామని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

### వేగంగా పెరుగుతున్న మానసిక సమస్యలు..

ఏడు రోజుల ధ్యాన శిబిరంలో మొత్తం 33 గంటల గైడెడ్ మెడిటేషన్ నిర్వహించారు. ఇందులో గ్రూప్ హీలింగ్ యాక్టివిటీస్, మానసిక ఆరోగ్య పద్ధతులు కూడా భాగంగా ఉండటం వల్ల పాల్గొన్న వారిలో మంచి ఫలితాలు కనిపించాయని పరిశోధకులు వెల్లడించారు. దేశంలో యోగా, ధ్యానంపై ఆసక్తి పెరుగుతున్న నేపథ్యంలో ఈ అధ్యయనం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. దీర్ఘకాలిక నొప్పులు, మూడ్ డిజార్డర్లు, మానసిక ఒత్తిడి వంటి సమస్యలు దేశంలో వేగంగా పెరుగుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా మహిళల్లో దీర్ఘకాలిక నొప్పుల సమస్యలు ఎక్కువగా ఉన్నాయని అధ్యయనాలు సూచిస్తున్నాయి. నిత్య జీవితంలో ధ్యానాన్ని భాగం చేసుకోవడం ద్వారా మానసిక ప్రశాంతతతోపాటు మెదడు పనితీరు కూడా మెరుగుపడే అవకాశం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. క్రమం తప్పకుండా డీప్ మెడిటేషన్ చేయడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యంపై దీర్ఘకాలిక ప్రయోజనాలు పొందవచ్చని పరిశోధకులు పేర్కొన్నారు.

# తరచూ అసిడిటీ లేదా ఈ జీర్ణ సమస్యలు వస్తున్నాయా.. అయితే జాగ్రత్త..

ప్రస్తుతం ఉన్న వేగవంతమైన జీవనశైలిలో అసిడిటీ, గ్యాస్, పొట్టలో మంట వంటి సమస్యలు చాలా సాధారణంగా మారిపోయాయి. అసమయ భోజనం, అధిక కాఫీ, టీలు, మసాలా ఆహారం, రాత్రివేళల్లో ఆలస్యంగా తినడం వంటి అలవాట్ల వల్ల చాలామందిలో ఈ సమస్యలు కనిపిస్తున్నాయి. సాధారణంగా ఇవి తాత్కాలికంగా ఉండి, ఆహారపు అలవాట్లు మార్చుకుంటే తగ్గిపోతాయి. అయితే అసిడిటీ తరచూ రావడం, రోజురోజుకూ తీవ్రంగా మారడం లేదా ఎక్కువకాలం కొనసాగడం వంటి పరిస్థితులను మాత్రం నిర్లక్ష్యం చేయకూడదని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వైద్య నిపుణుల ప్రకారం, వారానికి రెండు నుంచి మూడు సార్లకంటే ఎక్కువ అసిడిటీ రావడం సాధారణ విషయం కాదని చెబుతున్నారు.



### వాంతులు, వికారం..

ముఖ్యంగా రాత్రివేళల్లో నిద్ర భంగం కలిగించే రిఫ్లక్స్, మింగడానికి ఇబ్బంది, తరచూ వాంతులు, కారణం లేకుండా బరువు తగ్గడం, వాంతుల్లో లేదా మలంలో రక్తం కనిపించడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు. ఇవి సాధారణ గ్యాస్ సమస్యకంటే తీవ్రమైన జీర్ణాశయ వ్యాధులకు సంకేతాలు కావచ్చని పేర్కొంటున్నారు. తరచూ అసిడిటీ రావడానికి పలు కారణాలు ఉండవచ్చని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా గ్యాస్ట్రోఈసోఫేజియల్ రిఫ్లక్స్ డిసీజ్ (జీఈఆర్డీ), కడుపులో అల్సర్లు, ఫంక్షనల్ డిస్పెప్సియా వంటి సమస్యలు దీనికి కారణమవుతాయి. కొన్నిసార్లు ప్రారంభ దశలో ఉన్న జీర్ణాశయ క్యాన్సర్లలో కూడా ఇలాంటి లక్షణాలు కనిపించే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అందుకే లక్షణాలను తేలికగా తీసుకోకుండా సరైన పరీక్షలు చేయించుకోవడం అవసరమని చెబుతున్నారు.

### సమస్యలు వచ్చే అవకాశం..

అసిడిటీని ఎక్కువకాలం నిర్లక్ష్యం చేస్తే పలు సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. ఆహార నాళంలో మంట, గాయాలు ఏర్పడటం, మింగడానికి ఇబ్బంది కలగడం వంటి సమస్యలు వస్తాయి. అలాగే బారెట్ ఈసోఫేగస్ అనే పరిస్థితి కూడా అభివృద్ధి చెందే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఇది భవిష్యత్తులో క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచే అవకాశముందని హెచ్చరిస్తున్నారు.

### ఇవి కూడా కారణాలే..

అయితే ప్రతి అసిడిటీ సమస్య వెనుక శారీరక వ్యాధులే ఉండాల్సిన అవసరం లేదని వైద్యులు చెబుతున్నారు. ఒత్తిడి, ఆందోళన, మానసిక సమస్యలు కూడా జీర్ణక్రియపై ప్రభావం చూపుతాయి. దీని వల్ల పొట్ట ఉబ్బరం, భోజనం చేసిన వెంటనే నిండిన భావన, పై పొట్టలో అసౌకర్యం వంటి లక్షణాలు కనిపిస్తాయి. పరీక్షల్లో పెద్ద సమస్య కనిపించకపోయినా, ఇలాంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయరాదని నిపుణులు సూచిస్తున్నారు. 40 ఏళ్ల దాటిన తర్వాత కొత్తగా అసిడిటీ సమస్య ప్రారంభమైతే మరింత జాగ్రత్త అవసరమని వైద్యులు చెబుతున్నారు. ధూమపానం చేసే వారు, కుటుంబంలో జీర్ణాశయ క్యాన్సర్ చరిత్ర ఉన్నవారు, చాలా కాలంగా రిఫ్లక్స్‌తో బాధపడుతున్నవారు తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తున్నారు. అవసరమైతే ఎండోస్కోపీ వంటి పరీక్షలు చేయడం ద్వారా సమస్యను ప్రారంభ దశలోనే గుర్తించవచ్చని పేర్కొంటున్నారు.

### జీవనశైలిలో మార్పులు అవసరం..

అసిడిటీని నియంత్రించేందుకు జీవనశైలిలో కొన్ని మార్పులు చేయడం చాలా అవసరం. సమయానికి భోజనం చేయడం, మసాలా, వేయించిన ఆహారాన్ని తగ్గించడం, తిన్న వెంటనే పడుకోకుండా ఉండడం, బరువును నియంత్రణలో ఉంచడం, నిద్రపోయేటప్పుడు తల భాగాన్ని కొద్దిగా ఎత్తుగా ఉంచడం వంటి అలవాట్లు ఉపశమనానికి సహాయపడతాయని నిపుణులు చెబుతున్నారు. అలాగే యోగా, ధ్యానం వంటి ఒత్తిడి తగ్గించే పద్ధతులు కూడా ఉపయోగపడతాయని సూచిస్తున్నారు. అసిడిటీ సాధారణ సమస్యగానే కనిపించినా, తరచూ రావడం లేదా తీవ్రమవడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. సరైన సమయంలో వైద్య సలహా తీసుకోవడం ద్వారా తీవ్రమైన సమస్యలను ముందుగానే గుర్తించి చికిత్స పొందవచ్చని పేర్కొంటున్నారు.

# భారత్ జం పాక్ మ్యాచ్‌ల కోసం ఐసీసీ సంచలన మార్పులు.. క్రికెట్ ఫ్యాన్స్‌కు బిగ్ షాక్!




**హైదరాబాద్ పెన్ పవర్:** అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (×జజ) ప్రపంచ క్రికెట్ అభిమానులకు సరికొత్త మజాను అందించేందుకు సిద్ధమైంది. ఎడిన్‌బర్గ్‌లో ముగిసిన వార్షిక సమావేశంలో, ఐసీసీ బోర్డు రెండు మెగా టోర్నమెంట్ల ఫార్మాట్లలో విప్లవాత్మక మార్పులను అధికారికంగా ప్రకటించింది. టోర్నీ ప్రారంభ దశ నుంచే ప్రతి మ్యాచ్ ఉత్కంఠభరితంగా కొనసాగించాలనే ఉద్దేశంతో ఈ సంచలన నిర్ణయం తీసుకుంది. 2027లో జరగబోయే పురుషుల వన్డే ప్రపంచకప్‌తో పాటు 2028లో జరిగే టీ20 ప్రపంచకప్‌ల కొత్త రూపురేఖలు ఎలా ఉండబోతున్నాయో ఇప్పుడు తెలుసుకుందాం..

**2027 వన్డే ప్రపంచకప్:**

దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియాల సంయుక్త ఆతిథ్యంలో 2027లో జరగనున్న వన్డే ప్రపంచకప్ 14 జట్లతోనే జరగనుంది. కానీ, ఈసారి టోర్నీ కేవలం గ్రూప్ మ్యాచ్‌లతో కాకుండా సరికొత్త నాలుగు దశల ఫార్మాట్‌లో సాగనుంది.

మొదటి దశ (సూపర్ సిరీస్): అర్హత సాధించిన 14 జట్లలో అత్యంత తక్కువ ర్యాంకింగ్ కలిగిన చివరి 3 జట్లు మొదట సూపర్ సిరీస్ రౌండ్ -రాబిన్ లీగ్‌లో తలపడతాయి. వీటిలో కేవలం ఒకే ఒక జట్టు తదుపరి గ్రూప్ దశకు అర్హత సాధిస్తుంది, మిగిలిన రెండు జట్లు టోర్నీ ప్రారంభంలోనే వెనుదిరుగుతాయి.

రెండో దశ (గ్రూప్ స్టేజ్): మిగిలిన 12 జట్లను రెండు గ్రూపులుగా (ఒక్కో గ్రూప్‌లో 6 జట్లు) విభజిస్తారు. లీగ్ మ్యాచ్‌లు పూర్తయిన తర్వాత.. ప్రతి గ్రూప్ నుంచి టాప్--3 స్థానాల్లో నిలిచిన జట్లతో పాటు రెండు గ్రూపుల్లో కలిపి అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన ఒకే ఒక్క నాలుగో స్థాన జట్టు (మొత్తం 7 జట్లు) సూపర్ 7 దశకు చేరుకుంటాయి.

మూడో దశ (సూపర్ 7): ఈ 7 జట్ల మధ్య రౌండ్-రాబిన్ పద్ధతిలో 21 లీగ్ మ్యాచ్‌లు జరుగుతాయి. ఇందులో మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి.

నాలుగో దశ (నాకౌట్స్): సెమీఫైనల్స్ లో మొదటి స్థానంలో నిలిచిన జట్టు నాలుగో స్థానంలోని జట్టుతో, రెండో స్థానంలో ఉన్న జట్టు మూడో ప్లేస్ లోని టీమ్ తో తలపడతాయి. విజేతలు ఫైనల్స్‌లో తలపడి ట్రోఫీ కోసం పోరాడతారు.

**భారత్- పాక్ పోరు.. ఒకే టోర్నీలో రెండుసార్లు ఫైట్:**

క్రికెట్ ప్రపంచంలోనే అత్యంత క్రేజ్ ఉన్న భారత్ వర్సెస్ పాకిస్తాన్ మ్యాచ్‌ల విషయంలో ఈ కొత్త ఫార్మాట్ అభిమానులకు డబుల్ ధమాకా ఇవ్వనుంది. ఈ కొత్త నియమాల ప్రకారం భారత్, పాకిస్తాన్ జట్లు ఒకే గ్రూప్‌లో ఉంటే గనుక.. ఈ మెగా టోర్నీలో కనీసం రెండుసార్లు తలపడే అవకాశం లభిస్తుంది. మొదట గ్రూప్ దశలో ఒకసారి ముఖాముఖి పోరాడగా, ఆ తర్వాత ఇరు జట్లు క్వాలిఫై అయి సూపర్ 7 దశకు చేరితే అక్కడ రెండోసారి తలపడే లక్కీ ఛాన్స్ దక్కుతుంది.

**2028 టీ20 ప్రపంచకప్:**

ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ ఆతిథ్యమివ్వనున్న 2028 టీ20 ప్రపంచకప్ కూడా 20 జట్లతోనే కొనసాగినప్పటికీ, దీని ఫార్మాట్‌లో ఉత్కంఠను రెట్టింపు చేసేలా మార్పులు చేశారు.

**గ్రూప్ దశ:** గతంలో నాలుగు గ్రూపులుగా ఉన్న 20 జట్లను, ఇప్పుడు ఐదు గ్రూపులుగా (గ్రూప్‌నకు 4 జట్లు చొప్పున) విభజిస్తారు. ప్రతి గ్రూప్ నుంచి టాప్-2 స్థానాల్లో నిలిచిన జట్లు (మొత్తం 10 జట్లు) సూపర్ 10 దశకు చేరుకుంటాయి.

**సూపర్ 10:** ఈ 10 జట్లను రెండు గ్రూపులుగా (గ్రూప్‌నకు 5 చొప్పున) విభజిస్తారు. ఈ రెండు గ్రూపుల్లో అగ్రస్థానంలో (1వ స్థానం) నిలిచిన జట్లు నేరుగా సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి.

**ఎలిమినేటర్స్:** మిగిలిన రెండు సెమీఫైనల్ స్థానాల కోసం సరికొత్తగా ఎలిమినేటర్స్ రౌండ్ ప్రవేశ పెట్టారు. ఒక గ్రూప్‌లోని రెండో స్థానంలోని జట్టు, మరో గ్రూప్‌లోని మూడో ప్లేస్ లోని టీమ్ తో తలపడుతుంది. వీటిలో విజేతలుగా నిలిచిన రెండు జట్లు మిగిలిన రెండు సెమీఫైనల్ స్థానాలను భర్తీ చేస్తాయి. ఆ తర్వాత సెమీఫైనల్స్, ఫైనల్స్ మ్యాచ్‌లు జరుగుతాయి. కాగా ఐసీసీ తీసుకున్న ఈ సమూల మార్పులు టోర్నీ ప్రారంభం నుంచే ప్రతి ఒక్క మ్యాచ్‌ను చావో రేవో తేల్చుకునేలా చేసి, ప్రేక్షకులకు మంచి వినోదాన్ని అందించడం ఖాయంగా కనిపిస్తోంది.

# లంకా ప్రీమియర్ లీగ్ 2026 షెడ్యూల్ రిలీజ్.. జట్లు, లైవ్ స్ట్రీమింగ్, కొత్త రూల్స్ ఇవే!

**హైదరాబాద్ పెన్ పవర్:** క్రికెట్ అభిమానులకు సరికొత్త టీ20 వినోదాన్ని అందించేందుకు లంక ప్రీమియర్ లీగ్ 6వ ఎడిషన్ సిద్ధమైంది. రేపటి (జూలై 17) నుంచి ఆగస్టు 8 వరకు శ్రీలంక వేదికగా ఈ ప్రతిష్టాత్మక లీగ్ జరగబోతోంది. గత 2025 ఎడిషన్ శ్రీలంక బోర్డు టీ20 ప్రపంచకప్ వేదికల సన్నద్ధత కోసం రద్దు చేయడంతో.. ఈసారి సరికొత్త జోష్‌తో టోర్నీ తిరిగి రాబోతోంది. కొలంబో, దంబుల్లా, పల్లెకెలె వేదికలుగా మొత్తం 24 మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ టోర్నీలో ఐదు ఫ్రాంచైజీలు తలపడనున్నాయి. డిఫెండింగ్ ఛాంపియన్స్ జాఫ్నా కింగ్స్, గాలే గ్యాలెంట్స్ మధ్య కొలంబోలోని ఎస్ఎస్‌సీ (రాజ) మైదానంలో తొలి మ్యాచ్‌తో ఈ మెగా టోర్నీ అట్టహాసంగా ప్రారంభం కానుంది.






**ఐదు జట్లు:**

ఈసారి టోర్నమెంట్‌లో పాల్గొనే జట్ల యాజమాన్యాలు మారడంతో పాటు వాటి పేర్లు కూడా ఆసక్తికరంగా మారాయి.

జాఫ్నా కింగ్స్ (జీుటటఋ ఖఱఅస్త్రం): (గతంలో జాఫ్నా టైటాన్స్).

గాలే గ్యాలెంట్స్: (గతంలో గాలే మార్వెల్స్).

కొలంబో క్యాప్స్ : (గతంలో కొలంబో స్ట్రైకర్స్).

క్యాండీ రాయల్స్ : (గతంలో క్యాండీ ఫాల్కన్స్).

దంబుల్లా సిక్సర్స్: దినేష్ చండీమల్ కెప్టెన్సీలోని బలమైన జట్టు.

**సరికొత్త రూల్స్:**

ఈ సారి లంక ప్రీమియర్ లీగ్‌ను మరింత ఉత్కంఠభరితంగా మార్చేందుకు సరికొత్త నిబంధనలను తీసుకువచ్చారు.

ఇంపాక్ట్ సబ్ : ఐపీఎల్ తరహాలోనే ఎల్పీఎల్‌లో కూడా మొదటిసారిగా 'ఇంపాక్ట్ సబ్' నిబంధనను ప్రవేశపెడుతున్నారు.

అండర్-23 రూల్: ప్రతి జట్టు తమ ప్లేయింగ్ శ×లో కనీసం ఒక అండర్-23 (23 ఏళ్ల లోపు) ఆటగాడిని తప్పనిసరిగా ఆడించాల్సిందే. ఇంపాక్ట్ సబ్ వాడినప్పటికీ మైదానంలో ఒక అండర్-23 క్రీడాకారుడు ఉండాల్సిందే.

స్లో ఓవర్ రేట్ పెనాల్టీ: మ్యాచులు త్వరగా ముగిసేలా స్లో ఓవర్ రేట్ వేసే కెప్టెన్లకు కఠినమైన పెనాల్టీలు విధించనున్నారు.

**ప్లేఆఫ్స్ వివరాలు:**

లీగ్ దశలో ఐదు జట్లు మిగిలిన జట్లతో రెండేసి మ్యాచ్‌లు (డబుల్ రౌండ్-రాబిన్) ఆడుతాయి.

లీగ్ ముగిసే సమయానికి పాయింట్ల పట్టికలో మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు ప్లేఆఫ్స్‌కు అర్హత సాధిస్తాయి.

క్వాలిఫైయర్ 1: పాయింట్ల పట్టికలో 1, 2 స్థానాల్లోని జట్ల మధ్య పోరు జరుగుతుంది. గెలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు వెళ్తుంది.

ఎలిమినేటర్: 3, 4 స్థానాల్లోని జట్ల మధ్య పోరు జరుగుతుంది. ఇందులో ఓడిన జట్టు టోర్నీ నుంచి నిష్క్రమిస్తుంది.

క్వాలిఫైయర్ 2: క్వాలిఫైయర్ 1లో ఓడిన జట్టు, ఎలిమినేటర్ విజేత మధ్య మ్యాచ్ జరుగుతుంది. ఇందులో గెలిచిన జట్టు ఫైనల్ కి వెళ్తుంది.

**ఎల్పీఎల్ 2026 పూర్తి షెడ్యూల్:**

జూలై 17: జాఫ్నా కింగ్స్ జం గాలే గాలెంట్స్

జూలై 18: క్యాండీ రాయల్స్ జం దంబుల్లా సిక్సర్స్, గాలే గాలెంట్స్ జం కొలంబో కాప్స్

జూలై 19: దంబుల్లా సిక్సర్స్ జం జాఫ్నా కింగ్స్, కొలంబో కాప్స్ జం క్యాండీ రాయల్స్

జూలై 21: దంబుల్లా సిక్సర్స్ జం క్యాండీ రాయల్స్

జూలై 22: జాఫ్నా కింగ్స్ జం కొలంబో కాప్స్, దంబుల్లా సిక్సర్స్ జం గాలే గాలెంట్స్

జూలై 23: క్యాండీ రాయల్స్ జం కొలంబో కాప్స్, గాలే గాలెంట్స్ జం జాఫ్నా కింగ్స్

జూలై 25: గాలే గాలెంట్స్ జం క్యాండీ రాయల్స్, దంబుల్లా సిక్సర్స్ జం కొలంబో కాప్స్

జూలై 26: క్యాండీ రాయల్స్ జం జాఫ్నా కింగ్స్, గాలే గాలెంట్స్ జం దంబుల్లా సిక్సర్స్

జూలై 28: కొలంబో కాప్స్ జం జాఫ్నా కింగ్స్

జూలై 29: గాలే గాలెంట్స్ జం క్యాండీ రాయల్స్, కొలంబో కాప్స్ జం దంబుల్లా సిక్సర్స్

జూలై 30: జాఫ్నా కింగ్స్ జం క్యాండీ రాయల్స్

ఆగస్టు 1: కొలంబో కాప్స్ జం గాలే గాలెంట్స్

ఆగస్టు 2: జాఫ్నా కింగ్స్ జం దంబుల్లా సిక్సర్స్

ఆగస్టు 5: క్వాలిఫయర్ 1 (మధ్యాహ్నం 3:00), ఎలిమినేటర్ (రాత్రి 7:30)

ఆగస్టు 7: క్వాలిఫయర్ 2

ఆగస్టు 8: ఫైనల్

**లైవ్ స్ట్రీమింగ్ వివరాలు:**

భారతదేశంలోని క్రికెట్ అభిమానులు ఈ టోర్నమెంట్‌ను స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్ ఛానెళ్లలో టీవీ ద్వారా ప్రత్యక్ష ప్రసారంగా వీక్షించవచ్చు. అలాగే డిజిటల్ మొబైల్ వీక్షకులు ఫ్యాన్‌కోడ్ యాప్, వెబ్‌సైట్ ద్వారా లైవ్ స్ట్రీమింగ్ ఆస్వాదించవచ్చు. శ్రీలంకలో SLTMobitel/PEOTV ద్వారా ఈ ప్రసారాలు అందుబాటులో ఉంటాయి.

# సమంత సీమ వంటకాలు నేర్చుకుంటుందా?

పూజా హెగ్డే గ్రేస్, గ్లామర్ మరియు పెరుగుతున్న స్టార్‌డమ్





సమంత వ్యక్తిగత జీవితంలో తీసుకుంటున్న మార్పులు - అభిరుచులు సినీ వర్గాల్లో ఆసక్తికరంగా మారుతున్నాయి. నాగ చైతన్యతో వివాహం జరిగిన సమయంలో తనకు వంట చేయడం పెద్దగా రాదని, వంట గదిలో గడపడం కంటే పని మీదనే ఎక్కువ దృష్టి పెడతానని బహిరంగంగానే వెల్లడించారు. తాజాగా అదే సమంత మనసంతా వంటగదిపైనే ఉందన్నది ఇప్పుడు అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ప్రస్తుతం రాయలసీమ రుచులను నేర్చుకోవడంలో నిమగ్నమైందని తెలిసింది. రాయలసీమ వంటకాలు అనగానే ఘాటైన మసాలాలు, ప్రత్యేకమైన తయారీ పద్ధతులు గుర్తుకొస్తాయి.సామ్ సన్నిహితుల ద్వారా అందుతున్న సమాచారం ప్రకారం సమంత ఎంతో శ్రద్ధగా ఈ వంటకాలను నేర్చుకుంటున్నారు. ముఖ్యంగా సీమ రుచుల ప్రత్యేకతను ఎంతో ఎంజాయ్ చేస్తున్నారని తెలిసింది. ఒకప్పుడు వంటకు దూరంగా ఉన్న సమంత ఇప్పుడు ఇష్టంగా వంటగదిలో సమయం గడపడం అభిమానుల్ని సర్ ప్రైజ్ చేస్తుంది. సమంత ఈ నిర్ణయం తీసుకోవడానికి ఆమె వ్యక్తిగత జీవితంలో జరిగిన పరిణామాలే కారణమని నెటిజన్లు భావిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సమంత ఇంటికే పరిమితమై, ప్రశాంతమైన జీవనాన్ని గడుపుతున్నారు.గర్భవతి కావడంతో ఈ సమయంలో బయట తిరుగుళ్లు తగ్గించి ఇంట్లోనే ఉండటం ఆమెకు వంటపై ఆసక్తిని పెంచేలా చేసిందని తెలుస్తోంది. ఇంటి వాతావరణం, కుటుంబ సభ్యుల మధ్య గడపడం కొత్త అనుభూతిని అందిస్తుందని చెప్పొచ్చు. నటిగా కెరీర్‌లో బిజీగా ఉన్నప్పుడు వంటపై దృష్టి పెట్టడం కుదరకపోవచ్చు. కానీ ఇప్పుడు లభించిన విరామ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. వంట కేవలం ఆకలి తీర్చుకోవడం మాత్రమే కాదు. అది ఒక కళ అని దానిని ఆస్వాదిస్తూ చేయడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని సమంత కూడా భావిస్తున్నట్లు కనిపిస్తోంది. ఆరోగ్యకరమైన, రుచికరమైన ఇంటి భోజనం గర్భవతిగా ఆమెకు ఎంతో మేలు చేకూరుస్తుంది. తెలుగు వ్యక్తిని వివాహం ( రాజ్ నిడిమోరు) చేసుకున్న తర్వాత సంప్రదాయాలు , రుచులపై సమంతకు మక్కువ పెరిగిందని చెప్పడంలో సందేహం లేదు. తెలుగు వంటకాలకు, ముఖ్యంగా సీమ వంటకాలకు ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆ రుచులను స్వయంగా వండి రుచి చూడటంలో ఉన్న తృప్తి వేరే ఏ ఆహారంలోనూ ఉండదు. సమంత వంటకాలను వండి కుటుంబ సభ్యులకు వడ్డించడంలో ఓ కొత్త ఆనందాన్ని పొందుతున్నారని సన్నిహితులు చెబుతున్నారు. ఇటీవలే రిలీజ్ అయిన -మా ఇంటి బంగారం- చిత్రంలో నక్సలైట్...ఓ ఇంటి కోడలి పాత్రలో ఎలా అరించారో? తెలిసిందే. వంట తెలియని సమంత వంటల్లో స్పెషలిస్ట్ అని చెప్పుకుని కుటుంబంలో హైలైట్ అవుతుంది. అది రీల్ సీన్ అయినా? ఇప్పుడు రియల్ గా రాయలసీమ వంటకాలు నేర్చుకుంటూ రియల్ గానూ అత్తింటి కుటుంబంలో మంచి వంట గత్తెను అనిపించుకుంటోంది.



ఎమరాల్డ్ కార్సెట్ లుక్‌లో రాశి ఖన్నా తలదాచుకుంది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965